# ప్రభాత్

**ఈ సంచికలో...**


- కోక్-పెప్సీలను తన్ని తరిమేద్దాం ... 6
- ఉద్యమ అణచివేత రూపాల్లో గాంప్‌బంది ఒకటి... 9
- అడవుల పరిరక్షణ - ఒక ప్రత్యామ్నాయం ... 13
- పాలస్తీనా 'శాంతి' రోడ్డు మ్యాప్ ... 16
- రగులుతున్న పశ్చిమాసియా రావణకాష్టం ... 21
- ఇరాక్ ప్రతిఘటనకు బెంబేలెత్తుతున్న అమెరికన్ సామ్రాజ్యవాదం ... 23
- చంద్రబాబుపై పిజిఏ దాడి ... 27



**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) [పీపుల్స్‌వార్] దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ అధికార త్రైమాసిక పత్రిక**

**సంపుటి - 16** | **సంచిక - 4** | **అక్టోబర్ - డిసెంబర్ 2003** | **వెల - 10 రూపాయలు**


## ప్రజల అసంతృప్తిని సొమ్ము చేసుకొని అధికారంలోకి వచ్చిన హిందూ మతోన్మాద బిజెపి ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టండి !

# జనతన సర్కార్‌ల నిర్మాణానికి మరింత ముందుకు రండి !

దేశంలోని ఐదు రాష్ట్రాల్లో ఎన్నికల లొల్లి ముగిసింది. ఢిల్లీ తప్ప రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లోని అధికార కాంగ్రెస్ ప్రభుత్వాలు పతనమైనాయి. అధికారంలో ఉన్న ప్రభుత్వాల ఐదేళ్ల వైఫల్యాలను వినియోగించుకొని ప్రతిపక్ష బిజెపి అధికారంలోకి వచ్చింది. అధికారంలో ఉండి ఐదేళ్లు పాలించిన పార్టీలను ప్రజలు సాధారణంగా తిరిగి ఎన్నుకోవడం లేదని గత 15-20 ఏళ్ల దేశ రాజకీయ ఎన్నికల పోకడలను చూస్తే సులభంగానే బోధపడుతుంది. దీన్నే యాంటీ ఎస్టాబ్లిష్‌మెంట్ లేదా నెగెటివ్ ఓటు అని అనడం సాధారణమైపోయింది. అయితే ప్రతిపక్షాలు బలహీనంగా ఉండి, తీవ్రమైన చీలికలున్న చోట మాత్రం అధికార పార్టీయే తిరిగి ఎన్నిక కావడమనేది కదాచిత్‌గా జరుగుతుందనడానికి నేటి ఢిల్లీ ఎన్నికలే ఒక ప్రత్యక్ష ఉదాహరణ. దోపిడీవర్గాల్లోని ఏదో ఒక ముఠాకు దోచుకోవడానికి అవకాశం ఇస్తూ ఐదేళ్లకొకసారి ఎన్నుకోవడమే ఓట్లు అని మార్క్సిస్టు మహోపాధ్యాయులు 150 ఏళ్ల కింద చెప్పిన వాస్తవం ప్రతి తడవ ఎన్నికల సందర్భంగా పదే పదే రుజువవుతోంది. అంటే ఇంతకాలం కాంగ్రీ పాలనలో మగ్గిన ప్రజలు ఇకపై బిజెపి పాలన కింద తమ భవిష్యత్‌ను పరీక్షించుకోవాలి. అయితే 1993కు ముందు ఈ రాష్ట్ర ప్రజలు బిజెపి పాలనతో విసిగి వేసారే కాంగీకి పట్టం గట్టారు. ఇప్పుడు కాంగీ స్థానంలో తిరిగి బిజెపి వచ్చింది.

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం 1 నవంబర్ 2000 నాడు ఏర్పడింది. గడచిన మూడేళ్లలో ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించటంలో, ఆకాంక్షలను నెరవేర్చటంలో దారుణంగా విఫలమైంది. రాష్ట్రంలోని అన్ని సెక్షన్‌ల ప్రజల విశ్వాసాన్ని కోల్పోయింది. ప్రజల ప్రయోజనాలను వంచించి బహుళజాతి కార్పొరేషన్‌ల లాభాలకోసం రాష్ట్రంలోని అపారమైన ప్రకృతి వనరులను అప్పగించింది. నిరుద్యోగ సమస్య పరిష్కారమైపోతుందని ఆశించిన యువత భవిష్యత్ స్వప్నాలు ఛిద్రమైనాయి. 'ధాన్ కా కటోరా'గా ఉండే రాష్ట్ర రైతాంగానికి పొట్టచేత పట్టుకొని వలసపోక తప్పని స్థితిలో నూతన రాష్ట్రంలో ఏం మార్పు లేకుండా పోయింది. పంట పొలాలకు నీళ్లు కరువు, రోహిణి ఎండల్లో గ్రామాల్లో తాగునీరు కరువు, గిట్టుబాటు ధరలు లేక రైతుల ఆత్మహత్యలు, కందమూలాలు తవ్వుకున్నా కడుపు నిండని ఆదివాసుల దుస్థితి లాంటి పునాదివర్గాల ప్రజల సమస్యలలో కొత్త రాష్ట్రంతో గానీ, 'ఆదివాసీ' ముఖ్యమంత్రి అవడంతో గానీ వచ్చిన మార్పేమీ లేదు. కార్మికులు పెద్దయెత్తున ఉద్యోగాలు కోల్పోయారు. ప్రైవేటైజేషన్ ప్రభుత్వ ఏకైక నినాదమైంది. 28 వేల మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ డిమాండ్లతో వీధుల్లోకి వస్తే ఉద్యోగాలు ఊడిపోతాయని జోగి హెచ్చరించాడు. శాంతి భద్రతల సమస్య దారుణంగా దిగజారి పట్టణాల్లో మధ్యతరగతి ప్రజలు తీవ్రమైన అభద్రతాభావంతో నిరంతరం ఒక ఉద్రిక్త వాతావరణంలో గడపడం లాంటి అనేక ప్రజా సమస్యల్లో ఏవీ తీరలేదు. నూతన రాష్ట్రంలో ప్రజల ఆశలు ఏమాత్రం నెరవేరలేదు. దానితో వారు జోగి ప్రభుత్వానికి బుద్ధి చెప్పారు. అది ఇంకెంత మాత్రం అధికారంలో ఉండటానికి వీల్లేదన్నారు. తమ ఓటుతో

**వేలాది పోలీసు, అర్ధ సైనిక బలగాల పాశవిక నిర్బంధానికీ, అత్యాచారాలకూ, హత్యాకాండలకూ భయపడకుండా బూటకపు ఎన్నికల్ని బహిష్కరించి ప్రజా రాజ్యాధికార స్థాపనే ఏకైక ప్రత్యామ్నాయమని నినదించిన బస్తర్‌వాసులకు మా విప్లవ జేజేలు!**

*— సిపిఐ (ఎం-ఎల్) [పీపుల్స్‌వార్], దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ*

తేల్చేశారు. అయితే బిజెపి అధికారంలోకి వస్తే ఈ పరిస్థితుల్లో గొప్ప మార్పుంటుందని మాత్రం వారూహించి ఈ పని చేశారనుకోలేం. అధికారంలో ఉన్న అసమర్థ ప్రభుత్వాన్ని గద్దె దింపడానికి విప్లవకర ప్రత్యామ్నాయ మార్గం అర్థం కాక అనివార్యంగా ప్రతిపక్ష పార్టీకి ఓటు వేశారు. దీనినే నెగెటివ్ ఓటుగా చెప్పుకుంటున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ఎదుర్కొన్న పరిస్థితులనే మరో ఐదేళ్ల తర్వాత బి.జె.పి.కి ఎదురుకాక తప్పదు. అందుకే నేటి దండకారణ్య ప్రజల మార్గమే రేపు విశాల ప్రజారాశుల మార్గం కావడం తప్ప నెగెటివ్ ఓటు వారి మౌలిక సమస్యలను పరిష్కరించలేదు. పోరాటం ద్వారా జనతన సర్కార్‌ను ఎన్నుకోవడమే వారి ముందున్న ప్రత్యామ్నాయం.

ఏ యేటి కాయేడు ప్రజలను మరింత దోపిడీకి గురిచేస్తూ, దారిద్ర్యానికి నెట్టుతూ ప్రజల మూపులపై భూస్వామ్యం-దళారీ పెట్టుబడిదారీ విధానం మరియు సామ్రాజ్యవాదం అనే మూడు పర్వతాల బరువు పెరగడం, అంతులేని సంక్షోభంలో కూరుకుపోతున్న వాటి భారాన్ని మోయడమే తప్ప దేశంలో గత 50 ఏళ్లుగా జరుగుతున్న ఎన్నికల తంతుతో ప్రజలకు ఒరిగిందేమీ లేదు. ఎన్నికల్లో గెలిచి అధికారాన్ని చేపడుతున్న పార్టీలన్నీ దోపిడీవర్గ పార్టీలే. జెండా రంగులో, పార్టీ పేరులో, ఉపన్యాసాల సరళిలో, ఉన్మాదం వ్యక్తీకరణలోనే తేడా తప్ప అభివృద్ధి జపం చేస్తూ విదేశాల నుండి అప్పులు తేవడంలో, బహుళజాతి కంపెనీల ముందు సాగిలబడి సామ్రాజ్యవాదులకు సేవ చేయడంలో, భూస్వామ్య దళారీ బూర్జువాలకు ప్రయోజనాలు చేకూర్చడంలో తేడా లేదు – సరికదా ఇవి ఒకదానితో ఒకటి పోటీ పడుతున్నాయి.

కొత్త రాష్ట్రమైన ఛత్తీస్‌గఢ్ విధానసభకు తొలిసారిగా ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలకు అపూర్వ స్థాయిలో బందోబస్తును ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని 16 జిల్లాల్లో 7 జిల్లాలను నక్సల్ ప్రభావిత జిల్లాలుగా ప్రకటించి వేల సంఖ్యలో బలగాలను తరలించారు. ఢిల్లీ, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లో ఎక్కడా కూడా లేని విధంగా ఛత్తీస్‌గఢ్‌లో భారీయెత్తున మోహరించబడిన 60 వేల ఖాకీల తుపాకుల పహరాలో 35 సైనిక హెలికాప్టర్లు ఆకాశమార్గంలో అడవిని కాపు కాస్తుండగా ఎన్నికలు ముగించుకున్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ద్వారా ఓటర్లను ఆకర్షించడానికి విఫల ప్రయత్నాలు చేశారు. హైటెక్ ప్రచారంతో ఓటర్లపై యుద్ధం చేశారు. బడా పార్టీల అభ్యర్థులు ఎన్నికల్లో గెలవడానికి ఒక్కొక్కరు కోటి రూపాయలైనా ఖర్చు చేసి ఉంటారని పరిశీలకులు అంచనా వేశారు. రకరకాల వాగ్దానాలతో, ప్రలోభాలతో, ఆశలతో, ఆకర్షణలతో బడా పార్టీల రాజకీయ నాయకులు ఓటర్లను లోబర్చుకోవడానికి పోటీపడ్డారు. మద్యంతో, మందబలంతో ఓట్లను కొనుక్కోవడానికి ఎన్ని తంటాలైనా పడ్డారు. దినదినం వస్తువ్యామోహంతో కొట్టు మిట్టాడుతున్న మధ్యతరగతి ప్రజలను ఆకర్షించడానికి, వారిలో తమ పార్టీ ప్రచారాన్ని ముమ్మరం చేయడానికి రకరకాల మార్కెట్ సరుకులకు పార్టీ జెండాలు - రంగులు పులిమి, నినాదాలు ఎక్కించి ఉచితంగా పంచి పెట్టారు. బడి పిల్లలను కూడా వదల్లేదు. వారి వీపులను అలంకరించే పుస్తకాల సంచులు పార్టీ నినాదాలతో ప్రత్యక్షమయ్యాయంటే ప్రచారం ఏ స్థాయిలో జరిగిందో ఊహించుకోవచ్చు.

ఈ ఎన్నికల ప్రచారంలో మతం ఒక ప్రత్యేకమైన పాత్రను పోషించింది. అధికారపక్షం, ప్రతిపక్ష బిజెపిలు రెండూ మతప్రచారంలో పోటీ పడ్డాయి. అన్ని రాష్ట్రాల్లోనూ ఇదే తంతు నడిచింది. ఇక్కడ ఛత్తీస్‌గఢ్‌లో అధికార పార్టీ లక్షలాది రూపాయలను గుడుల నిర్మాణానికి కేటాయించింది. ఇతర రూపాలలో కూడా మత ప్రచారానికి ఒడిగట్టింది. మరోవైపు గత కొద్ది సంవత్సరాలుగా బిజెపి ఉమ్మడి మధ్యప్రదేశ్‌లో అనేక మతోన్మాద దుశ్చర్యలకు ఒడిగడుతూ వస్తోంది. ఉమ్మడి మధ్యప్రదేశ్‌గానీ, ప్రస్తుత ఛత్తీస్‌గఢ్‌గానీ పెద్దయెత్తున ఆదివాసీలను కలిగి ఉన్న రాష్ట్రాలు. వీరికి 'హిందుత్వ'తో గానీ, క్రైస్తవంతోగానీ సంబంధమే లేదు. కానీ వీరిని క్రైస్తవ మతంలో కలుపుకున్నారనీ, కలుపుకుంటున్నారనీ గత చరిత్రను తవ్వి తీస్తూ వీరందరిని తిరిగి హిందూమతంలో చేర్చుకునే ఒక పెద్ద కుట్ర ఘర్ వాపసీ పేరుతో సాగుతోంది. ఇదంతా సంఘ్ ముఠా తమ పవిత్ర కర్మగా భావిస్తూ అమానుష పద్ధతులతో ఆదివాసీలను అవమానపరుస్తోంది. దీనంతటికి జుదేవ్ ఒక పెద్ద ఖల్‌నాయక్‌గా ప్రసిద్ధి. ప్రస్తుత ఛత్తీస్‌గఢ్ ఎన్నికల్లో ఇతడే బిజెపికు నాయకత్వం వహిస్తూ తనదైన శైలిలో మతద్వేషాన్ని రెచ్చగొట్టాడు. తమ పార్టీ అధికారంలోకి వస్తే 'హిందుత్వ' రాజ్యమేలుతుందన్నారు. పైకి వీరంతా అభివృద్ధి గూర్చి తెగ ప్రచారం చేసినా 'హిందుత్వ'ను మాత్రం వదలుకోలేదు. హిందూ ఓటు బ్యాంక్‌ను కొల్లగొట్టడంలో పోటీపడి విజయం సాధించారు.

ఈ ఎన్నికల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా అవినీతి కుంభకోణాలు వెలుగు చూశాయి. రాష్ట్ర, కేంద్ర మంత్రుల అవినీతి చర్యలు ప్రజలకు అక్షరాలా కళ్లకు కట్టినట్లుగా బహిరంగమయ్యాయి. డబ్బులకు అమ్ముడుపోయి పార్టీలను ఫిరాయించిన కేసులు కూడా అనేకం వెలుగు చూశాయి. ఒక దశలో వీటి మూలంగా జూదేవ్ ముఖ్యమంత్రి పోటీ నుండి కూడా విరమించుకోక తప్పలేదు. కాగా, ఎన్నికల ఫలితాలైనా పూర్తిగా వెలువడక ముందే అజిత్ జోగి లక్షల రూపాయల ఆశ చూపి ఫిరాయింపులను ప్రోత్సహించడానికి పూనుకున్నాడనే ఆరోపణపై అడ్రస్ లేకుండా పోయాడు. పాలక ముఠాల మధ్యన అధికారం కోసం కుమ్ములాట ఎలా తీవ్రమవుతుందో ఈ అవినీతి కుంభకోణాలు, అధికార దుర్వినియోగాలు, ఫిరాయింపులు చక్కగా వ్యక్తం చేశాయి.

పై ఎన్నికల్లో ఆగడాలు, దగా-దౌర్జన్యాలు, ప్రలోభాలు, మత విద్వేషాలు రెచ్చగొట్టడం, బూటకపు వాగ్దానాలు, పార్టీ ఫిరాయింపులు, డబ్బు ప్రవహించడం లాంటివి రాజ్యమేలడం ఒక ఎత్తు అయితే వేలాది మంది ఖాకీ బలగాలు సృష్టించిన యుద్ధ వాతావరణం ఒక ఎత్తయింది. ముఖ్యంగా నక్సల్ ప్రభావిత ప్రాంతాలుగా ప్రభుత్వం పేర్కొన్న ప్రాంతాల్లో గతంలో ఎన్నడెరుగని విధంగా ఖాకీ బలగాలను మోహరించారు. తమ ఎన్నికల ప్రజాస్వామ్యాన్ని లోకానికి చాటుకునేందుకు, పెద్దెత్తున ప్రజలు ఎన్నికల్లో పాల్గొన్నారనే విషయాన్ని శాతాల్లో ప్రపంచం ముందు పెట్టడానికి, నక్సలైట్ల ఎన్నికల బహిష్కరణ పిలుపు ఉత్తదయిందనే ఒక అబద్ధాన్ని, ప్రజలు నక్సలైట్ల మాటను ఖాతర్ చేయకుండా స్వచ్ఛందంగా ఎన్నికల్లో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారన్న ఒక అపోహను, ఒక కల్పనను బయటి ప్రజలచే నమ్మించడానికి ప్రభుత్వం, మీడియా ఎంతగా బరితెగించాయో అవి చేసిన నిరంతర కుప్రచారమే తెలియజేసింది. ముఖ్యంగా బిజెపి తొలి నుండి కూడా నక్సలైట్ల సమస్యనే ఒక ప్రధాన సమస్యగా చిత్రిస్తూ ముమ్మరంగా దుష్ప్రచారాన్ని చేసింది. అనేక అబద్ధాలతో నిత్యం ప్రకటనలను విడుదలచేస్తూ వచ్చింది. బిజెపి నేతలందరూ తమ ఉపన్యాసాల్లో నక్సలైట్ల సమస్యనే ఈ రాష్ట్రంలో ప్రధాన సమస్యన్నారు. ఎన్నడెరుగని విధంగా వేలాదిమంది పోలీసుల భద్రతా ఏర్పాట్ల మధ్య

జగ్‌దల్‌పూర్‌లో ఎన్నికల సభలో పాల్గొన్న ప్రధాని వాజ్‌పాయి ఈసారి తన ఎన్నికల ప్రచారంలో భోపాల్ నుండి జగదల్‌పూర్ వరకు నక్సలైట్ల సమస్యను ఎత్తకుండా ఉండలేకపోయాడు. ఇదంతా ఒక ఎన్నికల ప్రచారంగా గాకుండా నక్సలైట్ల నిర్మూలనా ప్రచారంగానే సాగిందనడం వాస్తవాన్ని తెలపడమే అవుతుంది. ఇలా చివరి వరకు భద్రతాచర్యల పేరుతో ఖాకీల అరాచకాలు, అత్యాచారాలు, బెదిరింపులు, జులుం, జబర్దస్తీ ప్రజలకు ఊపిరి సలుపుకోనివ్వకుండా తయారయ్యాయి. ఎన్నికల పార్టీల ప్రచారం కూడా (ముఖ్యంగా బిజెపి) దానితో పోటీపడుతూ నక్సలైట్ల సమస్యను కేంద్రం చేసుకొని సాగింది. ఇక చివరి వారం అయితే బస్తర్ ఒక కాశ్మీర్‌ను తలపింపజేసింది. రెండు శత్రు బలగాల మధ్య సరిహద్దులను విభజిస్తూ సాగే ఒక దాడి వాతావరణం ఏర్పడింది. ఇది ఒక ఎన్నికల కోసం, ఒక 'ప్రజాస్వామ్య' వ్యవస్థలో స్వచ్ఛందంగా ఓటర్లు తమ ప్రతినిధులను ఐదేళ్ల కోసం ఎన్నుకోవడంకై జరుగుతున్నట్టుగా గాకుండా నక్సలైట్ల నిర్మూలనా కేంపెయిన్‌గానే సాగించారు. విచ్చలవిడిగా కాల్పులు జరుపుతూ, స్త్రీ పురుష భేదం లేకుండా జనాలను అరెస్టులు చేస్తూ, రోడ్లపై ఎదురుపడిన వారెవరన్నది కూడా కనీసం చూడకుండా హింసించారు. నక్సలైట్ల ఆనుపానాలు గుర్చి ప్రశ్నించడం మాత్రమే గాకుండా పి.జి.ఏ. ప్రతిఘటనా చర్యలు ఎదురై కాల్పుల్లో పోలీసులు గాయపడటమో, చావడమో సంభవించిన చోట లేదా ఆ పేరుమీద అమాయకపు ఆదివాసీ రైతులను బూటకపు ఎన్‌కౌంటర్లలో హతమార్చడం వారి హంతకదాడులకు ఒక పరాకాష్టగా నిలిచింది. పోలీసులతో జరిగిన కాల్పుల్లో మూడు డజన్ల మంది నక్సలైట్లు గాయపడడమో, మరణించడమో జరిగిందని బస్తర్ డి.ఐ.జి. సంత్ కుమార్ పాశ్వాన్ ప్రకటించడాన్ని బట్టి ఇక్కడ అమలైన ఒక భయంకర వాతావరణాన్ని ఎవరైనా సులభంగానే ఊహించుకోవచ్చు. అందుకు కాంకేర్ జిల్లాలోని కోయిలిబేడ సమీపంలో ఇద్దరు రైతులను హతమార్చడం ఒక ప్రత్యక్ష ఉదాహరణ. భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి మూలంగా చెప్పుకునే ఎన్నికల్లో అమాయక ఆదివాసులు తమ ఓటును వినియోగించుకోవడానికి ఎలాంటి వాతావరణం తయారైందో గ్రహించవచ్చు. ఈ ఎన్నికల వ్యవస్థపై నమ్మకం, భ్రమలు కోల్పోయినవారు స్వచ్ఛందంగా ఈ ఎన్నికలను బహిష్కరించుకునే హక్కే లేకుండా తుపాకులు ఎక్కుపెట్టబడ్డాయి. మోర్టార్ షెల్స్ మారుమోగాయి. ప్రజాస్వామ్యం వర్ధిల్లింది!

ఎన్నికల ప్రణాళికల్లో అన్ని రాజకీయ పార్టీలూ గత 50 ఏళ్లుగా రాసుకుంటూ వస్తున్న హామీలనే తిరిగి గుప్పించాయి. ఇన్నేళ్లుగా ప్రజల ఏ ఒక్క మౌలిక సమస్య ఎందుకు పరిష్కరించలేకపోయాయో, పాత రికార్డునే పదేపదే కొత్త మాటల్లో ఎందుకు చెప్పుకోవలసి వస్తుందో ప్రజలకు జవాబుదారీ వహించాల్సిన ఏ ఒక్క రాజకీయ పార్టీ కూడా వెల్లడించలేదు. అసలు కనీసం గుర్తించడం లేదు. ఇదే వాటి స్వభావం. 50 ఏళ్లలో ఈ వ్యవస్థ మరింత అధ్వాన్నంగా తయారవడానికి, అన్ని రంగాల్లో సమస్యలు తీవ్రం కావడానికి, పేద ప్రజల బతుకులు ఇంకా దుర్భరంగా దిగజారడానికి బోనులో నిలబడాల్సిన ఈ నేరస్థ పార్టీలు నిస్సిగ్గుగా మళ్లీ మళ్లీ తమనే ఎన్నుకోవాలని ప్రజల ముందుకు రావడం క్షమించరానిదే. ఏ రోజుకారోజు పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు, ఏటేటా ప్రబలుతున్న నిరుద్యోగం, ప్రజల కనీస అవసరాలైన విద్య, వైద్యం, తాగు నీరు, గృహావసరాలు తీరకపోవడం, అర్ధాకలితో, పస్తులతో రోజొక గండంగా తయారవడం, వ్యవసాయ భూములు లేకుండా అలమటించడం, ఉన్న భూములు ప్రభుత్వ అటవీ భూములంటూ వాటిని బేదఖల్ చేయాలనే చట్టాలతో ఆదివాసుల జీవితాలు బుగ్గిపాలవడం, వ్యవసాయ భూములు సాగునీటి వ్యవస్థకే నోచుకోకపోవడం లాంటి అనేక సమస్యలు ఈ దోపిడీ వ్యవస్థ యొక్క సర్వసాధారణ లక్షణాలుగా మారి పెరుగుతున్నాయే తప్ప తగ్గడం లేదు. అలాగే గత 15 ఏళ్లుగా ఈ దేశంలో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న నూతన ఆర్థిక విధానాల ఫలితంగా అన్ని రంగాల్లోని ప్రజల బతుకులు మరింత బజారుపాలవుతున్నాయి. సామ్రాజ్యవాదుల ప్రపంచీకరణలో భాగంగా అమలవుతున్న ప్రైవేటీకరణ, సరళీకరణల ఫలితంగా రైతాంగం, కార్మికులు, ఉద్యోగులు, విద్యార్థులు, మేధావులు, మహిళలు, ఆదివాసీలు ఇలా సమాజంలోని అన్ని వర్గాల (సెక్షన్‌ల, సమూహాల) ప్రజలు నిత్యం సతమతమవుతున్నారు. ఈ సంక్షోభ భారాన్ని భరించలేని ప్రజలు ఎన్నికలు ఎన్ని వచ్చిపోతున్నా తమ సమస్యలు తీరకపోవడంతో మార్గాంతరం తోచక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇవన్నీ ఈ కుళ్లిన వ్యవస్థ యొక్క దీర్ఘకాల జబ్బులు. ఇన్ని సమస్యలతో పీడిత ప్రజలు అంగలారుస్తుంటే ఎన్నికల పార్టీలు మాత్రం అభివృద్ధి జపం మానుకోలేదు. అసలు దేనిని అభివృద్ధిగా చిత్రిస్తున్నారో ప్రజల ముందుంచనే లేదు. కాకపోతే రోడ్లు పోయించడం, పరిశ్రమలను నెలకొల్పడం, విద్యుత్ సరఫరాను పెంచడం లాంటి కొన్ని సమస్యలను ప్రస్తావించినా ఈ రంగాల్లో ఇన్నాళ్లుగా జరిగిన అభివృద్ధి ఫలితంగా బాగుపడిందెవరు? పేదలకు ఒరిగిందేమిటి? ఇంకా ఇంకా వీటిని అభివృద్ధిపర్చడం ద్వారా లాభపడనున్నదెవరన్న విషయంపై మాత్రం పల్లెత్తు మాట మాట్లాడలేదు. కానీ ఒక నగర్‌నార్‌ను, ఒక బాల్కోను, ఒక ఆర్.టి.సి.ని, శివనాథ్ జలాల అమ్మకాన్ని, బహుళజాతి కార్పొరేషన్ సింజెంటా విత్తనాల వ్యవహారాన్ని, పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన ప్రైవేట్ కాలేజీలు, విశ్వవిద్యాలయాలను, పట్టణాల్లో గల్లి గల్లికి దర్శనమిస్తున్న ప్రైవేట్ హైటెక్ ఆసుపత్రులను పరిశీలిస్తున్న జనం వీరి అభివృద్ధిని సులభంగానే నిర్వచించుకోగలుగుతున్నారు. అభివృద్ధి మాటున విదేశాల నుండి అప్పులు తెచ్చి కోటానుకోట్ల రూపాయలు వెచ్చిస్తూ రోడ్లు పోయించడం ద్వారా, రైలు మార్గాలు నిర్మించడం ద్వారా జరుగుతుందేమిటో ఇన్నాళ్లుగా చూస్తున్న ప్రజలకు చెప్పాల్సిన పనే లేకుండా పోయింది. ఈ రోడ్లు, రైలు పట్టాలు ప్రధానంగా ఇక్కడి వనరులను సామ్రాజ్యవాద బహుళజాతి కార్పొరేషన్లు తరలించుకుపోవడానికేనన్నది గత 30 ఏళ్లుగా చూస్తూ తేల్చుకున్నారు. అందుకే అభివృద్ధి అంటే దోపిడీవర్గాల అభివృద్ధేననీ, అది పీడిత ప్రజల జీవితాలను నిలువునా దోచుకోవడం ద్వారానే జరుగుతూ వస్తుందని రుజువైంది.

ఇప్పుడు గద్దెనెక్కిన బిజెపితో గానీ, ముఖ్యమంత్రి రమణ్‌సింగ్‌తోగానీ గతం కన్నా మిన్నగా ఏం జరుగుతుంది ?

దీనికి ఒక్క మాటలో జవాబు చెప్పుకుంటే మాత్రం ఏం జరగదనే చెప్పితే సరిపోతుంది. ఇంతేకాదు, రోజు రోజుకు తీవ్రమవుతున్న దేశ-సామ్రాజ్యవాద సంక్షోభం మూలంగా పరిస్థితులు మరింత దిగజారుతాయని చెప్పుకోవడం ఇంకా సరిగ్గా ఉంటుంది. ఎందుకంటే –

1) బిజెపి నాయకత్వంలోని ఎన్.డి.ఏ. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలకు పూర్తిగా కట్టుబడి వాటిని అమలుపరుస్తోంది. రెండవ విడత సంస్కరణల పేరుతో యశ్వంతసిన్హా ప్రకటించిన విధానాలు ఆ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.

2) సామ్రాజ్యవాద ప్రపంచీకరణలో భాగంగా దేశ ప్రజల వ్యతిరేకతను ఏమాత్రం ఖాతరు చేయకుండా తన లక్ష్యం ప్రకారం ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేట్‌పరం చేసేస్తోంది. కారుచౌకగా బహుళజాతి కార్పొరేషన్‌లకు, దళారీ పెట్టుబడిదార్లకు అప్పగిస్తోంది. దీని ఫలితంగా దేశంలో.... చిన్న తరహా, మధ్యతరహా పరిశ్రమలు మూతపడి వాటి నిర్వాహకులెందరో దివాళా తీస్తున్నారు. లక్షలాది కార్మికులు వీధిన పడుతున్నారు.

3) డబ్ల్యు.టి.ఓ. నుండి భారతదేశం ఉపసంహరించుకోవాలన్న భారత రైతాంగ, ప్రజల డిమాండ్‌ను బుట్టదాఖలు చేస్తూంది. డబ్ల్యు.టి.ఓ. విధానాల్లో కొన్ని రాయితీల కోసం దేబిరిస్తూ అంతిమంగా రైతాంగ జీవితాలను ప్రపంచ మార్కెట్‌కు బలంగా ముడివేసి అస్తవ్యస్తం చేసేస్తోంది. భరించలేని రైతాంగం దిక్కుతోచక ఆత్మహత్యలకు పాల్పడడం దేశంలో ఒక కొత్త పోకడగా నూతన ఆర్థిక విధానాల ప్రారంభం నుండి క్రమంగా విస్తరిస్తూ పెరుగుతోంది.

4) కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాలన్నీ ప్రజా సంక్షేమ కార్యక్రమాల నుండి పూర్తిగా తప్పుకున్నాయి. విద్య-వైద్యం పూర్తిగా ప్రైవేట్‌పరమై పునాది వర్గాల ప్రజలు వంచించబడుతున్నారు.

5) ప్రైవేటైజేషన్, సరళీకరణకు అనుగుణంగానే ఈ దేశంలోని అత్యున్నత న్యాయస్థాన తీర్పులు వెలువడుతున్నాయి. విశాల కార్మికవర్గం అసమాన త్యాగాలతో పోరాడి సాధించుకున్న సమ్మె హక్కును సుప్రీం కోర్టు ఒక్క కలం పోటుతో బుట్టదాఖలు చేసేసింది.

6) కేంద్ర స్థాయిలో, రాష్ట్రాల్లో ఏనాటికానాడు భారీ, అతి భారీ అవినీతి కుంభకోణాలు వెలుగు చూస్తున్నాయి. ప్రస్తుతం 33 వేల కోట్ల అవినీతి కుంభకోణంగా అబ్దుల్ కరీం తెల్గీ స్టాంప్ పేపర్ల కుంభకోణం అనేక రాష్ట్రాలను అతలాకుతలం చేసేస్తోంది. మంత్రులు, అత్యున్నతాధికారుల ముఠా ఎంత దగ్గరగా అల్లుకపోయి ఒక దశాబ్దకాలం పైగా ఎంత పకడ్బందీగా ఈ కుంభకోణానికి పాల్పడ్డారో వార్తలు వింటుంటేనే సాధారణ ప్రజల గుండెలు దడదడలాడుతున్నాయి. 1990 తర్వాత నుండి విపరీతమైన కుంభకోణాలు వెలుగులోకి రావడం చూస్తుంటే సాధారణ ప్రజలకు అంతుపట్టకుండా పోయింది.

7) దేశంలోనూ, అంతర్జాతీయంగానూ నేడు ఉగ్రవాదమే దోపిడీ పాలకవర్గాలకు ఏకైక సమస్యగా మారింది. దీనికి వ్యతిరేకంగా ప్రపంచ ప్రజల నెంబర్ వన్ శత్రువు అమెరికా నాయకత్వంలో అంతర్జాతీయ ఉగ్రవాద వ్యతిరేక ఐక్యసంఘటన ఏర్పడితే అందులో చేరిన దేశాలు తమ దేశాలలో ఉగ్రవాదాన్ని అణచివేసే పేరుతో అమెరికా ఆదేశాల్ని అమలుచేస్తున్నాయి. ఇందులో భాగంగా మన దేశంలోని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అభ్యుదయ, విప్లవ, మైనార్టీ ప్రజల, ఆదివాసీ ప్రజలకు చెందిన 36 సంఘాలను నిషేధించింది. ఎమర్జెన్సీలో ఎస్మా, తర్వాత టాడా, ప్రస్తుతం వాటికన్నా భయంకరమైన పోటా వేటుకు ప్రజలు బలవుతున్నారు. నిత్యం దిగజారుతున్న బతుకులతో ఉద్యమిస్తే దుర్మార్గమైన చట్టాలతో ప్రజా ఉద్యమాలను నిరంకుశంగా అణచడంలో పాలకవర్గ పార్టీలు పోటీపడుతున్నాయి.

పైన పేర్కొన్న విషయాలు సర్వసాధారణమైనవిగా మారుతున్నాయి. ఇలాంటి పరిస్థితులు ఈ దేశంలో తలెత్తడానికి ఇక్కడి పాలకవర్గాలే కారణం. బూర్జువా, రివిజనిస్టు పార్టీలన్నింటికీ ఈ వర్గాలే నాయకత్వం వహిస్తున్నాయి. అలాంటప్పుడు ఈ పార్టీల నీడలో, నెగెటివ్ ఓటుతో పార్టీలు మారడమే తప్ప ప్రజల బ్రతుకులు మారవు.

ఈసారి రాష్ట్రంలో బిజెపి మరెవరితో పొత్తు లేకుండా స్వంతంగా ప్రభుత్వాన్నేర్పరిచింది. దీనికి రమణ్‌సింగ్ ముఖ్యమంత్రి అయ్యాడు. ఇతడు గత ముప్పై ఏళ్లుగా సంఘ్ ముఠాలో కొనసాగుతున్నాడు. సంఘ్ ముఠా (సంఘ్ పరివార్)కు తల్లిలాంటి ఆర్.ఎస్.ఎస్.లో ఒక ప్రచారక్‌గా, తర్వాత జనసంఘీయుడుగా, ఇప్పుడు బిజెపి నేతగా ముఖ్యమంత్రి పదవికి ఎదిగినవాడు. అధికారాన్ని చేపట్టినప్పటినుండే తన హిందూ మతోన్మాద చర్యల అమలుకు పంజా విప్పి దూకుడుగా పూనుకుంటున్నాడు. మొట్టమొదట గోవధ నిషేధం అన్నాడు. ఆ వెంటనే పోటా అమలు ఆలోచిస్తామన్నాడు. తర్వాత శాంతి భద్రతల సమస్య ఎత్తుకున్నాడు. పోలీసు వ్యవస్థ ఆధునీకరణ అంటున్నాడు. ఎంతటి జటిల సమస్యలు ఎదురైనా ఐదేసి కిలోమీటర్లు ప్రైవేట్ ఠేకేదార్లకిచ్చి ఏకకాలంలో భారీ బందోబస్తుతో రోడ్ల నిర్మాణం పూర్తి చేస్తానన్నాడు. వీటితోపాటు యువతను పక్కదారి పట్టించడానికి నిరుద్యోగ భృతి పెంచడం, ఉద్యోగాల ఆశ చూపడం, రైతాంగ సమస్యలు తీర్చడం, వ్యవసాయాధారిత పరిశ్రమలు నెలకొల్పడం లాంటి అమలుకు నోచుకోని ఊకదంపుడు హామీల సందేశాలు విడుదల చేస్తున్నాడు. నక్సలైట్లను కఠినంగా అణచివేయాలని ఎన్నికలకు ముందు నుండే మాట్లాడుతూ వచ్చిన బిజెపి అధికార పగ్గాలు చేతికి రాగానే ఉద్యమ అణచివేతను తీవ్రతరం చేయబోతున్నట్టుగా ప్రకటించింది. సిఆర్‌పి బలగాలను శాశ్వత ప్రాతిపదికపై బస్తర్, సర్గుజ ప్రాంతాల్లో మోహరిస్తామని రమణ్‌సింగ్ ప్రకటించాడు. ఇకపోతే నల్లచట్టమైన 'పోటా'ను అమలు చేసే విషయంలో త్వరలోనే మంత్రివర్గం సమావేశమై నిర్ణయం తీసుకుంటుందని కూడా ప్రకటించాడు. అలాగే, బిజెపి ప్రకటించిన ఏడాది కార్యక్రమాన్ని నిశితంగా పరిశీలిస్తే రానున్న రోజుల్లో కాంగీ నాటికన్నా పరిస్థితులు ఇంకా హీనంగా దిగజారిపోక తప్పవనే తెలుస్తుంది. రానున్న సంవత్సరం లోక్‌సభకు జరిగే ఎన్నికల్లో అదనంగా సీట్లను సంపాదించాలనే లక్ష్యంతో బిజెపి తన 'మిషన్ 2004'ను కూడా ప్రకటించింది. దాన్ని చేరుకోవడానికి దేశవ్యాప్తంగా అది అన్ని విధాలా బరితెగిస్తోంది. దోపిడీ పాలకవర్గ పార్టీలు చేపట్టే కంటితుడుపు చర్యలేవీ ప్రజల సమస్యలను పరిష్కరించలేవు సరికదా వారిని పోరాట, ప్రతిఘటన మార్గం నుండి పక్కదారి పట్టించి తమ దోపిడీని యథేచ్ఛగా కొనసాగించడానికి మార్గాన్ని సుగమం చేస్తాయి. అందుకే మనం వాటిని వ్యతిరేకించాలి.

## ప్రజల ముందున్న ప్రత్యామ్నాయం

గడచిన 24 సంవత్సరాలుగా ఛత్తీస్‌గఢ్‌లోని విశాల బస్తర్ ప్రజలు బూటకపు ఎన్నికలు బహిష్కరిస్తూ తమ మౌలిక సమస్యల పరిష్కారానికై దోపిడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్నారు. వారి పోరాటం అనేక నిర్బంధాలనధిగమిస్తూ అనేక త్యాగాలతో ముందడుగులో ఉంది.

మొదట పలు సంగాల్లో సంఘటితమైన పీడిత ప్రజలు ఈ రోజు నూతన ప్రజాస్వామ్యానికి బీజప్రాయంగా ప్రజారాజ్యాధికార సంస్థలను ఎన్నుకుంటున్నారు. ప్రజలు స్వేచ్ఛగా, స్వచ్ఛందంగా తమ ప్రతినిధులను ఎన్నుకుంటూ 'జనతన సర్కార్' (విప్లవ ప్రజా సమితి)లను రెండేళ్లకొకసారి ఎన్నుకుంటున్నారు. నూటికి నూరు శాతం పీడత ప్రజలు (పెత్తందారీ, భూస్వామ్య శక్తులు మినహా) ఎన్నికల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఇక్కడ డబ్బు, హోదాలతో గానీ, నయానా భయానా గానీ, బూటకపు వాగ్దానాలు గానీ, మరే ఇతర ప్రలోభాలతో గానీ ప్రమేయమే లేకుండా బహిరంగంగా తమ ప్రభుత్వాన్ని ఓటర్లు ఎన్నుకుంటున్నారు. ప్రతి ఆరు మాసాలకొకసారి ఓటర్లతో ప్రత్యేక సభ (గ్రామసభ)లు జరుగుతున్నాయి. ఇందులో తమ ప్రతినిధుల లోపాలోపాలను, మంచీ చెడులను ఓటర్లు సమీక్షిస్తున్నారు. అవసరమైన చర్యలు తీసుకునే హక్కు ప్రజలకే ఉంది. అసమర్థులుగా, అవినీతిపరులుగా, బంధుప్రీతి గలవారుగా ఆరోపణలుంటే విచారించి వారిని ప్రభుత్వం నుండి తొలగిస్తున్నారు. మెజారిటీ ఓటర్ల అభిప్రాయాన్ననుసరించి నిర్ణయాలు జరుగుతున్నాయి. గతంలో తెగలలో అనుభవించిన గణతంత్రపాలనను మరింత అభివృద్ధి చేసి ప్రజలు అనుభవించడం వారిలో నిజమైన ప్రజాస్వామిక చైతన్యాన్ని పెంచుతోంది. 'తమ ఊళ్లో తమ పాలన'ను కోరుకుంటూ అనుభవిస్తున్న ప్రజలు వందలాది మంది బూర్జువా పార్లమెంటరీ వ్యవస్థ ప్రతినిధులుచే – సర్పంచ్, జనపద్ సదస్య, అధ్యక్ష్ మొదలైన వాళ్లు – రాజీనామాలు ఇప్పించి ఒక నూతన చరిత్రను సృష్టించగలిగారు. దేశంలోనే ఒక సంచలనాత్మక వార్తలుగా ముందుకొచ్చిన సరిగ్గా ఏడాదికి ఈ బూర్జువా విధానసభ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలతో, ఈ సోకాల్డ్ ప్రజా ప్రతినిధులతో తమకెలాంటి సంబంధం లేదని, అవసరమూ లేదని దంతెవాడ ఓటర్లు తీర్పు ఇచ్చారు. 35 శాతానికి మించని పోలింగ్‌తో రాష్ట్రంలోనే దంతెవాడ ఆదర్శంగా నిలిచింది. ఇందులోనూ చెల్లని ఓట్లు 5 శాతానికి పైగానే ఉన్నాయంటే జరిగిన పోలింగ్ ఎంత తక్కువో ఊహించవచ్చు. ఎన్నికల్లో పాల్గొన్న వారిలో పునాది వర్గాల ప్రజలు ఎందరన్నది ప్రత్యేకంగా ఆలోచించాలి. ఆ తర్వాత రాష్ట్రంలో జరిగిన రీపోలింగ్ మొత్తంగా విశాల బస్తర్‌లోనే జరిగింది. రీపోలింగ్ అంతా దొంగ వోట్ల వ్యవహారమే. శాతాల అంకెల గారడీ అంతా అధికార్ల సొల్లువాగుడే. వందలాది సైనిక మూకలు, గగనతలంపై సైనిక హెలికాప్టర్లు కనీసం పోలింగ్ కేంద్రానికైనా చేరే సాహసానికి పూనుకోలేదన్నది అసలు వాస్తవం. దంతెవాడ జిల్లాతో పాటు విశాల బస్తర్‌లోని 12 నియోజకవర్గాల్లోని గ్రామీణ ప్రాంతమంతా పెద్దెత్తున ఎన్నికలను బహిష్కరించి ఒక నూతన చరిత్రను సృష్టించారు. వీరందరికీ భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) [పీపుల్స్‌వార్] విప్లవ జేజేలు తెలుపుతోంది. భారత పీడత ప్రజానీకం ముందు ఒక ఆదర్శప్రాయమైన, నిజమైన ప్రజాస్వామ్య, విప్లవ ప్రత్యామ్నాయాన్ని నిలిపిన ఘనత దండకారణ్య విప్లవ ప్రజానీకానికే దక్కుతుంది.

ప్రజలు తమ ఊళ్లల్లో తమ ప్రభుత్వ పాలనను (జనతన సర్కార్) ఎన్నుకోవడాన్ని దోపిడీ పాలకవర్గాలు సహించలేకపోతున్నాయి. వీటిని మొగ్గలోనే నిర్మూలించాలన్న పంతంతో ప్రభుత్వం పథకాలను రచిస్తున్నది. సరిహద్దు రాష్ట్రాల ప్రభుత్వాలతో, పోలీసు బలగాలతో కలిసి సమన్వయంతో కూడిన దాడులకు పూనుకుంటున్నది. తన ఎల్‌ఐసి విధానంలో భాగంగా కాశ్మీర్, ఈశాన్య రాష్ట్రాల జాతుల ఉద్యమాలను అణచివేస్తున్నట్టుగా దండకారణ్య ప్రజా పోరాటాలను తుదముట్టించాలని తలచి ఫాసిస్టు నిర్బంధానికి ఒడిగడుతున్నాయి. కేంద్రం నుండి దిగిన బలగాలు ఇక్కడే తిష్ట వేయనున్నవి. ఇక్కడ ఎన్నికైన భాజపా ప్రభుత్వం వెంటనే పోటాను అమలులోకి తేనున్నది. కేంద్రంలోని భాజపా, రాష్ట్ర భాజపా ప్రభుత్వానికి అడిగిందే తడవుగా నిధులు అందించమే గాకుండా అన్ని రకాల మద్దతుకు సిద్ధంగా ఉంది. అపారమైన ప్రాకృతిక వనరులను కలిగిన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాన్ని బహుళజాతి కార్పొరేషన్ల పాలు చేయడానికి మౌలిక సదుపాయాల రూపకల్పన చేసి బడా కాంట్రాక్టర్లను రంగంలోకి దించి వారి పాదసేవలో పరుగెడుతోంది. ఇందుకు విశాల బస్తర్ దాని ప్రధాన కార్యక్షేత్రమైంది. ఇలాంటి పరిస్థితిలో ప్రజల ముందు రెండే రెండు మార్గాలున్నాయి.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలకు అంకితమైన ప్రభుత్వ విధానాలను ఎదుర్కొంటూ తమ గ్రామాల్లో తమ పాలనను నిలుపుకోవడమా? లేక తాము సాధించిన విజయాలను వదులుకొని దోపిడీ విధానాలను అనుమతించడమా?

చరిత్రలో ప్రజలు ఎక్కడైనా మొదటి మార్గాన్నే ఎన్నుకొన్నారు. తాత్కాలికంగా ఎదురయ్యే నిర్బంధ-అణచివేత విధానాలను ధైర్యంగా ప్రతిఘటిస్తూ తమ చరిత్రను తామే నిర్మించుకున్నారు. మన దండకారణ్య ప్రజలు గొప్ప పోరాట వారసులు. బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అసమాన త్యాగాలతో పోరాడి చరిత్రలో తమ స్థానాన్ని నిలుపుకున్నవారు. వీర గేంద్‌సింగ్, గుండాదూర్, బాబురావు సెడ్మెక్‌ల వారసులు. వీరు గత 24 సంవత్సరాలుగా పోరాడుతున్నారు. ఇప్పటికీ వారి ముందున్నది అదే పోరాట మార్గం. దండకారణ్య యువత ప్రజా గెరిల్లా సైన్యంలో చేరి ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేయడం మినహా వారి విముక్తికి మరో మార్గం లేదు. బూటకపు ఎన్నికల మార్గం ససేమిరా పనికి రాదు. ప్రాంతాల వారీగా రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకుంటూ అంతిమంగా ఈ దేశంలో ప్రజా రాజ్యాధికారాన్ని స్థాపించడమే దండకారణ్య ప్రజల పురోగమన మార్గం. ★

## ➢ పాఠకులకు విజ్ఞప్తి

*ఎన్నికల బహిష్కరణ కార్యక్రమానికి సంబంధించిన మొత్తం రిపోర్టులు మాకింకా అందలేదు. ఎన్నికల సందర్భంగా బస్తర్‌లో దిగిన వేలాది సిఆర్‌పి బలగాలు విచ్చలవిడి నిర్బంధకాండకు పూనుకున్నాయి. చాలా చోట్ల అమాయక రైతులను కాల్చి చంపి నక్సలైట్లు చనిపోయారంటూ ప్రచారం చేశాయి. అట్లాగే పిజిఏకు చెందిన వివిధ బలగాలు శత్రు బలగాలపై అనేక చోట్ల దాడులు చేశాయి. అయితే వీటన్నిటి రిపోర్టులు కూడా మాకింకా అందాల్సే ఉంది. కనుక ఎన్నికల బహిష్కరణ కార్యక్రమాలకూ, ఆ సందర్భంగా శత్రువు అమలు చేసిన నిర్బంధ చర్యలకూ, పిజిఏ సైనికులు జరిపిన దాడులకూ సంబంధించిన వివరాలన్నీ వచ్చే సంచికలో ప్రచురించగలమని విన్నవించుకుంటున్నాం.*

*– సంపాదకవర్గం*

# ఒక్క కోక్-పెప్సీలనే కాదు, మొత్తం బహుళజాతి కంపెనీలనే దేశంలోంచి తన్ని తరిమేద్దాం!

ఆగస్టు 5, 2003న ఢిల్లీలోని 'సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్' (సిఎస్ఇ) అనే ప్రభుత్వేతర సంస్థ ఢిల్లీలోనూ, చుట్టుపక్కలా అమ్మే శీతల పానీయాల్లో (కోల్డ్ డ్రింక్స్) నాలుగు వినాశకరమైన పురుగుమందుల అవశేషాలున్నాయని పరీక్షలో తేలిందని వెల్లడించడంతో దేశ ప్రజలు దిగ్భ్రాంతికి లోనయ్యారు. గతంలో, మినరల్ వాటర్ కూడా కలుషితమైందనీ, కొన్ని ప్రముఖ కంపెనీలు సీసాల్లో అమ్ముతున్న నీరు ప్రమాదకరమైన విషపదార్థాలను కలిగి ఉందనీ వెల్లడైన కొద్ది నెలలకే ఇప్పుడు ఈ ఉదంతం వెలుగులోకి రావడం గమనార్హం. 12 ప్రముఖ బ్రాండ్ల శీతల పానీయాల్లో లిండేన్, డిడిటి, మెలాథియాన్, క్లోర్‌పైరిఫాస్ అనే నాలుగు ప్రమాదకరమైన విష పదార్థాల అవశేషాలు పెద్ద మోతాదులో ఉన్నట్టుగా కనుగొన్నామని సిఎస్ఇ డైరెక్టర్ సునీతా నారాయణ్ విలేఖరుల సమావేశంలో ప్రకటించారు. వీటిని చాలా కాలం పాటు సేవించడం ద్వారా క్యాన్సర్, నాడీ మండల, పునరుత్పత్తి వ్యవస్థలు దెబ్బతినడం, రోగనిరోధక శక్తిని కోల్పోవడం వంటి ప్రమాదకరమైన రోగాల బారిన పడతారు. సిఎస్ఇ ప్రకటించిన బ్రాండ్లలో ప్రముఖ శీతలపానీయాలైన పెప్సీ, కోకాకోలాతో పాటు లిమ్కా, సెవెనప్, థమ్సప్, మిరిండా, ఫెంటా, మౌంటేన్‌డ్యూ వంటి బ్రాండ్లు ఉన్నాయి. ఈ బ్రాండ్లన్నీ రెండు ప్రముఖ అమెరికన్ బహుళజాతి కంపెనీలైన పెప్సికో, కోకాకోలాలకు చెందినవే. ఈ బ్రాండ్లలో యూరోపియన్ ఆర్థిక కమిషన్ (ఇఇసి) నిర్ధారించిన మోతాదు కంటే చాలా రెట్లు ఎక్కువ – గరిష్టంగా 70 దాకా – ఉన్నట్టు తేలిందని సిఎస్ఇ ప్రకటించింది. అయితే అమెరికాలోనూ, యూరోప్‌లోనూ ఈ కంపెనీలు అమ్మే ఇవే బ్రాండ్లను తాము పరిశీలించగా అందులో విషపూరిత పదార్థాల అవశేషాలేవీ లేవని తేలిందని కూడా సిఎస్ఇ ప్రకటించడంతో, ఇంత కాలం పాటు ఈ కంపెనీలు తమచే ఎంత విషాన్ని తాగించాయో దేశావాసులకు తెలిసి వచ్చింది. దేశం మూలమూలనా ప్రజలు నిరసన ప్రదర్శనలకు పూనుకున్నారు. అనేక సంస్థలు, ప్రజా సంఘాలు ఈ సమస్యను చేపట్టి పెప్సీ, కోక్‌ల దిష్టిబొమ్మల్ని తగులపెట్టడం, వాటి అమ్మకాల్ని నిషేధించాలని డిమాండ్ చేయడం తదితర కార్యక్రమాలను నిర్వహించాయి. ప్రజల మనోభావాలను గమనించి కొన్ని పాలకవర్గ పార్టీలు కూడా ఈ సమస్యపై ప్రజల నిరసనకు నాయకత్వం వహించాయి.

దేశవ్యాప్తంగా వెల్లువెత్తుతున్న ప్రజా నిరసనను గమనించిన ప్రభుత్వం వెంటనే స్పందించాల్సి వచ్చింది. వెంటనే పార్లమెంటు ప్రాంగణంలో ఈ పానీయాల అమ్మకాల్ని నిషేధించారు. తమ ప్రాణాలకు కూడా ముప్పు ఉందన్న భయంతో దళారీ పాలకులు ఒక్క పార్లమెంటులో మాత్రం నిషేధించి దేశ ప్రజల బాగోగుల్ని గాలికొదిలేశారు. ఎందుకంటే ఈ బ్రాండ్లను దేశమంతటా నిషేధించి తమ సామ్రాజ్యవాద ప్రభువుల్ని, ముఖ్యంగా అమెరికాను నొప్పించే సాహసం ఈ దళారీలకు లేదు గనుక. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుంటున్నామనీ, దీనిపై సమగ్ర విచారణను జరిపిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఈలోగా ఆగస్టు 21న పార్లమెంటులో ప్రభుత్వం చేసిన ప్రకటనతో దాని దళారీ స్వభావం మరింత బట్టబయలైంది. రెండు వేర్వేరు ప్రభుత్వ ప్రయోగశాలలలో నిర్వహించిన పరీక్షలలో ఈ 12 బ్రాండ్లలో కేవలం 9 బ్రాండ్లు మాత్రమే యూరోపియన్ ఆర్థిక కమిషన్ నిర్ధారించిన మోతాదుకంటే ఎక్కువ పురుగుమందుల అవశేషాలను కలిగి ఉన్నాయనీ, ఈ 12 బ్రాండ్లు కూడా భారతదేశ ప్రమాణాలకు లోబడే ఉన్నాయనీ కేంద్ర ఆరోగ్య మంత్రి సుష్మా స్వరాజ్ ప్రకటించారు. ప్రభుత్వ వర్గ స్వభావం తెల్సినవాళ్లకు ఇలాంటి రిపోర్టు ఊహించనిదేమీ కాదు. వాస్తవాలను తలకిందులు చేయడానికి ప్రభుత్వం పథకం ప్రకారం, బహుళజాతి కంపెనీల ప్రయోజనాల్ని కాపాడడం కోసమే ఈ పరీక్షలను నిర్వహించిందనేది దాచేస్తే దాగని సత్యం.

ఈ మొత్తం వ్యవహారంపై సమగ్రంగా విచారణ జరిపించాలని ప్రతిపక్షాలు పట్టుబట్టడంతో ప్రభుత్వం ఆగస్టు 22న ఒక సంయుక్త పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేసింది. 15 మంది పార్లమెంటు సభ్యులతో కూడిన ఈ కమిటీకి ఎన్‌సిపికి చెందిన శరద్ పవార్ అధ్యక్షుడు. ఈ కమిటీ సిఎస్ఇ వెల్లడించిన రిపోర్టులోని నిజానిజాల్ని 'స్వతంత్ర విశ్లేషణ' ద్వారా నిగ్గుదేల్చి రానున్న పార్లమెంటు సమావేశాల వరకు తన నివేదికను ప్రకటిస్తుందట. అంటే "దొంగలు పడ్డ ఆరు నెలలకు కుక్కలు మొరిగినట్టు" ఏనాటికో సంయుక్త పార్లమెంటరీ కమిటీ నివేదిక వెలువడే దాకా ఈ విష పానీయాల్ని ప్రజలు తాగుతూనే ఉండాలన్న మాట! వెంటనే ఈ పానీయాల అమ్మకాల్ని నిషేధించకుండా విచారణల పేరిట తాత్సారం చేయడాన్ని చూస్తే ప్రభుత్వానికి ప్రజల ఆరోగ్యంకన్నా బహుళజాతి కంపెనీల లాభాలే ముఖ్యమని ఎవరికైనా అర్థమవుతుంది. స్వయంగా భారత ప్రమాణాల బ్యూరోయే సిఎస్ఇ రిపోర్టును ఆమోదించినప్పటికీ ఆ రిపోర్టుపై ఆధారపడి చర్యలు తీసుకోవడానికి బదులు ఇంకా 'స్వతంత్ర విశ్లేషణ' అంటూ సాగదీయడం దేనికి? ప్రజల కోపాన్ని శాంతింపజేయడానికీ, కొంత వెసులుబాటు కల్పించడానికీ తప్ప ప్రభుత్వం వేసిన కమిటీకి మరో పరమార్థం ఏదీ లేదు. చాలా రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఇదే రీతిలో

**సిఎస్ఇ వెల్లడించిన రిపోర్టు ప్రకారం, యూరోపియన్ ఆర్థిక కమిషన్ నిర్ధారించిన ప్రమాణాలకంటే ఏ పానీయంలో ఎన్ని రెట్లు ఎక్కువ విష పదార్థాలున్నాయి?**

| | |
|---|---|
| *మిరిండా లెమన్* | *– 70 రెట్లు* |
| *కోకాకోలా* | *– 45 రెట్లు* |
| *ఫెంటా* | *– 43 రెట్లు* |
| *మిరిండా ఆరెంజ్* | *– 39 రెట్లు* |
| *పెప్సీ* | *– 37 రెట్లు* |
| *సెవనప్* | *– 33 రెట్లు* |
| *లిమ్కా* | *– 30 రెట్లు* |
| *బ్లూ పెప్సీ* | *– 29 రెట్లు* |
| *మౌంటేన్‌బ్లూ* | *– 28 రెట్లు* |
| *థమ్సప్* | *– 22 రెట్లు* |
| *డైట్ పెప్సీ* | *– 14 రెట్లు* |
| *స్ప్రైట్* | *– 11 రెట్లు* |

స్పందించాయి. దేశ ప్రజలు మేల్కొని ఉద్యమించని పక్షంలో గతంలో మినరల్ వాటర్ వ్యవహారంలో జరిగినట్టుగానే ఇప్పుడు కూడా వాస్తవాలు శాశ్వతంగా సమాధి కావచ్చు.

అయితే, కోక్, పెప్సీలు విష పదార్థాలను అమ్మడమనేది, దేశవ్యాప్తంగా బహుళజాతి కంపెనీలు సాగిస్తున్న లెక్కలేనన్ని అకృత్యాలలో సముద్రంలో కాకిరెట్టతో సమానమని చెప్పొచ్చు. వాస్తవానికి ఈ కంపెనీల ఉన్నతాధికారులపై బహిరంగ న్యాయవిచారణ జరిపించి, కోట్లాది ప్రజల జీవితాలతో చెలగాటమాడినందుకు గాను కఠినంగా శిక్షించాలి. ఒక్క అధికారులనే కాదు, అధికార పీఠాల్లో కూర్చున్న వాళ్ల అనుయాయుల్ని కూడా. వలసవాద మనస్తత్వంతో నిండిన ఈ సామ్రాజ్యవాద మాఫియాలకు భారత ప్రజలంటే ఈగలతో, దోమలతో సమానం. అందుకే అధిక లాభాల ఆశతో నీటిని శుద్ధి చేసే ఖర్చును తప్పించుకుంటున్నారు. అయితే తమ స్వంత దేశాల్లో మాత్రం ఉన్నత ప్రమాణాల్ని పాటిస్తున్నారు. అందుకే అమెరికాలో కంటే ఇక్కడ అమ్మకాలు సాగించడం ద్వారా ఈ కంపెనీలకు 10 రెట్ల దాకా అధిక లాభాలు ఒనగూరుతుండంలో ఆశ్చర్యమేమీ లేదు.

ఈ ఉదంతం దరిమిలా ఈ రెండు విదేశీ కంపెనీలు ప్రదర్శించిన తలబిరుసుతనం మరింత క్షమించరానిది. దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పుకొని రక్షణ ప్రమాణాలపైన మరింత ఖర్చు చేస్తామని మాట ఇవ్వడానికి బదులుగా ఇవి వాస్తవాల్ని తెరమరుగు చేయడానికి బెదిరింపులకూ, లంచాలకూ పూనుకున్నాయి. మొదటగా సిఎస్ఇకి ఈ పరీక్ష నిర్వహించే సామర్థ్యమే లేదనీ, తమ స్వంత సామ్రాజ్యవాద ప్రయోగశాలలు (వీటిలో ఒకటి డచ్) మాత్రమే ఈ పరీక్షలకు కావల్సిన సాధనసంపత్తిని కలిగి ఉన్నాయనీ బుకాయించసాగాయి. సిఎస్ఇ నిర్వహించిన పరీక్షా పద్ధతులు సరైనవిగా భారత ప్రమాణాల బ్యూరో (బిఐఎస్) ప్రకటించిందన్న వాస్తవంతో ఈ బందిపోటు కంపెనీలకు పనే లేదు. సిఎస్ఇ వెల్లడించిన వాస్తవాలకు బెంబేలెత్తిన ఈ నేరపూరిత కంపెనీలు ఈ రిపోర్టును ప్రచురించకుండా ఆపడం కోసం హైకోర్టులో రిట్ కూడా వేశాయి. తాము చెప్పేది సరైనదే అయినప్పుడు పూర్తి రిపోర్టు ప్రచురణకు అంతగా భయపడడం దేనికి? ఆఖరుకు కోక్, పెప్సీల బాస్‌లు అమెరికా దౌత్య కార్యాలయాన్ని సంప్రదించి అమెరికా ప్రభుత్వం నుండి రాజకీయపరమైన వత్తిడిని తెచ్చేందుకు కూడా ప్రయత్నించారు. వెంటనే దౌత్య కార్యాలయం ''విదేశీ కంపెనీలకు 'సమానంగా పోటీ పడగలిగే పరిస్థితి' (level playing-field) తప్పక ఉండాల''ని హెచ్చరిక కూడా జారీ చేసింది.

తొత్తు భారత ప్రభుత్వ వ్యవస్థ ఈ విదేశీ కంపెనీలకు అన్ని సదుపాయాల్నీ కల్పించి, ఆఖరుకు ఇవి ఎలాంటి ఆరోగ్య ప్రమాణాలకూ కట్టుబడనవసరం లేని విచ్చలవిడి స్వేచ్ఛను కూడా ప్రసాదించినప్పటికీ, కోట్లాది రూపాయల రాయితీలను ఇస్తున్నప్పటికీ ఇంకా ఎలాంటి ''సమానంగా పోటీ పడగల పరిస్థితి'' కావాలని వాళ్లు మాట్లాడుతున్నారు? కోక్, పెప్సీలు దేశాన్ని దోచుకుంటూనే ఉన్నాయి, ప్రజలకు విష రసాయనాలను తాగిస్తూనే ఉన్నాయి. బ్యూరాక్రాట్లూ, రాజకీయ నాయకులూ కమీషన్లతో తమ జేబుల్ని నింపుకుంటూనే ఉన్నారు. ఆఖరుకు అతి పెద్ద వామపక్షాన్నని చెప్పుకునే సిపిఎం ప్రధాన కార్యదర్శి హరికిషన్ సింగ్ సూర్జిత్ కూడా ఈ శీతల పానీయాల కంపెనీలు దేశంలో నిర్వహిస్తున్న కార్యకలాపాలకు తాను వ్యతిరేకం కానని బాహాటంగానే చెప్పాడు. సిపిఎం పార్లమెంటరీ నాయకుడు సోమ్‌నాథ్ చటర్జీ ''ఒక సంస్థ వెల్లడించిన ప్రశ్నించదగిన వాస్తవాల''పై ఆధారపడి ''బాధ్యతారహితమైన డిమాండ్లు'' ముందుకు తెచ్చినందుకు గాను తన స్వంత ఎంపీలకే చివాట్లు పెట్టాడు.

ముఖ్యంగా కోక్ కంపెనీ సాగిస్తున్న ప్రజా వ్యతిరేక కార్యకలాపానూ, అది అనుసరిస్తున్న గూండాగిరీ పద్ధతులనూ పరిశీలిస్తే ఆశ్చర్యపోకతప్పదు. ఈ కంపెనీ విషపూరిత రసాయనాలను ప్రజలచే తాగించడమొక్కటే కాకుండా, ప్రపంచవ్యాప్తంగా ప్రజల మనుగడకే ముప్పు తెస్తున్న అనేక ఉదాహరణలు గతంలో చాలానే వెలుగులోకి వచ్చాయి. కొన్ని లాటిన్ అమెరికన్ దేశాల ప్రభుత్వాలను పడగొట్టడంలోనూ, తమ ప్రయోజనాలకు అడ్డంకిగా నిలిచిన దేశాధినేతలను హత్య చేయించడంలోనూ, ట్రేడ్ యూనియన్ నాయకులను హత్య చేయించడంలోనూ ఈ కంపెనీ పేరుమోసింది. మన దేశంలో ఈ రెండు కంపెనీలు తమ పానీయాల తయారీ కేంద్రాల కోసం అనేక ఎకరాల భూమిని కొనుగోలు చేశాయి. మహారాష్ట్రలోనూ, ఇంకా అనేక ప్రాంతాలలోనూ వీటి కార్యకలాపాల కారణంగా స్థానికులకు నీరు కరువవుతున్నది. ప్రజలకు సంబంధించిన నీటి హక్కులను ఈ కంపెనీలకు అమ్మివేసిన ప్రభుత్వ చర్యను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. బీబీసీ వినిపించిన కథ మరీ దారుణమైనది. కేరళలోని కోక్ సంస్థ, స్థానిక రైతులకు ఎరువుగా తమ ఫ్యాక్టరీ నుంచి వెలువడే వ్యర్థ పదార్థాలను అమ్ముతున్నది/వదిలించుకుంటున్నది. అయితే అందులో అపాయకరమైన కాడ్మియం వంటి విష పదార్థాలు ఉన్నాయని కేరళ కాలుష్య తనిఖీ కేంద్రం నిర్ధారించింది. 2001లో ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాలో కోకాకోలా కంపెనీ ఉత్పత్తి చేసే థమ్సప్ సీసాల్లో డయేరియాను కలుగజేసే విష పదార్థాలున్నట్టు తేలడంతో వాటి అమ్మకాల్ని నిషేధించారు. ఇది కోకాకోలాకు మింగుడు పడలేదు. బెదిరింపు చర్యలకు పూనుకొని, హైకోర్టుకు వెళ్లి నిషేధాన్ని ఎత్తి వేయించుకుంది.

దేశంలోని అనేక బాట్లింగ్ కంపెనీలను కోక్ అడ్డికి పావుశేరు లెక్కన కొనేయడమో లేదా వాటిని మూతపడేట్టు చేయడమో చేసింది. చాలా

*పది రూపాయలకు ఒక సీసా చొప్పున అమ్మే శీతల పానీయాలు, ఒక అంచనా ప్రకారం నలభై పైసలకన్నా ఎక్కువ విలువ చేయవట! అందులోని ద్రవం కొద్ది చెంచాల చెక్కరతో సమానం. కోక్‌లో ఉండే మరో పదార్థం ఫాస్ఫరిక్ ఆమ్లం. దానిని ఎక్కువగా తాగితే దంతాలు పాడవుతాయి. అలాగే ఎముకల్లోంచి కాల్షియాన్ని హరించి వేస్తుంది. తమ ఫార్ములాలో కొకైన్ అనే మత్తు పదార్థం ఉందని కోక్ **1906** దాకా అధికారికంగా అంగీకరిస్తూ వచ్చింది. ఎలాంటి పౌష్టిక విలువలూ లేనటువంటి, పైపెచ్చు ప్రమాదకరమైన విష పదార్థాలు కలిగినటువంటి ఈ శీతల పానీయాల సీసాలు మన దేశంలో ఏటా దాదాపు రూ. **6,000** కోట్ల దాకా అమ్ముడు పోతున్నాయి. సామ్రాజ్యవాదం వ్యాపింపజేస్తున్న వస్తు వినిమయ సంస్కృతి మూలంగా కూడా వీటి వాడకం బాగా పెరిగిపోయింది.*

*మన దేశంలో అమ్ముడయ్యే ప్రతి **100** సీసాలలో **90** సీసాలు కోక్, పెప్సీలవే. ఇవి రెండూ మన దేశంలోని చిన్నాచితకా బాట్లింగ్ కంపెనీలన్నిటినీ మింగెయ్యడమే గాకుండా, దేశ మార్కెట్‌పై పూర్తి గుత్తాధిపత్యం కోసం వీటి మధ్య గొంతులు కోసుకునేంత పోటీ ఉంటుంది. మీడియా దీన్నే 'కోలా వార్'గా అభివర్ణించాయి. అయితే ఆశ్చర్యకరంగా, సిఎస్ఇ రిపోర్టు వెలువడ్డ తర్వాత ఈ రెండు కంపెనీల బాస్‌లు ఒకే వేదికపైకి వచ్చి ఎదురుదాడికి దిగారు!*

మంది భారతీయ బాటిలర్లు కోకాకోలా మూలంగా తమ కంపెనీలు మూతపడి దివాళా తీశారు. ఇకపోతే దళారీ ప్రభుత్వాలు ఈ రెండు విదేశీ కంపెనీలకు కోట్లాది రూపాయల రాయితీలిచ్చి దేశీయ పారిశ్రామిక రంగానికి చేయాల్సినంత నష్టం చేశాయి. ఈ కంపెనీలకు దళారీ ప్రభుత్వాలు ఒనగూర్చుతున్న సదుపాయాలనూ, రాయితీలనూ గూర్చి వెలుగులోకి వస్తున్న వాస్తవాలు దేశ సార్వభౌమత్వానికే మాయని మచ్చగా నిలుస్తాయి. ఒక అంచనా ప్రకారం గత ఎనిమిదేళ్లుగా కర్నాటక ప్రభుత్వం ఈ రెండు కంపెనీలకు ఇచ్చిన పన్ను మినహాయింపు మొత్తం దాదాపు 170 కోట్ల రూపాయలు ఉంటుంది. ఈ రాష్ట్రంలో శీతల పానీయాలపై 18 శాతం అమ్మకం పన్ను విధిస్తాయి. కానీ ఈ కంపెనీకి ఇచ్చిన మినహాయింపు మూలంగా రాష్ట్రంలో ఉన్న మొత్తం 70 చిన్న, మధ్య తరహా శీతల పానీయాల కంపెనీలలో ఎక్కువ భాగం మూతపడ్డాయి. ఇలా ఈ కంపెనీలు స్వదేశీ శీతల పానీయాల కంపెనీలను మార్కెట్లోంచి గెంటివేయడంలో సఫలమయ్యాయి.

## స్వంతకాళ్లపై నిలబడే ఆర్థికవ్యవస్థను నిర్మిద్దాం!

నిజానికి తీయని రంగు నీళ్లు తప్ప మరేమీ ఉండని ఈ పానీయాల తయారీ కోసం మన దేశానికి విదేశీ కంపెనీల నుండి పాఠాలు నేర్చుకోవల్సిన ఆగత్యమేమీ లేదు. మరైతే శీతల పానీయాల వంటి మామూలు వస్తువులను కూడా ప్రభుత్వం పూర్తిగా సామ్రాజ్యవాదులకే ఎందుకు అప్పజెపుతున్నట్టు? ఎందుకంటే పాలకవర్గాలూ, వాళ్ల ప్రభుత్వం ఒకదాని తర్వాత ఒకటిగా అన్ని రంగాల్నీ సామ్రాజ్యవాద శక్తులకు అమ్మే ప్రక్రియలో నిండా మునిగిపోయాయి. ఇవన్నీ ప్రపంచీకరణ పేరిటా, 'ఆర్థిక సంస్కరణల' పేరిటా కొనసాగుతున్నాయి. అయితే ఈసారి ప్రజలు వీధుల్లోకి వచ్చి పెప్సీ, కోక్ సీసాల్ని పగులగొట్టడాన్నీ, పాఠశాలలూ ఇతర సంస్థలూ ఈ పానీయాల్ని నిషేధించడాన్నీ, ఈ రెండు కంపెనీలకు వ్యతిరేకంగా ప్రజా నిరసన పెద్ద ఎత్తున వెల్లువెత్తడాన్నీ పాలకవర్గాలు గమనించాయి. పెప్సీ, కోక్‌లు పాల్పడుతున్న కార్యకలాపాలు దేశంలో బహుళజాతి కంపెనీలు సాగిస్తున్న దురంతాలకు ఉదాహరణలు మాత్రమే. వాటి అకృత్యాలకూ, నీతిబాహ్యమైన కార్యకలాపాలకు రాజకీయ కుమ్మక్కు ముసుగుగా ఉపయోగపడుతోంది.

ఈ బహుళజాతి కంపెనీలు భారతదేశాన్ని విచ్చలవిడిగా కొల్లగొడుతున్నాయి – నాశనం చేస్తున్నాయి. బూర్జువా రాజకీయ పార్టీలన్నీ కూడా 'ఆర్థిక సంస్కరణల' పట్ల ఏకాభిప్రాయంతో వీటికి దళారీలుగా, ఏజెంట్లుగా పని చేస్తున్నాయి. ఇవిప్పుడు ఈ కంపెనీలను ఎలా రక్షించాలా అనీ, ప్రజల కోపాన్ని ఎలా చల్లబర్చాలా అనీ తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఈ ప్రయత్నాలకు గాను వీటికి ఈ విదేశీ మాఫియా నుండి పెద్ద మొత్తంలో ముడుపులు తప్పక ముడతాయి.

కనుక ఈ బహుళజాతి కంపెనీలకు వ్యతిరేకంగా వాస్తవంగా పోరాటం సాగాలంటే ప్రజానీకమంతా మేల్కొని వాటి సరకులన్నిటినీ బహిష్కరించాలి. ఇక్కడ సామ్రాజ్యవాదుల కార్యకలాపాలకూ, వారి తొత్తులకూ వ్యతిరేకంగా ఒక విశాల ప్రజా ఉద్యమాన్ని నిర్మించాలి. మొదటి చర్యగా, కోక్, పెప్సీలకు వ్యతిరేకంగా పెల్లుబికిన ప్రస్తుత ఉద్యమం దేశం మూలమూలనా వాటి పానీయాల్ని బహిష్కరించేలా కొనసాగాలి. గతంలో కొన్ని ముస్లిం సంస్థలు ఇలా బహిష్కరణకు పిలుపునిచ్చాయి. ఆఫ్ఘనిస్తాన్‌పై అమెరికా దాడి సందర్భంగా మన పార్టీ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలూ, ప్రజా గెరిల్లా సైనికులూ కోకాకోలా కంపెనీని పేల్చివేసి బహుళజాతి కంపెనీలకు వ్యతిరేకంగా మిలిటెంట్ పోరాటం అవసరాన్ని చాటి చెప్పారు. ఇరాక్‌పై అమెరికా దాడి సందర్భంగా మన పార్టీ అమెరికన్, బ్రిటిష్ సరుకులను బహిష్కరించాలని ప్రజలకు పిలుపునిచ్చింది. మన దండకారణ్య గెరిల్లాజోన్ ప్రాంతంలో ప్రజలను కదిలించి కోక్, పెప్సీలకు చెందిన శీతల పానీయాల అమ్మకాలపై నిషేధాన్ని అమలు చేయడానికి ప్రయత్నించాలి. అట్లాగే, మొత్తంగా ప్రజల సామ్రాజ్యవాద వ్యతిరేక చైతన్యాన్ని పదునుదేర్చాలి. ఇప్పుడు దేశంలో అనేక సెక్షన్ల ప్రజలలో సామ్రాజ్యవాద వ్యతిరేక భావనలు పెంపొందుతున్నాయి. ఇవి బహుళజాతి కంపెనీలన్నిటినీ దేశంలోంచి తన్ని తరిమేసే మహా ఉద్యమానికి తొలి చరణంగా పెంపొందగలవని ఆశిద్దాం. ★

---

*(..... 26వ పేజీ తరువాయి)*

ప్రపంచాన్నంతా తన గుప్పిట్లో బంధించాలని వెర్రిగా ప్రయత్నించే సామ్రాజ్యవాద బందిపోట్లకు మరో దేశంలోని ఏ నాయకుడినీ పట్టుకునే అధికారం గానీ, విచారించే అధికారం గానీ లేదు. నిజానికి లెక్కకు మించిన యుద్ధ నేరాలకు శిక్షించాల్సింది బుష్‌నూ, బ్లేయిర్‌నూ తప్ప సద్దాంను కాదు. లెక్కలేనన్ని మిగతా నేరాలన్నీ అటు ఉంచినా, ఇరాక్ వద్ద మానవ వినాశక ఆయుధాలున్నాయని అబద్ధాలు చెప్పి, ప్రపంచాన్ని మోసపుచ్చి దానిపై దాడి జరిపి వేలాది మంది ప్రాణాలు బలిగొన్న ఒకే ఒక్క కారణంతోనైనా వీళ్లను బహిరంగంగా ఉరితీయాల్సి ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా ఎందరో నియంతలకు మద్దతునిచ్చి, ప్రత్యక్షంగానో పరోక్షంగానో లక్షలాది ప్రజల్ని ఊచకోత కోసిన ఈ మహా నియంతలకు అసలు ప్రజాస్వామ్యం గురించి గానీ, న్యాయం గురించి గానీ, విచారణ గురించి గానీ మాట్లాడే నైతిక అర్హతే లేదు. అమెరికా సద్దాంను అరెస్టు చేయడాన్నీ, అతనికి మరణశిక్ష విధించడం కోసం సామ్రాజ్యవాదులు చేస్తున్న ప్రయత్నాలనూ ప్రపంచ ప్రజానీకమంతా తీవ్రంగా ఖండించాలి.

సద్దాం అరెస్టుతో ఇరాకీ ప్రజల ప్రతిఘటన ఆగుతుందని అమెరికన్ సామ్రాజ్యవాదులు కలలు గంటున్నారు. సామ్రాజ్యవాదుల బెదిరింపులకూ, దాడులకూ లొంగని తమ దేశాధినేత పట్టుబడడం ప్రజలకు బాధాకరమైనదే అయినప్పటికీ విదేశీ దురాక్రమణ కొనసాగినంత కాలం, తమ గడ్డపై పరాయి దేశాల సైనికులున్నంత కాలం, తమ వనరుల్ని సామ్రాజ్యవాదులు దోచుకున్నంత కాలం ఇరాక్ ప్రజల ప్రతిఘటన కొనసాగుతూనే ఉంటుంది. అసలు ఈరోజు ఇరాక్‌లో జరుగుతున్న గెరిల్లా దాడులు ఒక సద్దాం వల్లనో లేదా కేవలం బాథ్ పార్టీ నాయకత్వంలోనో జరుగుతున్నాయనుకుంటే పొరపాటే అవుతుంది. అనేక మిలిటెంట్ గ్రూపులూ, ఇతర పార్టీలూ విడివిడిగానూ, పరస్పర సమన్వయంతోనూ ఈ దాడుల్ని కొనసాగిస్తున్నారు. తమ దేశ విముక్తి కోసం పోరాడుతున్న ఇరాకీ ప్రజలకు ప్రపంచ ప్రజానీకం అండదండలనందించాలి. వారి పోరాటానికి సంఘీభావాన్ని ప్రకటించాలి. సామ్రాజ్యవాదంపై, ప్రత్యేకించి ప్రపంచ ప్రజల మొట్టమొదటి శత్రువైన అమెరికన్ సామ్రాజ్యవాదంపై ప్రపంచ ప్రజానీకం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి. తమ తమ దేశాలలో మార్క్సిజం-లెనినిజం-మావోయిజం వెలుగులో సాగుతున్న ప్రజాయుద్ధాలలోనూ, విప్లవ పోరాటాలలోనూ, జాతీయ విముక్తి పోరాటాలలోనూ, తదితర ప్రజా ఉద్యమాలలోనూ పాల్గొనడం ద్వారా సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాన్ని ఉధృతం చేయాలి. అమెరికన్ సామ్రాజ్యవాద మట్టికాళ్ల మహారక్కసిపై అన్ని వైపుల నుండీ ఉమ్మడిగా దాడి సాగాలి. అమెరికన్-బ్రిటిష్ ఉత్పత్తుల్ని బహిష్కరించడం, ఈ దేశాల బహుళజాతి కంపెనీలను తరిమికొట్టడం మన పోరాటరూపాలలో భాగం కావాలి. ఇరాక్ నుండీ, ఆఫ్ఘనిస్తాన్ నుండీ, తదితర ప్రపంచ దేశాలన్నిటి నుండీ అమెరికా సైన్యాలు వైదొలగాలన్న నినాదం ప్రపంచమంతటా సమరనాదం కావాలి. ★

***డిసెంబర్ 13, 2003***

# పోలీసుల బహుమానాన్ని ప్రజలు సమైక్యంగా తిప్పికొట్టాలి - ప్రజాద్రోహుల్ని ఎండగట్టాలి, శిక్షించాలి!

## ఉద్యమ అణచివేత రూపాలలో 'గాంవ్‌బంది' ఒకటి

విప్లవోద్యమం బలపడకుండా, విస్తరించకుండా తొలి నుండీ ప్రభుత్వ వర్గాలూ, పోలీసులూ ఎడతెరిపి లేని ప్రయత్నాలూ, కుట్రలూ చేస్తూనే ఉన్నారు. ఇందులో ప్రజలను అరెస్టు చేయడం, చిత్రహింసల పాలు చేయడం, జైళ్లలోకి తోయడం, నల్లచట్టాలను ప్రయోగించడం, కోర్టుల చుట్టూ తిప్పడం, ప్రజల ఆస్తులను (ఇళ్లూ, పంటపొలాలు, సామగ్రి మొదలైనవి) నష్టపర్చడం, తగులబెట్టడం, మహిళలపై అత్యాచారాలకు పాల్పడడం, గ్రామాలను ఖాళీ చేయించడం, ప్రజలను అనేక కట్టడులకు గురిచేయడంతో పాటు కౌన్సిలింగ్ మరియు బూటకపు ఎన్‌కౌంటర్లలో కాల్చిచంపడం లాంటి పలు రూపాలు సాధారణమైనాయి. ప్రజల్లో పని చేస్తున్న విప్లవకారులను తుదముట్టించడానికి, ప్రజల నుండి దూరం చేయడానికి కూడా ప్రభుత్వ వర్గాలు, పోలీసులు ఉపయోగిస్తున్న పద్ధతులనూ, చర్యలనూ చూస్తే అడవులను గాలించడం, గస్తీ తిరగడం, ఇన్‌ఫార్మర్ల సమాచారంతో విప్లవకారుల డేరాలపై దాడి చేసి కాల్పులు జరపడం, అరెస్టు చేసి కాల్చి చంపడం, సరెండర్లు, పునరావాసాలు, తలలకు వెలలు పెట్టడం, కీలక ప్రాంతాల్లో మాటు దాడులకు పాల్పడడం, నల్లదండు ముఠాలను ఏర్పర్చడం, విప్లవోద్యమంపై విషం కక్కే దుష్ప్రచారానికి పాల్పడడం లాంటివి కూడా సాధారణమే అయ్యాయి. భోజనంలో విషం కల్పించడం కూడా అక్కడక్కడ ఎదురవుతున్నది. ఇవి ఇలా ఉండగా సంస్కరణలు కూడా ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రభుత్వ (సివిల్) సంస్కరణలతో పాటు పోలీసు సంస్కరణలు జతకూడి ఉద్యమ ప్రాంతాలంతటా 'సంస్కరణల రాజ్యం' నడుస్తోంది. ఇందులో ప్రజలకు అప్పులు ఇవ్వడం నుండి మొదలుకొని ప్రజలతో సంగాలు పెట్టడం వరకూ ఉన్నాయి. ప్రస్తుతం మనం తెల్సుకోబోయే గాంవ్‌బందీ ఈ కోవలోనిదే. ఇవన్నీ గత కొద్ది సంవత్సరాలుగా పోలీసులు అనుసరిస్తున్న బహుముఖ దాడిలో భాగంగానే జరుగుతున్నాయని అర్థం చేసుకోవాలి. మరో మాటలో ఇవన్నీ ప్రభుత్వం అనుసరిస్తున్న తక్కువ స్థాయి తీవ్రత గలిగిన ఘర్షణా (యుద్ధం) వ్యూహంలో భాగంగానే చెప్పుకోవాలి. దీని వివరాలు చూద్దాం.

నక్సలైట్లను గ్రామస్తులు తిప్పికొట్టారని ఈ మధ్య టీవీ, రేడియో, పత్రికలలో తరచుగా వార్తలు రావడం చూస్తున్నాం. దీనినే మరాఠీలో గాంవ్‌బందీగా చెబుతున్నారు. గాంవ్‌బందీ అంటే నక్సలైట్లను ఊళ్లలోకి రాకుండా కట్టడి చేయడం అనే అర్థంలో వ్యవహరిస్తున్నారు. ప్రజల నుండి విప్లవకారులను విడదీసి ఒంటరి చేయడానికి అనేక విఫల ప్రయత్నాలు చేసిన ప్రభుత్వ వర్గాలు, పోలీసులు ఈ సంవత్సరం ఫిబ్రవరి నుండి గాంవ్‌బందీని మొదలు పెట్టి రెచ్చగొడుతున్నారు. విపరీతంగా కుప్రచారం చేస్తున్నారు.

మహారాష్ట్ర పోలీసులు ఈ సంవత్సరం జనవరి నుండి ఏప్రిల్ వరకు 'జన జాగరణ్ అభియాన్' నడిపించారు. ఆ తర్వాత దానినే జూలై వరకు పొడిగించారు. ఈ కేంపెయిన్ మహారాష్ట్రలోని నక్సల్ ప్రభావిత జిల్లాలుగా పోలీసులు చెప్పే ఐదు జిల్లాలలో (గడ్చిరోలి, చంద్రపూర్, యావత్‌మల్, భండారా, గోందియా) నడిచింది. ఈ క్యాంపెయిన్ సందర్భంగా ఎక్కడికక్కడే జిల్లా పోలీసు అధికారులు అనేక సభలూ, సమావేశాలూ చేశారు. ప్రతి పోలీసు స్టేషన్ కేంద్రంలోనూ వారు కొంత పెద్ద గ్రామం అనుకున్న చోట ఈ సభలు జరిపారు. సభలకు ప్రభుత్వ యంత్రాంగంలోని అన్ని శాఖల అధికారులను రప్పించారు. ఆ ప్రాంతంలోని చిన్నా, పెద్దా పార్టీల రాజకీయ నాయకులను, గ్రామపెద్దలను, తెగపెద్దలను, ప్రజా ప్రతినిధులుగా చెప్పబడుతున్నవారినీ – సర్పంచ్, సభాపతి, జిల్లా పరిషత్ సభ్యులు వగైరా – కూడా ఈ సభా వేదికలెక్కించారు. వీరందరితో పాటు ఆ ప్రాంతంలోని మాజీ నక్సలైట్లనూ, సంఘ నాయకులనూ తప్పనిసరి సభలకు తీసుకవచ్చారు. సభలలో ముఖ్య వక్తలుగా కూడా వీరే. సభలను అట్టహాసంగానే జరిపారు. చుట్టుపక్కల గ్రామాల జనాలందరినీ అదిరించి, బెదిరించి, ఆశచూపి పోగేశారు. ఈ సభలలో మాట్లాడే ప్రతి వక్తా నక్సలైట్ల మూలంగా జనాలకు అనేక సమస్యలు ఎదురవుతున్నాయనే చెప్పాల్సి ఉంటుంది. ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాన్నే ఆశ్రయించాలి తప్ప నక్సలైట్ల వద్దకు వెళ్లకూడదని మాట్లాడాలి. నిజంగా ఇలా మాట్లాడేవారినే సభలలో వేదికలెక్కించారు. మరోమాటలో చెప్పాలంటే, వేదికలెక్కిన వారంతా గ్రామాల్లో అధికారాన్ని కోల్పోయిన ప్రజా వ్యతిరేక శక్తులూ, పోలీసు నిర్బంధానికి జడుసుకొని వారికి లొంగిపోయిన వ్యక్తులేనన్న విషయం ఎక్కడికక్కడే స్థానిక ప్రజలందరికీ తెలిసిందే. వీరంతా ఊళ్ళల్లో విప్లవ కార్యకలాపాలకు ఏదో ఒక రూపంలో అడ్డుతగిలేవారే. పీడిత ప్రజల్లో సమైక్యతా భావన పెంపొందకుండా, వారు ఒక సంఘటిత శక్తిగా ఎదగకుండా కాలడ్డుతున్నవారే. మహారాష్ట్రలో జరిగిన పదుల కొద్ది సభల తంతు అంతా ఇలాగే సాగింది. ఈ సభా సమక్షంలోనే తంతు చివరన రసవత్తరమైన ఘట్టం పెడుతున్నారు.

చివరన సభా వేదిక పైనుండి జిల్లా పోలీసు అధికారి (ఎస్‌పి) ప్రజలనుద్దేశించి మాట్లాడుతాడు. నక్సలైట్లను గ్రామాల్లోకి రానివ్వడం ద్వారా ఎదురవుతున్న సమస్యల దండకాన్ని చదువుతాడు. నక్సలైట్లను ఎదుర్కోవడానికే ప్రజల పక్షాన పోలీసులు పని చేస్తున్నారని ప్రసంగిస్తాడు. ప్రజలకూ, పోలీసులకూ ఏ ఇబ్బందీ ఉండకూడదంటే గ్రామాల్లోకి నక్సలైట్లను రానివ్వకూడదని హెచ్చరించి అందుకు ఆమోదిస్తున్నట్టుగా ప్రజలను చేతులెత్తమని హెచ్చరిస్తాడు. భారీ పోలీసు బందోబస్తు మధ్య అమాయక ఆదివాసీ ప్రజలు ఎటూ తేల్చుకోలేక చేతులెత్తక తప్పదు. ఈ సన్నివేశాన్ని పోలీసుల వెంట వచ్చే కెమరావాళ్లు పోటోలు తీస్తారు. పత్రికల వాళ్లు రాసుకుంటారు. మరుసటి రోజు దీనినంతా వార్తలకెక్కిస్తున్నారు. ఎన్ని గ్రామాల్లోని ఎన్ని వందల ప్రజలు నక్సలైట్లను తమ గ్రామాల్లోకి రానివ్వమన్నారో వార్తా కథనాలు సొంత వ్యాఖ్యానాలతో విడుదల చేస్తున్నారు. దీనినే గాంవ్‌బందీగా ప్రచారం చేస్తున్నారు. ప్రజలతో సంబంధాలు మెరుగుపర్చుకోవాలని, విశ్వాసం పెంచుకోవాలని భావించిన పోలీసులు జన జాగరణ్ అభియాన్‌లో భాగంగా జన జాగరణ్ మేళాలు కొన్ని చోట్ల రెండేసి రోజులు కూడా నిర్వహించారు.

ఈ రెండు రోజుల్లో కబడ్డీ, వాలీబాల్ ఆటల పోటీలు, రేల నృత్య పోటీలు, ఆరోగ్య శిబిరం, ప్రభుత్వ అధికారులతో సమస్యల పరిష్కారం ఏర్పాటు చేసారు. హాజరైన జనాలతో మేళా చివరన ర్యాలీ నిర్వహించి విప్లవ వ్యతిరేక, ప్రభుత్వ అనుకూల నినాదాలు ఇప్పించేవారు. ర్యాలీ చివరన సభ ఏర్పాటు చేసేవారు. ఇవన్నీ చాలా పకడ్బందీగా, ప్రభుత్వాధికారుల మధ్య కచ్చితమైన వర్క్ డివిజన్‌తో చేసేవారు. ఈ గాంవ్‌బందీ తంతు ఇంతటితో ముగియడం లేదు.

గడ్చిరోలి జిల్లాలోని కుర్కెడ తాలూకాలో మొదట ప్రారంభమైన ఈ గాంవ్‌బందీ సభల వార్తలు ఫోటోలతో సహా దిన (వార్తా) పత్రికలలో వచ్చాయి. 30 గ్రామాల ప్రజలు నక్సలైట్లను గాంవ్‌బందీ చేశారని రాశాయి. వెంటనే జిల్లా ఎస్‌పి రాజవర్ధన్ వీటిని సేకరించి జిరాక్స్ చేయించి పోలీసుల చేత పెద్ద ఎత్తున జిల్లా వ్యాప్తంగా వందలాది గ్రామాల్లో పంపిణీ చేయించాడు. ఆ తర్వాత జరిగిన అన్ని సభలలో అదే ప్రముఖ వార్తగా, సంఘటనగా నిల్చింది. ఇది ఇలా ఉండగా మరోవైపు మహారాష్ట్ర వ్యాప్తంగా నిర్మిస్తున్నామంటున్న గ్రామ సురక్షా సమితుల గురించి అవాకులు చవాకులతో పోలీసులు పత్రికల్లో రాయించడం మొదలు పెట్టారు. ఇందులో నాగపూర్ గ్రామీణ ఎస్‌పి ఉపాధ్యాయ ముందున్నాడు. అక్కడి గ్రామీణ ప్రాంతంలో 3,000 మంది యువకులు వీటిల్లో చేరారని ప్రకటించాడు. సమాజ వ్యతిరేక శక్తులను, దొంగలను, బందిబోట్లను పట్టుకోవడానికి ఈ నిర్మాణం ఎంతో ఉపయోగపడుతుందన్నాడు. వీరు రాత్రి 12 నుండి ఉదయం 6 గంటల వరకు గ్రామంలో గస్తీ తిరుగుతుంటారని చెప్పాడు. వీరితో పాటు పోలీసులు కూడా ఉంటారట. [నిజానికి ఇది యువతను పెడమార్గం పట్టించి జూనియర్ పార్ట్‌నర్లు (కొత్త యువ భాగస్వాములు)గా తయారు చేసుకునే ప్రక్రియ అనడం బాగుంటుంది) వీరికి కర్ర, విజిల్, టార్చ్‌లైట్ ఇస్తున్నట్టు చెప్పాడు. వీటి ఫలితాల గూర్చి బ్రహ్మాండంగా డబ్బా కొట్టాడు. సమాజంలో ప్రజల విశ్వాసం కోల్పోయిన పోలీసులతో యువత ఉండడం ద్వారా సంబంధాలు మెరుగుపడుతున్నాయనీ, విశ్వాసం పెరుగుతోందనీ, ప్రజల రక్షణ ప్రజల బాధ్యతగా గుర్తించబడుతున్నదనీ అన్నాడు. ఇంతే గాదు, నిరుద్యోగ యువకుల్లో ఉత్సాహంగా ఉందన్నాడు. ఉద్యోగస్తులు కూడా రాత్రులందు వీరితో చేరాలని కోరాడు. అంటే గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల భద్రతను కల్పించడంలో విఫలమైన పోలీసులు ఇప్పుడు హాయిగా చేతులు దులుపుకోవడమే గాకుండా జూనియర్ పార్ట్‌నర్‌లను తయారు చేసుకొని జనాల పైకి వదులుతున్నారని అర్థం చేసుకోవాలి. ఈ ప్రక్రియ ఒక్క నాగపూర్‌కే పరిమితం కాదు. గ్రామ సురక్షా సమితులు ఏర్పడుతున్న ప్రతి చోటా వాటి వ్యవహారం ఇలాగే ఉండక తప్పదని, జాగ్రత్తగా ఉండాలని ప్రజలను హెచ్చరిస్తున్నాం. ముఖ్యంగా విప్లవోద్యమ ప్రాంతాల్లోని విప్లవ ప్రజా సంగాల గూర్చి, పిజిఏ గూర్చి, విప్లవ పార్టీ గూర్చి యువతలో విషం ఎక్కించడమే పోలీసుల ఏకైక లక్ష్యమని తెలుసుకోవాలి. 1980-82లో సిరొంచ, అహిరి ప్రాంతంలోని అనేక గ్రామాల్లో పోలీసులు అనుసరించిన పద్ధతి ఊళ్లల్లో పెద్దలను కదిపితే గుర్తు చేస్తారు. కానీ ఆనాడు యువత అనతి కాలంలోనే గ్రామాల్లో పోలీసుల తరఫున గస్తీ తిరగడం మానుకొని పోలీసుల విష ప్రచారాన్ని తెలుసుకొని ప్రజాసంగాల్లో సంఘటితమైనారు. కాబట్టి పాత చరిత్ర తిరిగి కొత్త రూపంలో ముందుకు వస్తున్న వైనాన్ని గుర్తించాలి.

ఈ సందర్భంలో కాంగ్రెస్ పార్టీ ఈ చర్యలకు న్యాయబద్ధత కల్పించడానికి మరో రూపంలో ముందుకు వస్తోంది. కాంగ్రెస్ పార్టీకి చెందిన సామాజిక న్యాయ విభాగ అధ్యక్షుడు వివేక్ పండిత్ గడ్చిరోలి పరిస్థితుల గూర్చి సోనియా గాంధీకి అవగతం చేశానన్నాడు. ఒకవైపు పోలీసులు, మరోవైపు నక్సలైట్ల మధ్య జనం నలిగిపోతున్నారని ఇతడు వాపోయాడు. నక్సలైట్ల అదుపు కోసం ప్రభుత్వం స్పెషల్ యాక్షన్ ప్లాన్ కమిటీని రెండేళ్ల క్రితం ఏర్పర్చి 5 కోట్ల రూపాయలు మంజూరు చేసినా 95 లక్షలకు మించి ఖర్చు చేయలేదని లెక్కలు వివరించాడు. చివరకు 30 గ్రామాల ప్రజలు తమకు తాముగా సమైక్యమై, ధైర్య సాహసాలతో నక్సలైట్లను బహిష్కరించారని చెప్పి ఇలాంటి ప్రజలను ప్రోత్సహించాలని అసలు విషయం బయటపెట్టాడు. అంటే ఆ డబ్బు జనాలకు పంచి వారిని కొనివేయాలన్న మాట! ఇలాంటి విషయాలు ప్రజలతో సంబంధం లేకుండా అభివృద్ధి గూర్చి గొప్పగా మాట్లాడే ఉదారవాద ప్రజాస్వామ్యవాదులకు ఎంతో ప్రియంగా తోస్తాయి. అలాంటి వారిని తప్పుదోవ పట్టించడానికే వివేక్ పండిత్ లాంటి వారు మహా తెలివిగా రిపోర్టులు తయారు చేసి పత్రికలకు (ప్రపంచానికి) విడుదల చేస్తుంటారు.

వెంటనే ప్రభుత్వం రంగంలోకి దిగింది. ఈ గ్రామాలకు ముఖ్యమంత్రి షిందే ఒక్కొక్క లక్ష రూపాయలు బహుమానంగా ప్రకటించాడు. ఈ డబ్బు గ్రామస్థులు తమ ఉమ్మడి అవసరాలకు ఖర్చు చేసుకోవాలని, నక్సలైట్ల బెడద లేకుండా గ్రామాభివృద్ధి పనులు తామే చేపట్టాలని కోరాడు. ప్రజలపై అనేక దుర్మార్గాలకు ఒడిగడుతున్న సి-60 క్రాక్ కమెండో బలగాలకు (మహారాష్ట్ర ప్రభుత్వం 1992లో నక్సలైటు వ్యతిరేక ప్రత్యేక బలగాలను ఈ పేరుతోనే ఏర్పరిచింది) చెందిన ఐదుగురు కమెండోలను హతమార్చి ఇద్దరిని గాయపర్చిన రెండు రోజులకే మహారాష్ట్ర ముఖ్యమంత్రి షిందే గడ్చిరోలి చేరుకొని ఈ బహుమానాలు ప్రకటించడం విశేషం.

ఇక దీనిని రెచ్చగొడుతున్న విషయానికి వస్తే, పోలీసులు ఈ గాంవ్‌బందీ గూర్చి విపరీతంగా ప్రచారం చేస్తున్నారు. అబద్ధాలు దట్టించి తిమ్మిని బమ్మి చేస్తున్నారు. ఒక అబద్ధాన్ని పదే పదే చెప్పడం ద్వారా నిజంగా మారి జనాల్లోకి వెళ్తుందని నమ్మే వాళ్లలో, నమ్మించే వాళ్లలో పోలీసులంత బద్మాషులు మరెవ్వరుండరనడం అతిశయోక్తి కాదు. గత ఫిబ్రవరి నుండి ప్రారంభమైన ఈ 30 గ్రామాల గాంవ్‌బందీ ఈ అక్టోబర్ చివరి వరకు 150 గ్రామాలకు చేరుకున్నదని చొప్పదంటు గణాంక వివరాలు అందిస్తున్నారు. దీనితో సంబరపడిన ముఖ్యమంత్రి నవంబర్ మధ్యలో ఆ గ్రామాల కోసం రెండు కోట్ల 25 లక్షల రూపాయల బహుమాన రాశిని ప్రకటించాడు. గ్రామాల సంఖ్య పెరగడంతో బహుమతి రాశిని కూడా లక్ష నుండి లక్షన్నరకు ముఖ్యమంత్రి పెంచడం గమనించదగింది.

## ఈ బహుమతి రాశి ఏమవుతోంది?

నక్సలైట్లను తరిమికొట్టాలని పోలీసులు ఇచ్చే పిలుపులను అందుకొని వారితో గొంతు కల్పుతున్నవారు ప్రధానంగా ప్రజా వ్యతిరేకులేనన్నది – పెత్తందార్లు, లంపెన్‌లు, ప్రజలా గెరిల్లాలా చేతిలో శిక్షలనుభవించిన వారు – గుర్తుంచుకోవాలి. ప్రభుత్వం నుండి వచ్చే అన్ని రకాల సంస్కరణల ప్రయోజనాల నుండి లబ్ధి పొందుతున్నది గ్రామాల్లో ముఖ్యంగా వీళ్లే. గ్రామాల్లో వీరు తమ దుష్ట పలుకుబడిని ప్రయోగిస్తూ తమ వెనుక ఒక ముఠాను నిలబెట్టుకోవడానికి నిరంతరం కుట్రలు

పన్నుతున్నారు. విప్లవ ప్రజా సంగాలు, మిలిషియా జాగరూకతతో (అప్రమత్తంగా) ఉన్న చోట వీరి చాటుమాటు వ్యవహారాలన్నీ పసిగట్టి అరికట్టబడుతున్నాయి. అలా లేని చోట మాత్రం వీరి మాటే తాత్కాలికంగా నడుస్తోంది. ముఖ్యంగా ఇలాంటి గ్రామాలకే గాంవ్‌బందీ డబ్బులు అందుతున్నాయి. వీరు గ్రామాల్లో బహిరంగంగా విప్లవ కార్యకలాపాలను అడ్డుకునే సాహసానికి పూనుకోలేకపోతున్నారు. కానీ ప్రభుత్వ కార్యాలయాల్లో పోలీసుల ముందు గాంవ్‌బందీ డబ్బులందుకోవడానికి కక్కుర్తి పడుతున్నారు. పోలీసులు అందజేస్తున్న డబ్బులు ఈ దుష్టశక్తులే కైవసం చేసుకుంటున్నాయి. వీటిని గ్రామ సమిష్టి అవసరాలకు ఎక్కడా ఖర్చు చేయడం లేదు. వీరే తమ పబ్బం గడుపుకోవడానికి ఆ డబ్బులను ఖర్చు చేసుకుంటున్నారు. గ్రామాల్లోని పీడిత ప్రజలకు ముఖ్యంగా కింది వర్గాల వారికి ఈ డబ్బులతో సంబంధం లేదని ఆ 150 గ్రామాల్లోని ఏ గ్రామానికి వెళ్లినా స్పష్టమవుతుంది.

## అసలు ఈ గాంవ్‌బందీ పోలీసులకు నేర్పిందెవరు?

విప్లవోద్యమాన్ని అణచివేయడంలో ఆంధ్రప్రదేశ్ పోలీసులు అన్ని రాష్ట్రాల పోలీసులకు గురువులయ్యారు. వీరు ఇజ్రాయిల్, స్కాట్లాండ్‌యార్డ్, అమెరికా బలగాల నుండి శిక్షణ పొందుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని గ్రేహౌండ్స్ బలగాలు ఆ తరహాలోనే అన్ని రాష్ట్రాల ప్రత్యేక పోలీసు బలగాలకు శిక్షణనివ్వడంలోనూ ముందున్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని హాక్ ఫోర్సు (ప్రస్తుతం రద్దయ్యింది), మహారాష్ట్రలోని క్రాక్ కమాండోలను, అట్లాగే ఇతర నక్సల్ ప్రభావిత అన్ని రాష్ట్రాల ప్రత్యేక బలగాలను గ్రేహౌండ్స్ తమ తరహాలోనే తీర్చి దిద్దుతున్నాయి. ఇప్పుడు వీరు అనుసరిస్తున్న బహుముఖదాడిలో 'నక్సలైట్లకు గ్రామ బహిష్కరణ' కూడా ఒక అణచివేత రూపమనీ, ఇదంతా సామ్రాజ్యవాదుల ఆదేశాల మేరకు సాగుతున్న ఎల్ఐసి వ్యూహంలో (తక్కువ తీవ్రతా యుద్ధ వ్యూహం) భాగమని పైన చూశాం. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా పెద్ద మల్లాపురం, నిజామాబాద్ జిల్లా మైలారంల నుండి ఈ 'అన్నలను తరిమికొట్టడం' అన్నది ఆరేళ్ల కింద ప్రారంభమై క్రమంగా వెర్రితలలు వేస్తోంది. పోలీసుల అండదండలతో ఆనాడు పైన చెప్పిన గ్రామాల్లోని లంపెన్ శక్తులు గెరిల్లాపై బడి దాడి చేశారు. ముఖ్యంగా పెద్ద మల్లాపురంలో స్వచ్ఛంద సంస్థ ముసుగులోనున్న శక్తుల ప్రోద్బలంతో ఆ ఘటన జరిగింది. గెరిల్లాలు ఎంతో సంయమనంతో వ్యవహరించినప్పటికీ ఫలితం లేకపోవడంతో అనివార్యంగానే ప్రతిఘటించి తప్పుకోవల్సి వచ్చిన వైపరీత్యాన్ని పోలీసులు పెద్దెత్తున ప్రచారం చేశారు. ముఖ్యమంత్రి స్వయాన ఆ గ్రామాలను సందర్శించి వారిని ఎంతగానో మెచ్చుకొని వారిని రెచ్చగొడుతూ డబ్బుల వల విసిరాడు. కొన్ని కుహనా అభ్యుదయ సంగాలు, మానవ హక్కుల సంగాలు ఆ ఘటనను వాస్తవమని నమ్మితే మరి కొన్ని ఇతర ప్రజాసంగాలు ఆయా గ్రామాలను సందర్శించి తమ ప్రతిక్రియను వ్యక్తం చేశాయి. అది మొదలు గ్రామ బహిష్కరణ వార్తలు పత్రికల్లో రాయడాన్ని ఏటేటా పెంచుతున్నారు. ఈ సంవత్సరం జూలై నాటికి ఒక్క అనంతపురం జిల్లాలోనే 17 ఘటనలు జరిగాయని పోలీసులు ప్రకటించారు. ఈ రకంగా ప్రారంభమైన 'గ్రామ బహిష్కరణ' నేడు అన్ని రాష్ట్రాలకు ఎగబాకింది.

## తొమ్మిది రాష్ట్రాలకు సోకుతున్న గ్రామ బహిష్కరణ

ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమైన విప్లవకారులకు గ్రామ బహిష్కరణ క్రమంగా అన్ని రాష్ట్రాలకు సోకింది. విప్లవోద్యమాన్ని అణచివెయ్యడంలో సామ్రాజ్యవాదులకు ఒక ప్రయోగశాలగా మారిన ఆంధ్రప్రదేశ్ అనుభవాలన్నింటినీ జెఐసి స్వీకరిస్తోంది. ప్రతి మూడు మాసాలకొకసారి సమావేశమవుతున్న నక్సల్ పీడిత తొమ్మిది రాష్ట్రాల (ఆంధ్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒరిస్సా, బీహార్, ఝార్ఖండ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్) పోలీసు ఉన్నతాధికారులు, ముఖ్యంగా ఆంధ్ర, ఆంధ్రతో పాటు ఇతర రాష్ట్రాల అనుభవాలను మదించి ఒకరికొకరు అందజేసుకోవడంలో జెఐసి గైడ్ చేస్తోంది. దాని గైడెన్స్‌లోనే దీనిని అన్ని రాష్ట్రాలలో రెచ్చగొడుతున్నారు. గ్రామాల్లోని విద్రోహుల మూలంగా అక్కడక్కడ ముందుకు వస్తున్న దుర్మార్గాలకు మసిబూసి మారేడుకాయ చేసి ప్రచారం చేస్తున్నారు. ఈ మధ్య జరిగిన దుస్సంఘటనలిలా ఉన్నాయి.

ఝార్ఖండ్ రాష్ట్రంలోని తూర్పు సింఘ్‌భూం జిల్లాలోని లాంగో గ్రామంలో ప్రభుత్వం 'నాగరిక్ సురక్షా సమితి' (గ్రామ రక్షణ దళం) ని ఏర్పర్చింది. ఇందులో ఉన్నవారందరూ ప్రజా వ్యతిరేక పెత్తందారీ, లంపెన్ శక్తులే. ఆ గ్రామానికి వెళ్లే గెరిల్లాలను నమ్మించి సెప్టెంబర్ 2003లో మొదట తొమ్మిది మందిని ఆ తర్వాత నల్గురిని హత్య చేశారు. ఆ తర్వాత వీరికి పోలీసులు ప్రత్యేక రక్షణ కల్పించారు. బహుమానాలు ప్రకటించారు.

ఒరిస్సా రాష్ట్రంలో రాయగడ జిల్లాలో గల గుణపూర్, చంద్రపూర్, గుడారి, బిస్సంకటక్ ప్రాంతాలు విప్లవోద్యమ ప్రాంతాలుగా ముందుకొచ్చాయి. ఇక్కడ వేలాది మంది రైతాంగం సంఘటితమై అనేక పోరాటాలు చేపట్టి గ్రామీణ ఫ్యూడల్ ఆధిపత్యాన్ని దెబ్బ(తీశారు)తీస్తున్నారు. దీనితో ఒరిస్సా పోలీసులు ఆంధ్ర అడుగుజాడల్లో ప్రజా వ్యతిరేక శక్తులను కూడదీశారు. 'శాంతిసేన' అంటూ ఒక నిర్మాణ రూపం ఇచ్చి దాకువా మాంఝీని నాయకున్ని చేశారు. వీడు గ్రామాల్లోని ఆదివాసీలను బెదిరించి వారి చేత విల్లంబులు పట్టించి ఆగస్టు-అక్టోబర్ 2003 మధ్య మూడు మాసాలలో 40 సభలు ఏర్పర్చాడు. గ్రామాల్లోని విప్లవ ప్రజాసంగాల నాయకత్వంపై దాడులు జరిపి 30 మందిని సరెండర్ కావాలని హెచ్చరించి లొంగదీశాడు. విప్లవోద్యమం నుండి వైదొలిగిన మరో 10 మంది గెరిల్లాలను పోలీసులకు అప్పగించాడు. ఇదంతా దాకువా నాయకత్వంలో వేలాది మంది ఆదివాసులు నక్సలైట్లకు గ్రామ బహిష్కరణ ప్రకటించినట్టుగా స్థానిక, దేశ వార్తలలో ప్రచారమయింది.

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం 'జనజాగరణ్ అభియాన్'కు పెట్టింది పేరు. నిజానికి దీనిని 'జన అణచివేత అభియాన్'గానే ఇక్కడ చెప్పుకుంటారు. దీని సర్వసేనాని మాజీ రాష్ట్ర పరిశ్రమల మంత్రి మహేంద్ర కర్మ. వీడు తన గూండా గ్యాంగునంతా పోగేసి, అన్ని రకాల ఆయుధాలను తీసుకొని పోలీసుల రక్షణలో గత దశాబ్ద కాలంగా ఇలాంటి అభియాన్‌లను కొనసాగిస్తున్న వైనం బస్తర్ ప్రజలందరికీ తెలిసిందే. ఇక్కడ పత్రికలు పతాక శీర్షికలతో వీడి ఆగడాలను కీర్తిస్తూ నక్సలైట్లకు ధీటైన జవాబుగా, నక్సలైట్లను ఎదుర్కొంటున్న అభియాన్‌గా రాశాయి. కానీ అనతికాలంలోనే ప్రజలు వాస్తవాలు తెల్సుకొని ఈ అభియాన్‌కు ముందుండి నడిపిన దుర్మార్గుల్లో చాలా మందికి బుద్ధి చెప్పారు. దీనితో జన జాగరణ్ అభియాన్ తోక ముడిచింది. అయినప్పటికీ నేటికీ కొన్ని చోట్ల పోలీసుల ప్రోద్బలంతో స్థానిక దుష్టశక్తులు వనసంరక్షణా సమితులు, గ్రామ సురక్షాసమితులు ఏర్పర్చి జన జాగరణ్ అభియాన్‌ను ఏదో ఒక రూపంలో ముందుకు తెస్తున్నాయి. ఈ సంవత్సరం (2003) ఏప్రిల్, మే నెలలలో

కోయిలీబేడ ప్రాంతంలో కొన్ని ఘటనలు ఎదురయ్యాయి. కానీ ప్రజలు అప్రమత్తంగా ఉండి ప్రతిఘటించడంతో వెనక్కి తగ్గాయి.

పైన పేర్కొన్న రాష్ట్రాల్లోనే గాకుండా ఇతర రాష్ట్రాల్లో కూడా ఇలాంటి కుయుక్తులు చోటు చేసుకుంటున్నాయి. ఆంధ్ర పోలీసులు వీటిని రెచ్చగొట్టడంలో కూడా మొనగాళ్లయి ముందుకొస్తున్నారు. ఈ మధ్య ఆదిలాబాద్ జిల్లాలోని కడంబా గ్రామంలోని లంపెన్ శక్తులను పోలీసులు రెచ్చగొట్టి అక్కడి దళాన్ని మట్టుబెట్ట పూనుకున్నారు. కామ్రేడ్ మధునయ్యతో పాటు మరో ఇద్దరు కామ్రేడ్స్ లంపెన్ శక్తుల దాడిని తీవ్రంగా ప్రతిఘటించి తప్పుకోగలిగారు. దళం నుండి లాక్కున్న ఆయుధాలను ఆ లంపెన్ శక్తులు పోలీసులకు అప్పగించారు. ఈ దుశ్చర్యను పోలీసులు పెద్దెత్తున ప్రచారం చేయడమే గాకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆ గ్రామానికి 50 లక్షల రూపాయలను బహుమానంగా వెంటనే ప్రకటించాడు. ప్రజా ధనాన్ని ఆంధ్ర ప్రభుత్వం దుర్వినియోగపరుస్తున్న తీరు ఇదీ. ప్రస్తుతం అన్ని రాష్ట్రాల పోలీసుల పోకడను చూస్తుంటే ఇలాంటి చర్యలను మరింత రెచ్చగొట్టనున్నారనే తెలుస్తోంది. నవంబర్ మూడవ వారంలో భువనేశ్వర్‌లో సమావేశమైన పోలీసు ఉన్నతాధికారుల సమావేశం తొమ్మిది రాష్ట్రాలలోని 55 ఆదివాసీ జిల్లాలకు నక్సలైట్ల అణచివేత కోసం 3475 కోట్ల రూపాయలు కేటాయించింది. ఇందులో ఒక్కో ఆదివాసీ జిల్లాకు ఏటా 15 కోట్ల రూపాయల చొప్పున మూడేళ్ల వరకు మంజూరు చేయడాన్ని బట్టి చూస్తే ఇలాంటి దుశ్చర్యల పోకడ ఎలా పెంచపూనుకున్నారో తెలుస్తుంది.

## ప్రజలు సమైక్యంగా ఈ దుశ్చర్యలను ఓడించాలి!

తొలి నుండీ విప్లవోద్యమాన్ని అడ్డుకోవడానికి ప్రభుత్వ వర్గాలు, పోలీసులు అనేక కుట్రలకు పాల్పడుతున్నారు. కోట్ల డబ్బును దుర్వినియోగం చేస్తున్నారు. విప్లవోద్యమం ద్వారా గ్రామాల్లో ఆధిపత్యాన్ని కోల్పోతున్న శక్తులకు, లంపెన్‌లకు పోలీసులు అండగా నిలుస్తున్నారు. గ్రామీణ ప్రాంతంలో పెంపొందుతున్న ప్రజాయుద్ధాన్ని దెబ్బతీయడానికి పోలీసులు ప్రజలను చీలదీసి, ఒక సెక్షన్‌ను దెబ్బతిన్న ఆధిపత్య వర్గాల నాయకత్వంలో చేరదీసి నిలపడానికి చేస్తున్న ప్రయత్నాలే గాంప్‌బందీ రూపంలో ముందుకు వస్తున్నాయి. వీటిని ప్రజలు లోతుగా అర్థం చేసుకోవాలి. పోలీసులు నిర్మిస్తున్న శాంతిసేన, జన జాగరణ్ అభియాన్, నాగరిక్ సురక్షా సమితి, వన సంరక్షణ సమితి, ఆస్తుల సంరక్షణ సమితి లాంటి వాటికి ఆకర్షణీయ పేర్లెన్ని పెట్టినా అవి ప్రజలను తప్పుదోవ పట్టించేవే. అవన్నీ విప్లవోద్యమాన్ని నిర్మూలించే కుట్రలతో నిండినవే. ఇలాంటి వాటికి గతంలో ధైర్యంగా బుద్ధి చెప్పిన అనుభవం మన దండకారణ్య ప్రజలకుంది. గడ్చిరోలిలో సభాపతి బీరవర్పె నాయకత్వంలో 1988లో శాంతిసేన పేరుతో ముందుకు వచ్చిన సాయుధ ముఠాను ప్రజా మిలిషియా, ప్రజలు చావు దెబ్బతీశారు. బస్తర్‌లో అప్పటి ఎమ్మెల్యే మహేంద్ర కర్మ ముందుకు తెచ్చిన జన్ జాగరణ్ అభియాన్‌లను విప్లవ ప్రజానీకం ఓడించారు. ఈరోజు ముందుకు వస్తున్న అన్ని రకాల ప్రజావ్యతిరేక శక్తులకు ఆ అనుభవాల వెలుగులోనే తిరిగి ప్రజలు బుద్ధి చెప్పాలి. డబ్బు కక్కుర్తితో, పోలీసుల అండతో గ్రామాల్లో ముందుకు వస్తున్న ప్రజా వ్యతిరేక శక్తులను ధైర్యంగా, నిర్దాక్షిణ్యంగా అణచివేయాలి. ప్రజా సంగాలు, ప్రజా రాజ్యాధికార సంస్థలు, ప్రజా మిలిషియా నాయకత్వంలో పిజిఏ అండదండలతో దుష్ట శక్తులను ఓడించి మట్టుబెట్టాలి. పోలీసులు అందజేస్తున్న బహుమతి డబ్బును తిప్పికొట్టాలి. పోలీసులకు గట్టి బుద్ధి చెప్పాలి. ★

*[నోట్ : కాశ్మీర్, ఈశాన్య భారత ఉద్యమాలను అణచివేయడంలో భారత ప్రభుత్వం, పోలీసు వర్గాలు గత కొద్ది సంవత్సరాలుగా ప్రజలను చీల్చి దెబ్బతీయడంలో అనేక కుట్రలకు పాల్పడుతున్నాయి. వ్యాస పరిమితుల రీత్యా ఆ విషయాల్లోకి వెళ్లలేదు.]*

## అడవుల పరిరక్షణ - ఒక ప్రత్యామ్నాయం

***(..... 15వ పేజీ తరువాయి)***

భయం భయంగా దొంగచాటుగా తమ అవసరాలను తీర్చుకునే దుర్గతి నుండి బయటపడినందుకు ప్రజలకు సంతోషంగా ఉంది. దొంగ కర్ర ప్రస్తావనే లేకుండా పోయింది. ఖాకీ డ్రెస్సులో ఉండే జంగలయ్య చేతిలో పిఒఆర్ (ప్రైమరీ అఫెన్సివ్ రిపోర్ట్) అనే మూడక్షరాలు చెక్కి ఉన్న 'సుత్తి' భయం తొలగిపోవడమే గాకుండా విప్లవోద్యమంలో పుట్టి ఆత్మగౌరవంతో పెరుగుతున్న నేటి తరానికి ఆ గతం తెలవకుండా పోయినందుకు ప్రజలు ఎంతో మురిసిపోతున్నారు. తాము కట్టుకున్న గూడాలు, కష్టార్జిత పంటలు తమ కళ్లముందే ఖాకీలు కాలబెడుతుంటే విలవిలలాడే గుండెలతో విలపిస్తూ చూసే ఒక భయంకర ఘట్టాలను చూసే దుస్థితి తమ కన్నబిడ్డలకు తెలవకుండా పోతున్నందుకు ముఖ్యంగా మహిళలకు (తల్లులు) ఊరటగా ఉంది.

ఆ అరాచకాలకూ, దుర్మార్గాలకు కాలం చెల్లిపోయినందుకు గర్వపడుతున్నారు. ఇది ఒక నిజమైన ప్రత్యామ్నాయం. ప్రజల జీవితాలతో, ప్రజల చైతన్యంతో, ప్రజల కృషితో ముడిపడి కొనసాగుతున్న ఒక వాస్తవమైన అభివృద్ధి. ఇది ప్రజాస్వామికమైనది. న్యాయసమ్మతమైనది. దేశంలో ఇది ఒక నమూనా. ఒక నూతన ప్రక్రియ పురుడు బోసుకుంది.

పై నమూనాల నామరూపాలు లేకుండా చేయాలనే దుష్ట తలంపుతో పాలకవర్గాలు పోటీ పడుతున్నాయి. దుర్మార్గమైన హింసకు తలపడుతున్నాయి. భారీ ఎత్తున ఖాకీ బలగాలను అడవుల్లోకి, ఆదివాసుల పైకి ఉసిగొడుతున్నాయి. తమదంతా ప్రజాస్వామ్యమనే ముసుగులో కొనసాగిస్తున్నాయి. అందుకు తగిన లిజిటమసీని పొందడానికి రోత పుట్టించే అబద్ధపు ప్రచారానికి లంకించుకుంటున్నాయి. రాష్ట్రాలు వాటికి తోడు కేంద్రం సంయుక్తంగా వ్యూహాత్మక పథకాలను రచిస్తూ రాజ్యాంగం, చట్టం, కోర్టులు, న్యాయం, ఎన్నికలు, ప్రధాన జన జీవన స్రవంతి అనే వాగాడంబరంతో బహుముఖ దాడికి పాల్పడుతున్నాయి. ఇదంతా మరోమాటలో ప్రజలపై యుద్ధం ప్రకటించడమే. ప్రజలను తమ పశు బలగాలతో, ప్రపంచ ద్రవ్య సంస్థల అండదండలతో అణచివేయడమే ఒక నూతనమైన, బీజప్రాయంలోనున్న, అభ్యుదయమైన నమూనాను, ప్రత్యామ్నాయాన్ని నులిపివేయడమే. కాబట్టి దానిని కాపాడుకోవడానికి, రెండు దశాబ్దాల ప్రజా విప్లవోద్యమ ఫలితాలను రక్షించుకోవడానికి అపూర్వస్థాయిలో ముందుకు రావల్సిన అవసరం ప్రజల ముందుంది. కాగా, ఈ ప్రజా పోరాటాలను సమర్థిస్తూ ప్రజల వెంట తప్పనిసరిగా ఉండాల్సిన ఒక మహా తక్షణ ఆవశ్యకత తీవ్రంగా ప్రజాస్వామికవాదులందరి ముందుకు వచ్చింది. ప్రజలలో నెలకొన్న ఐక్యతను చీల్చే కుట్రలకు, ప్రజల్లో పెంపొందుతున్న ప్రజాస్వామ్య విలువల విధ్వంసానికి నిరుపేద ప్రజల జీవితాలను ఛిద్రం చేసే చర్యలకు పాల్పడుతూ కాలాన్ని వెనక్కి తీసుకెళ్లడానికి చేస్తున్న దోపిడీ పాలకవర్గాల బహుముఖ ప్రయత్నాలు విఫలం కాక తప్పవని సమైక్యంగా నిరూపిద్దాం. ★

# అడవుల పరిరక్షణ - ఒక ప్రత్యామ్నాయం

దండకారణ్యంలోని గడ్చిరోలి డివిజన్‌లో గల అటవీ ప్రాంతంలో ప్రభుత్వ అటవీశాఖ వారు 2003 మే, జూన్ మాసాలలో అడవుల పరిరక్షణ కోసమంటూ బొందలు (కాలువలు) తవ్వించారు. అడవి నుండి ఆదివాసులు కలప తరలించుకు పోతున్నందున అడవులు నష్టపోతున్నాయని భావిస్తున్న ప్రభుత్వం గ్రామస్థులు అడవి నుండి కలప తీసుకెళ్లడాన్ని నిరోధించడంలో భాగంగా ఊరి పరిసరాల్లోని అడవి చుట్టూరా ఈ కాలువలు తవ్వించింది. గ్రామస్తులను కూలికి పెట్టి కాలువలు తవ్వే పనులు చేయించుకొని వారికి కూలీగా ధాన్యం చెల్లించారు. ఇవన్నీ 'పనికి ఆహారం' పథకంలో భాగంగా జరిగాయి. కరువులో ప్రజలను ఆదుకునే 'అభివృద్ధి' కార్యక్రమాల్లో అటవీ పరిరక్షణలో ఇవి భాగమన్నారు. వీటితో అడవులు, పర్యావరణం కాపాడబడుతున్నాయని అన్నారు. కానీ ఇది నిజమా? ఇది అభివృద్ధా? లేక అణచివేతా? పర్యావరణాన్ని రక్షించిన చరిత్ర పాలకవర్గాలకు ఎప్పుడైనా, ఎక్కడైనా ఉందా? ప్రస్తుతం ఇక్కడి ప్రజలు వీటిని వ్యతిరేకిస్తలేరని చెబుతూ, అందుకని ఇవి న్యాయసమ్మతం, ప్రజాస్వామ్యయుతం అంటూ వారి ఆమోదంతోనే, వారి కోసమే జరుగుతున్నాయనడం నిజమా? అసలు వాస్తవాలు ఏమిటి?

ప్రభుత్వం వారు అడవుల నిర్మూలనను అరికట్టడానికి, అడవుల పరిరక్షణ బాధ్యతను కమ్యూనిటీ మేనేజ్‌మెంట్ పేరుతో వన సంరక్షణ సమితులకు ఇచ్చారు. ఈ దేశంలోని సర్వోన్నత న్యాయస్థానమైన సుప్రీం కోర్టు కూడా దీనిని సమర్థించింది. అంతేకాదు, ఈ దేశంలోని ఆదివాసులు అడవులపై ఆధారపడి జీవిస్తూ ఏళ్ల తరబడిగా సేద్యం చేసుకుంటున్న పంటభూములను కూడా వదిలివేయాలని అది తీర్పునిచ్చింది. దీనితో దాదాపు కోటికి పైగా ఆదివాసులు ఈ తీర్పు వేటుకు గురవుతున్నారు. నిర్ణీత గడువు లోగా వీరందరినీ భూముల నుండి తొలగించాలని కూడా తీర్పు చెప్పింది. వినని వారిని అవసరమైతే బలవంతంగానైనా సరే భూముల నుండి బేదఖల్ చేయించాలని కూడా సెలవిచ్చింది. నిజానికి భూముల నుండి రైతులను దూరం చేయడం సామరస్యంగా జరిగే పనేనా? ఆ భూములు వారి ఆధీనంలోకి రావడానికి వారెన్ని పోరాటాలు చేశారు? నేటికీ ఎన్ని బాధలనుభవిస్తూ వాటిని కాపాడుకుంటున్నారు? ఇవేవీ ప్రభుత్వానికీ, సుప్రీంకోర్టుకూ అక్కరలేదు. అందుకే బలవంతంగానే, దౌర్జన్యపూరితంగానే ఆ తొలగింపు క్రమం దండకారణ్యంలోని సిరొంచ, చామూర్షి, కోయిలిబేడ మొదలైన ప్రాంతాలలో ప్రారంభమైంది. అయితే నీళ్లకూ చేపకూ, భూమికీ విత్తనానికీ గల అవినాభావ సంబంధమే రైతుకూ భూమికీ, చావుకూ బతుక్కూ మధ్య ఉందని బతుకుసారం తెలిసిన రైతాంగం భూములను కాపాడుకోవడానికే ఆ ప్రాంతాల్లో ముందుకు వస్తున్నారు. సాగు భూముల నుండి రైతులను బేదఖల్ చేయడం ద్వారా అడవులు పరిరక్షించబడతాయా? విపరీతమైన అడవుల నిర్మూలనకు అసలు ప్రధాన కారకులెవరు? అడవి చుట్టూ కందకాలు తవ్వడం, రైతులను భూముల నుండి బేదఖలు చేయించడమే అడవుల పరిరక్షణకు గ్యారంటీనిస్తాయా? దీని వెనుక అసలు కారకులు, కుట్రదారులు ఎవరు? వారి స్వప్రయోజనాలు ఏమిటి? అన్న విషయాలను కూడా అర్థం చేసుకోవాలి.

రైతాంగం తమ అవసరాల కోసం, తమకు కావల్సిన కర్రను అడవిలో నుండి తెచ్చుకోగలిగే పరిస్థితులకు ఏనాడో కాలం చెల్లిపోయింది. బ్రిటిష్ వారి కాలంలోనే (1867లో) తొలిసారిగా అడవిపై అనేక చట్టాలు తయారై యాజమాన్య హక్కునూ సొంతం చేసుకోవడంతో అడవిలో నివసించే ఆదివాసులు, అడవి పరిసర గ్రామాల్లోని ఆదివాసీయేతర రైతాంగం అడవిపై గల సంప్రదాయ హక్కులను కోల్పోయారు. అడవుల్లో నివసించే ప్రజలు అడవికి పరాయి వారయ్యారు. నూతనంగా దోపిడీ చట్టాలు రావడంతో అటవీ రక్షణ పేరుతో ఆదివాసీల మధ్య జంగ్లాత్ అధికారులు ప్రత్యక్షమయ్యారు. దీనితో ఆదివాసులకు, రైతాంగానికి అడవిలో నుండి స్వేచ్ఛగా, ఉచితంగా కర్రలు, ఆకులు ఎప్పటిలా తెచ్చుకునే అవకాశమే లేకుండా పోయింది. పుల్ల విరిచినా, ఆకు తెంపినా, కర్ర నరికినా, పంట పొలాలు చేసినా ప్రజలు నేరస్థులయ్యారు. ఇంతేగాదు, వారి పశువులను సైతం అడవిలో మేపుకునే అవకాశం లేకుండా పోయి అనేక కట్టడులు (చట్టాలు) ముందుకు వచ్చాయి. అడవుల్లో నివసించే మనుషులు, పశువులు ఈ దేశంలోని అనేక కట్టడుల మధ్య, అనుమతి పత్రాలు (లైసెన్స్) లేవన్న సర్కారీ వారి నెపంతో గత 150 సంవత్సరాలకు పైగా అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. దండుగలు, జైళ్లు, కేసుల కోసం కోర్టుల చుట్టూ తిరగడం, ఖాకీల ఆగడాలు, దౌర్జన్యాలు, అవమానాలు, అరాచకాలు ప్రజల జీవితంలో భాగమైనాయి. ఇదీ భారతదేశ వ్యాప్తంగా బ్రిటిష్ వారి పాలన నుండి నేటి వరకూ ఆదివాసులు అనుభవిస్తున్న సాధారణ దుస్థితిగా చెప్పవచ్చు. దండకారణ్యం అందుకేమీ మినహాయింపు కాదు.

అలాంటి దండకారణ్యంలోని ఆదివాసీ జీవితాలలో విప్లవోద్యమం ఒక పెనుమార్పును తీసుకవచ్చింది. విప్లవోద్యమంలో సంఘటితమైన ప్రజలు 'ఈ అడవి మాది' అని నినదించారు. అటవీ శాఖ వారి దోపిడీ చట్టాలను సవాలు చేశారు. రైతాంగంపై సర్కారు వారు పెట్టే అక్రమ కేసులను ఎదిరించారు. బీట్‌గార్డు (forest guard) చేతిలో నిరంతరం ఒక ఆయుధంలా ఉండే సుత్తిని చూసి బెదిరిపోయే ఆదివాసులు వారి భరతం పట్టారు. అనేక చోట్ల సుత్తులను స్వాధీనం చేసుకున్నారు. అడవిని రిజర్వ్ అడవులుగా, రక్షిత అడవులుగా విభజించి వాటిలోకి ప్రజలు చొరబడకూడదంటూ చేసిన చట్టాలు చెల్లకుండా పోయాయి. అడవిలోకి ప్రజలు రాకూడదనీ, అందులోని కలపను ఎడ్ల బండ్ల ద్వారా చేరవేసుకోకూడదనీ గతంలో అడవి చుట్టూ తవ్విన కందకాలు కూడుకుపోయాయి. మనుషులు అడవిలోనే సంచరించకూడదనే వ్యూహాత్మక కుట్రలో భాగంగా సర్కారీ తుమ్మలు (విషపు తుమ్మ) నాటే జంగ్లాత్ వారి పనులు నిలిచిపోయాయి.

ప్రజలు తమ ఉద్యమ చరిత్రలో మొట్టమొదటి సారిగా సమైక్యంగా, సంఘటితంగా ఎదుర్కొన్నది అటవీశాఖనే. అందులోని ఉద్యోగులనే. వారిని చూసి కొరివి దయ్యాలంటూ జడుసుకునే ప్రజలు అనేక చోట్ల వారి దౌర్జన్యాన్నీ, దుర్మార్గాన్నీ ఎదుర్కొన్నారు. ఫలితంగా వారు అడవులను వదిలి, గ్రామాలను ఖాళీ చేసి రేంజ్ హెడ్‌క్వార్టర్లకు మకాంలను మార్చుకున్నారు. దీనితో తిరిగి ప్రజలు స్వేచ్ఛగా, నిరభ్యంతరంగా, డబ్బులతో పొందే ఎలాంటి అనుమతి పత్రాల అవసరం లేకుండా అడవిని అనుభవించసాగారు. వారి పశువులనూ మేపుకోసాగారు. తమకు అవసరమైన మేరకు నూతనంగా సాగుభూములు ఉనికిలోకి తెచ్చుకున్నారు. పాత భూములను అనుభవించసాగారు. పంటభూములకు ప్రభుత్వ పట్టాలతో పనేమీ లేదంటూ పంటలు పండించుకోసాగారు. ఆత్మగౌరవంతో

జీవిస్తున్నారు. 1980లో అడవులు కేంద్ర జాబితాలోకి వెళ్లడంతో రాష్ట్ర ప్రభుత్వాలు పట్టాలు ఇచ్చే అధికారాన్ని కోల్పోయాయన్న మిష, అప్పటి నుండి పట్టాలు లభించడం లేదన్న విషయం పాఠకులు దయచేసి ఇక్కడ మరోసారి గుర్తుచేసుకోవాలి.

ఈ మార్పులు పాలకవర్గాలకు మింగుడుపడడం లేదు. అడవిపై తమ అధికారం, తమ యాజమాన్యం ధ్వంసమైపోతోందని వారు భావిస్తున్నారు. దానినెలాగైనా నిలుపుకోవాలని కుట్రలు పన్నుతున్నారు. వారి దోపిడీ సాగకుండా పోవడంతో వారి ఆస్తులు, అంతస్తులు తగ్గుతున్నాయని గ్రహించారు. అధికారం అనే పీఠం కింద చిచ్చు పుట్టడంతో దానిని అణచివేయడానికి పంతాలు పూనుతున్నారు. అడవుల నిర్మూలనతో ప్రభుత్వ ఆదాయం పడిపోతోందని గగ్గోలు చేస్తున్నారు. అడవిని నమ్ముకునే వారి ఆటలు సాగకుండా పోయాయనీ, అటవీ వ్యాపారంపై కోటానుకోట్ల లాభాలు గడించే వర్గాల ఆదాయానికి గండి పడిందనీ హైరానా పడుతున్నారు. దీనితో అడవిలోకి ఖాకీలను రప్పించారు. ఖాకీవనం చేయాలనుకుంటున్నారు. ఒకవైపు తీవ్రమైన అణచివేత చర్యలను చేపడుతూ యుద్ధ వాతావరణాన్ని సృష్టిస్తూ మరోవైపు దానికి 'న్యాయబద్ధత' కల్పించుకోవడం కోసం అభివృద్ధి పనుల పేరుతో అనేక (కు)సంస్కరణలకు పూనుకుంటున్నారు. ఇందులో భాగమే 'వన సంరక్షణ సమితి'లు, బొందలు తవ్వడం, చెరువులు-కుంటలు తవ్వించడం, జనాలకు ఇండ్లు కట్టించడం, తాత్కాలిక పట్టాలు సృష్టించడం మొదలైనవన్నీ చోటు చేసుకుంటున్నాయి. ఈ పనులన్నీ గత కొద్ది కాలంగా ఇక్కడి ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఎల్ఐసిలో భాగంగానే అటవీశాఖ వారు కూడా చేపడుతున్నారు. మరోవైపు జనావాసాలను బలవంతంగా ఖాళీ చేయిస్తూ వారి పంట భూములను బీళ్లుగా మారుస్తూ పరమ జీవకారుణ్యంతో వన్య మృగ సంరక్షణా కేంద్రాలు, జాతీయ పార్కులు నిర్మిస్తున్న వైనం కూడా చూస్తున్నాం. వీటిని తిలకించడానికి టూరిజాన్ని (పర్యాటక రంగం) ప్రోత్సహిస్తున్నారు. విదేశీ పర్యటకుల నుండి డాలర్లు దండుకోవడానికి పోటీ పడుతున్నారు. సువిశాలమైన ప్రాంతాల్లోని అడవులను నాశనం చేస్తూ భారీ ప్రాజెక్టుల నిర్మాణాన్ని (డాంల నిర్మాణం) కొనసాగిస్తున్నారు. వీటి ఫలితంగా దేశంలో లక్షలాది మంది ఆదివాసులు నిరాశ్రయులయ్యారు. ఇవన్నీ అభివృద్ధి పేరుతోనే జరిగాయి. జరుగుతున్నాయి. అయితే ఈ అభివృద్ధి ఏ వర్గాలకు ఉపయోగపడుతుంది? అనేది కీలకమైన ప్రశ్న. దేశ జనాభాలోని అత్యల్ప సంఖ్యాకులైన పాలకవర్గాలకు మాత్రమే ఈ అభివృద్ధి ఉపయోగపడుతుంది. కోట్లాది ప్రజల వినాశనంతో ఆ అభివృద్ధి జరిగిపోతోంది. దీన్ని అడ్డుకోవడం ద్వారానే నిజమైన అభివృద్ధికి అవకాశాలు ఏర్పడుతాయి. ఆ క్రమం దండకారణ్యంలో ప్రారంభమై గత రెండు దశాబ్దాలుగా సంఘర్షిస్తోంది. ప్రజాస్వామ్యం ముసుగులో ప్రభుత్వం కొనసాగిస్తున్న దారుణమైన ఫాసిస్టు హింసాకాండతో అది తలపడుతోంది. వీటి అణచివేత కోసం అంతర్జాతీయ ద్రవ్య సంస్థల నుండి పెద్ద ఎత్తున ప్రభుత్వాలు అప్పులు తీసుకువస్తున్నాయి. వారు విధించే షరతులన్నింటినీ ఆమోదిస్తున్నాయి. ఇకపోతే ఆచరణలో పనులలో జరిగే అక్రమాలు, అవినీతి సరేసరి. వర్తమానంలోని మరో పార్శ్వం ఇదీ. ఇది జరుగుతున్న చరిత్ర. ఇక్కడ దీని వివరాలలోకి వెళదాం.

దండకారణ్యంలో ఒకవైపు మహారాష్ట్ర, మరోవైపు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల అటవీశాఖ వారు చాలా గ్రామాలలో వన సంరక్షణ సమితి (విఎస్ఎస్)లు ఏర్పర్చుకున్నారు. గ్రామాలలో తమ ఆధిపత్యాన్ని కోల్పోయినవారు, లంపెన్‌లు, పోలీసుల ఒత్తిళ్లకు లొంగి వారు చెప్పినట్టుగా నడచుకుంటున్న శక్తులు వీటిల్లో చేరుతున్నారు. అడవులపై అధికారంలో ప్రజల భాగస్వామ్యం అంటూ ప్రభుత్వం ఇస్తున్న నినాదాలందుకొని విఎస్ఎస్‌లలోని శక్తులు ముఖ్యంగా గ్రామాల్లో అధికారాన్ని కోల్పోయిన శక్తులు తిరిగి తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి ఇందులో చేరి ప్రయత్నిస్తున్నాయి. అటవీశాఖ వారితో కలిసి వీరు గ్రామాల్లో ప్రభుత్వ పనులన్నింటినీ ముందుండి నడిపిస్తున్నారు. వారి అవినీతి, అక్రమాలలో వీరు కూడా ఎప్పటి లాగే భాగస్తులవుతున్నారు. గడ్చిరోలి డివిజన్‌లో గత మే-జూన్ నెలలలో అటవీశాఖ వారు కొనసాగించిన పనులలో చాలా మేరకు ఇలా జరిగినవే.

గత సంవత్సరం దేశంలోని అనేక రాష్ట్రాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నట్టే మహారాష్ట్ర కూడా కరువు వాత పడింది. రాష్ట్రంలోని 300కు పైగా తాలూకాల్లోని లక్షలాది ప్రజలు కరువు పరిస్థితులలో తల్లడిల్లిపోయారు. ముఖ్యంగా ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన ఆదివాసులు ఆ దుర్భిక్ష పరిస్థితులను తమదైన జీవన శైలితో ఎదుర్కొన్నారు. గోదాముల్లో మురిగిపోతున్న ధాన్యంలో నుండి కొంత తీసి కేంద్రం రాష్ట్రాలకు అందజేయగా అందులో నుండి ఎవరి వాటాలు వారు తమ స్థాయి-హోదాలననుసరించి పంచుకోగా మిగిలినవి పనికి ఆహార పథకంగా గ్రామాలకు చేరాయి. వీటితో చేపట్టిన పనులలో అడవి చుట్టూ తవ్వించిన కందకాలున్నాయి. గతంలోనే ఇలాంటి కందకాలను తవ్వడాన్ని గడ్చిరోలిలో ప్రజలు వ్యతిరేకించారు. అయినప్పటికీ, తిరిగి అటవీశాఖ వారు పోలీసు నిర్బంధాన్ని ఆసరా చేసుకొని ప్రస్తుతం అవే పనులు చేపట్టారు. దాదాపు ఒక మీటరు లోతుతో, అర మీటరు వెడల్పుతో ఉండే పొడవైన కందకాలు తవ్వించారు. ఇవి తవ్వడం ద్వారా అడవిలోకి ఎడ్లబండ్లు తేవడం నిలిచిపోతుందని అధికారులు సెలవిచ్చారు. ఇవన్నీ వర్షాకాలం రావడంతో నీళ్లతో నిండిపోయాయి. గొడ్లగాసే పిల్లలు, లేగదూడలు లేదా గమనించకుండా వెళ్లిన వాళ్లెవరైనా అందులో పడిపోయే అవకాశాలుండి ప్రమాదకరంగా తయారైనాయి. కాగా, ఎడ్లబండ్లలో కర్రలు చేరవేయాలనుకునే వారిని మాత్రం ఈ బొందలు ఎంత మాత్రం నిరోధించలేవన్నది తేలిపోయింది. అయితే ప్రభుత్వం పని కట్టుకొని నిస్తార్ కూపుల చుట్టూ (ప్రజల అవసరాల కోసం కేటాయించినట్టుగా చెప్పబడే అడవి) ఎందుకని బొందలు తవ్వించినట్టు? అన్ని విషయాన్ని తెల్సుకోవాలంటే ముందు కీన్స్ మహాశయున్ని ఓసారి గుర్తు చేసుకోవాలి.

కీన్స్ 18వ శతాబ్దానికి చెందిన బూర్జువా అర్థ శాస్త్రజ్ఞుడు. బ్రిటన్ దేశానికి చెందిన వాడు. పెట్టుబడిదారీ దుష్పరిణామాల్లో భాగమైన నిరుద్యోగ సమస్యను నివారించడానికి ప్రభుత్వాలు ప్రజలకు (ఉపాధి) పనులు కల్పించవలసి ఉంటుందని చెప్పాడు. అప్పులు చేసైనా, అధిక నోట్లు ముద్రించైనా ఉపాధి కల్పించడం ప్రభుత్వ బాధ్యత అవుతుందన్నాడు. అందులో బొందలు తవ్వించడం కూడా ఒక పనే అన్నాడు. ఆ విధంగా పనులు కల్పించడం ద్వారా ప్రజలకు కొంత ఉపశమనం ఉంటుందనీ, పాలకవర్గాలు నిరాటంకంగా తమ దోపిడీని కొనసాగించకోవచ్చనీ మహా తెలివిగా సెలవిచ్చాడు. నేడు ప్రధానమంత్రి రోజగార్ యోజన, ఎంప్లాయిమెంట్ గ్యారంటీ స్కీం, పనికి ఆహార పథకం, నిరుద్యోగ భృతి లాంటి ఏ పేరుతో గ్రామీణ ప్రాంతంలో పనులు చేపడుతున్నా సారాంశంలో అవి కీన్స్ ఉపదేశాల అనుసారమే వ్యవహరిస్తున్నాయనుకోవాలి. ఇలాంటి అడ్డమైన పనుల ద్వారానే అయినా ఏ ఊళ్లో ఎంత మందికి ఏడాదిలో ఎన్ని పని దినాలు కల్పించబడినాయో అధికారులు తమ గొప్పతనానికి నిదర్శనంగా పత్రికల ద్వారా చాటుకోవడం ఒక ఆనవాయితీగా మారింది.

ఈ కందకాల ద్వారా ఏ మాత్రం ఉపయోగం లేదనీ, అవి వద్దంటూ ప్రజలు చెప్పినా వినకుండా అటవీశాఖ వారు తవ్వించడంతో వారి మూర్ఖత్వం బయటపడింది. ఇలా కందకాల తవ్వకం ద్వారా అడవి రక్షించబడుతుందన్న వారి మాటల్లోని వాస్తవమెంతో పూటకు పూట తరిగిపోతున్న అడవుల వైనమే తెలియజేస్తుంది. కరువు వాత పడిన ప్రజలకు పనులు కల్పించే పేరుతో కీన్స్ సెలవిచ్చినట్టూ, అంతర్జాతీయ ద్రవ్యసంస్థల ఆదేశాల మేరకూ కందకాలు తవ్వించి మానవశ్రమను ప్రజా వ్యతిరేక చర్యల కోసం వృధా చేయడం దోపిడీ పాలకవర్గాలకే చెల్లుతుందని జనం నిరసిస్తున్నారు. దేశాల మధ్యా, ప్రాంతాల మధ్యా ఏర్పర్చుకున్న కృత్రిమ సరిహద్దులను ముళ్లకంచెలు, కందకాలు, రోడ్లు, గోడల నిర్మాణం (చైనాలో విముక్తి ప్రాంతాల విస్తరణను అడ్డుకోవడానికి చాంగ్ కై-షేక్ యుద్ధ చర్యల్లో భాగంగా గోడలు నిర్మించగా, కమ్యూనిజం విస్తరణను అడ్డుకోవడానికి తూర్పు, పశ్చిమ జర్మనీల మధ్య సామ్రాజ్యవాదులు గోడ నిర్మించగా, ఇపుడు పాలస్తీనా దాడులను అరికట్టడానికి అమెరికా కనుసన్నలలో ఫాసిస్టు ఇజ్రాయెల్ పరమ దుర్మార్గంగా ముళ్లకంచె నిర్మిస్తున్నది) కాపాడలేవనీ, కందకాలు అడవుల నిర్మూలనను అరికట్టలేవనీ, తుమ్మముండ్లు అడవుల్లో జన సంచారాన్ని ఆపలేవనీ, ఇలాంటివన్నీ ప్రజా వ్యతిరేక అణచివేత చర్యలేననీ, అప్రజాస్వామికమనీ, ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులివేవీ గావనీ పదే పదే నిరూపించబడుతూ వస్తోంది. ఈ నేపథ్యంలోనే అడవులను రక్షించుకోవడానికి దండకారణ్యంలోని కొన్ని ప్రాంతాల్లోని ప్రజలు చేపట్టిన ఒక ప్రత్యామ్నాయాన్ని కూడా ఇక్కడ చూద్దాం. అయితే ముందు కొంత బూర్జువాల అభివృద్ధిలోని నిజాలను సంక్షిప్తంగా చూద్దాం.

## అడవుల పరిరక్షణకు అంతర్జాతీయ ద్రవ్యసంస్థలు ఎందుకింత ఆరాటపడుతున్నాయి?

మన దేశంలోని అడవులు ఏటేటా హరించుకుపోతున్నాయని, వీటిని కాపాడాలని అంతర్జాతీయ ద్రవ్య సంస్థలు పదే పదే హెచ్చరిస్తున్నాయి. ఉదారవాద పర్యావరణవాదులను ప్రోత్సహిస్తున్నాయి. అడవుల పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థల రూపంలో అనేక సంస్థలను సృష్టిస్తున్నాయి. నూతన ఆలోచనల పేరుతో పదాడంబరాలతో ఇక్కడి ప్రభుత్వాలను నిర్దేశిస్తూ నానా రకాల సంస్థలను ఉనికిలోకి తెస్తున్నాయి. వన సంరక్షణ సమితులు, కమ్యూనిటీ మేనేజ్‌మెంట్, ప్రజల భాగస్వామ్యం లాంటి భాషా ప్రయోగాలతో ప్రజలను ఎందుకు పక్కదార్లు పట్టిస్తున్నాయో చూడాలి. ఈ దేశంలోని అడవులను రక్షించడానికి అంతర్జాతీయ ద్రవ్యసంస్థలు వేల కోట్ల రూపాయలను అప్పుగా ఇక్కడి ప్రభుత్వాలను సమకూర్చడంలోని రహస్య ఒప్పందాలేమిటో అర్థం చేసుకోవాలి.

ఈ దేశంలోని 10 కోట్లకు పైగా ఆదివాసుల జన్మస్థలాలైన అడవులు, కొండలు నేటికీ ఎంత తరిగిపోయినా ఇంకా తమ ఉనికిని కలిగే ఉన్నాయి. పెద్ద పెద్ద డ్యాంలు, ప్రాజెక్టులతో విశాల అటవీ ప్రాంతాలు నీట మునిగినా మిగిలిన అడవి తక్కువేమీ లేదు. వీటిని తరలించుకుపోవడానికి నిరంతరం సామ్రాజ్యవాదులు కుట్రలు చేస్తూనే ఉన్నారు. వెనుకబడిన దేశాలను కొల్లగొట్టి తమ ప్రయోజనాలను నెరవేర్చుకునే సామ్రాజ్యవాల దోపిడీ కండ్లు ఈ దేశ అడవుల నుండి మళ్లడం లేదు. ప్రజల చైతన్యం పెరుగుతున్నందున భావాన్ని మరుగున పరుస్తూ భాషను మారుస్తూ చేస్తున్న ప్రయోగాలే ఇవన్నీనూ. అడవులను తరలించుకపోవడంతో పాటు అడవుల్లో నేటికీ నిక్షిప్తమై ఉన్న రకరకాల అపారమైన విలువ గల గనులను, ఖనిజాలను సొమ్ము చేసుకోవడానికే వారు ప్రపంచీకరణలో భాగంగా ఎడతెగని కుట్రలు చేస్తున్నారు. వారు కోరుకుంటున్న అభివృద్ధి ఇది. ప్రజామోదంతో, ప్రజల భాగస్వామ్యంతో అత్యంత ప్రజాస్వామ్యంగా ఇదంతా జరిగిపోతుందని ప్రపంచ ప్రజలను మోసగించడానికి, న్యాయబద్ధత కల్పించుకోవడానికి చేస్తున్న కసరత్తులే ఇవన్నీ. సుప్రీంకోర్టు తీర్పు ఇందులో భాగమే. ఇక్కడి ప్రజలను బేదఖలు చేయకుండా, పంటపొలాలను నాశనం చేయకుండా గనులను తవ్వుకోలేరు. ఖనిజాలను తరలించుకుపోలేరు. వీటిని గ్రహించకుండా ప్రజలను చైతన్యపర్చలేము. ప్రజలను నిష్క్రియాపరులను చేసి, వారిని స్తబ్ధులుగా మార్చి, వారిలో రియాక్షనరీ భావాలను నాటి పోషించడం నుండి వారిని బయటపడేయనికి వాస్తవాలను వారి ముందుంచడం ఒక అనివార్యమైన షరతు. ఈ దేశంలోని నిజమైన ప్రజాస్వామికవాదుల, పర్యావరణవాదుల, ప్రజల మంచి కోరే వారందరి బాధ్యత ఇది.

విశాల దండకారణ్యంలోని గడ్చిరోలిలో అటవీశాఖ వారి కందకాల వైనం ముందుకు రాగా, బస్తర్‌లో ప్రజలు తమ సొంత బాధ్యతగా అడవిని రక్షించుకుంటున్న తీరు అందుకు పూర్తిగా భిన్నంగా ఉంది. ప్రభుత్వ అటవీశాఖ వారు తమకు అనుకూలంగా అడవిని కూపులుగా విభజించి దానిని ప్రణాళికాబద్ధంగా దోచుకుంటున్నారు. విభజన రేఖలుగా కూపుల మధ్య సరిహద్దు లైన్‌లు ఏర్పర్చారు. వీటితో ప్రజలకు పని లేదు. ఇందులో ప్రజాభిప్రాయం లేదు. కానీ అడవిలోని గ్రామాల ప్రజలకు అనాదిగా ఎవరి పొలిమేరలు వారికి ఉన్నాయి. ఇవే తరతరాలుగా వారు పాటిస్తూ వస్తున్న సరిహద్దులు. ఈ అడవిపై ఆధారపడే వారి గృహ, వ్యవసాయ మొదలైన అవసరాలు తీర్చుకుంటారు. ఏటా జరుపుకుంటారు. ప్రభుత్వ చట్టాల్లో అడవులు బంధించబడినప్పటికీ పిడిపిడీలుగా ప్రజలు పాటిస్తూ వస్తున్న సాంప్రదాయ సరిహద్దులు చెరిగిపోలేదు. గత రెండు దశాబ్దాల విప్లవోద్యమం ఫలితంగా తిరిగి అవి జీవం పోసుకుంటున్నాయి. ప్రజలు అడవులను రక్షించుకోవడానికి స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. దోపిడీ ప్రభుత్వ అటవీశాఖ వారు విచక్షణారహితంగా అడవులను నరికివేయడాన్ని ప్రజలు మొదట నిషేధించారు. అటవీశాఖ ఉద్యోగులెవరూ అడవుల రక్షణ కోసం అడవిలో సంచరించాల్సిన పని లేదని స్పష్టం చేయడంతో గత కొద్ది సంవత్సరాలుగా వీరి జాడ లేకుండా పోయింది. గాలికి పడిపోయిన చెట్లు (windfall) కూడా తీసుకెళ్లాల్సిన అవసరం లేదని సర్కార్ వారికి ఖచ్చితంగా తెలిపారు. దీనితో ప్రభుత్వం వారి విచక్షణారహితమైన అడవుల నిర్మూలన మొదట అరికట్టబడింది. అడవుల నిర్మూలనలో ఇదే సింహభాగాన్నాక్రమిస్తోంది. పోతే, ప్రజలు తమ సాగుభూముల అవసరాల కోసం నూతనంగా అడవులను నరకడం మానుకోవాలని విప్లవ ప్రజా కమిటీలు (ప్రస్తుతం ప్రజా రాజ్యాధికార సంస్థలను ఇలా వ్యవహరిస్తున్నారు) ప్రజలకు విజ్ఞప్తి చేశాయి. విప్లవకర భూసంస్కరణలను అమలు చేయడంలో బాగంగా మిగులు భూములను గ్రామంలోని పేద రైతులకు, వ్యవసాయ కూలీలకు కేటాయిస్తూ వారి అవసరాలను తీరుస్తున్నాయి. దీనితో, సాగుభూముల కోసం అడవులను నరకడం క్రమంగా విప్లవ ప్రజా కమిటీలు ఏర్పడి పనిచేస్తున్న చోట నిలిపివేయబడింది. ప్రజలు తాము ఎన్నుకున్న జంగల్ బచావో కమిటీని (అటవీ రక్షణ కమిటీ) సంప్రదించి పొయిలకర్రలు, ఇంటికి అవసరమయ్యే వాసాలు, దూలాలు, వ్యవసాయ పనిముట్లకు కావల్సిన కర్రలను అడవి నుండి తెచ్చుకుంటున్నారు. అవసరాలు తీర్చుకుంటున్నారు. ఖాకీల కళ్లల్లో పడకుండా, కడు జాగ్రత్తగా,

*(తరువాయి 12వ పేజీలో .....)*

# అమెరికా చెప్పే 'రోడ్డు మ్యాపు'

# యూదు దురహంకారుల నిర్బంధాన్ని 'పాలస్తీనా రాజ్యం' చేతిలోకి మార్చే కుట్రే!

దశాబ్దాలుగా పశ్చిమాసియా రావణకాష్టంలా మండుతూనే వుంది. సామ్రాజ్యవాదం తన స్వార్థ ప్రయోజనాల కోసం పశ్చిమాసియాలో రాజేసిన నిప్పు పాలస్తీనా జాతినీ, భూభాగాన్నీ దహించివేస్తుంటే దానికి నేడు అమెరికా అగ్రరాజ్యం ఆజ్యం పోస్తూ పశ్చిమాసియాపై తన పట్టును నిలబెట్టుకోవాలని ప్రయత్నిస్తున్నది. ఒక జాతి భూభాగాన్ని కబళించి అక్కడికి మరొక జాతి ప్రజలను తరలించి ఒక లేని దేశాన్ని సృష్టించడమూ, దాన్ని పశ్చిమాసియాలో సూపర్ పవర్‌గా పెంచి పోషించడమూ సామ్రాజ్యవాదుల కుటిల నీతిలో భాగమే. దాని ఫలితమే ఇజ్రాయిల్ సృష్టి. అగ్రరాజ్యాల అండతో ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న దురాక్రమణ యుద్ధాల వల్ల పశ్చిమాసియా ప్రాంతం రక్తసిక్తమవుతూనే వుంది. ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న దురాక్రమణ యుద్ధంలో పాలస్తీనా ప్రజలు తమ స్వంత భూభాగాన్ని, మాతృదేశాన్ని కోల్పోయి శరణార్థులుగా ఇరుగు పొరుగు దేశాలకు తరలిపోయారు. పాలస్తీనా భూభాగం మొత్తాన్ని కాన్‌సంట్రేషన్ క్యాంపులుగా మార్చివేసి ఇజ్రాయిల్ యూదు దురహంకారులు కొనసాగిస్తున్న పాశవిక హత్యాకాండ నాటి నాజీ దురాగతాలను తలదన్నుతోంది.




పుట్టి పెరిగిన నేల మీదే శరణార్థులుగా దుర్భర జీవితాన్ని గడుపుతున్న పాలస్తీనియులు తమ స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం 2000 సెప్టెంబరులో మరో ఇంతిఫదాకు పిలుపునిచ్చారు. తమ భూభాగాన్ని యుద్ధరంగంగా తమనే ఆయుధాలుగా మార్చుకుని ఇజ్రాయిల్ దురాగతాలను, దురాక్రమణను తీవ్రంగా ప్రతిఘటిస్తున్నారు. గత యాభై ఏళ్లలో అనేక శాంతి ఒప్పందాలు జరిగాయి, కానీ అవన్నీ యూదు దురహంకారులు పాల్పడ్డ విచ్చలవిడి హత్యాకాండలతోనే చెల్లిపోయాయి. గత ఏప్రిల్ ఆఖరులో అమెరికా రోడ్డు మ్యాప్ పేరుతో ఒక కొత్త 'శాంతి' పథకాన్ని ముందుకు తెచ్చింది. ఇది కూడా మిగతా అన్ని 'పథకాల' లాగే పురిట్లోనే సంధి కొట్టింది. అసలు ఈ రోడ్డు మ్యాప్ పథకం ఏం చెబుతుంది, ఈ పథకానికి పాలస్తీనియుల చిరకాల వాంఛయైన స్వాతంత్ర్యాన్ని ప్రసాదించే ఉద్దేశ్యం ఏదైనా ఉందాననే విషయాలను పరిశీలిద్దాం.

## ఒప్పందాల ముసుగున సాగుతూ వచ్చిన విద్రోహం

టెర్రరిస్టు ఇజ్రాయిల్ రాజ్యం కనుసన్నల్లో 'పాలస్తీనా రాజ్యం' ఏర్పాటు గతంలో చాలా సార్లు వాయిదా పడింది. 1993 ఇజ్రాయిల్-పాలస్తీనా ఒప్పందానికి (ఓస్లో ఒప్పందానికి) దారితీసిన అంశాలలో ఇజ్రాయిలీ అధికారాలు కొన్నింటిని పాలస్తీనా అథారిటీ కిందకు మార్చే ప్రతిపాదనలు కూడా ఉన్నాయి. ఈ పాలస్తీనా అథారిటీయే చివరకు 'పాలస్తీనా రాజ్యం'గా మారుతుంది. దీనిని స్వతంత్ర రాజ్యంగా వ్యవహరించినప్పటికీ అది పూర్తిగా ఇజ్రాయిలీ యూదు జాత్యహంకారుల దయాదాక్షిణ్యాలపైన్నే ఆధారపడి ఉంటుంది. మునుపటి రోడ్డు మ్యాప్ కూడా పాలస్తీనాకు రాజ్య ప్రతిపత్తినివ్వాలని చెప్పినదే. అయితే పాలస్తీనీయుల ప్రజాస్వామ్యం చుట్టూరా అల్లిన బూటకత్వపు తెరల మూలంగా ఈ రోడ్లపై ప్రయాణీకులు పలు మార్లు చతికిలబడాల్సి వచ్చింది. ఈ దారిలో ప్రధాన అడ్డంకిగా నిలిచింది పాలస్తీనా ప్రతిఘటనోద్యమమే. అది ఇలాంటి నక్కజిత్తుల 'శాంతి' ఎత్తుగడల ఉచ్చులో పడ నిరాకరించింది. యాసర్ అరాఫత్ వంటి వాళ్లు మాత్రం సిగ్గూ ఎగ్గూ వదిలేసి అమెరికా ముందు సాగిలబడి పాలస్తీనా ప్రజల క్రోధాన్ని అదుపు చేయడానికి విఫల ప్రయత్నం చేస్తున్నారు. పాలస్తీనీయులు తమ స్వంత నాయకత్వం చేతిలో ద్రోహానికి గురయ్యారు. తమ పట్ల ఇజ్రాయిల్ అనుసరిస్తున్న ఫాసిస్టు పద్ధతులను వాళ్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇజ్రాయిలీ సైన్యం జరుపుతున్న దాడులను పాలస్తీనా ప్రజలు ఈ అన్ని సంవత్సరాలలోనూ ధైర్యంగా ఎదుర్కొంటూ వచ్చారు. వేలాది మంది అత్యున్నత త్యాగాలు చేశారు. శాంతి రోడ్డు మ్యాప్‌గా పిలిచే పథకాలన్నీ తుత్తునియలయ్యాయి. ప్రతీదీ ఇజ్రాయిలీల మరిన్ని అత్యాచారాలకూ, జవాబుగా పాలస్తీనీయుల మరింత గట్టి ప్రతిఘటనకూ దారి తీసింది. చివరకు 2000లో 'ఇంతిఫద' అని పిలిచే ఒక గొప్ప నిరసనోద్యమం, ఒక గొప్ప విప్లవోద్యమం తలెత్తింది. గత మూడేళ్లుగా అది కొనసాగుతున్నది. ఈ ఉద్యమాన్ని అణచడానికి ఇజ్రాయిలీలు చేస్తున్న హంతక దాడుల్లో రెండున్నర వేలకు పైగా పాలస్తీనీయులు తమ ప్రాణాలు కోల్పోగా, పదుల వేల మంది గాయపడడమో లేక అంగవికలురవడమో జరిగింది. వేల సంఖ్యలో పాలస్తీనీయుల ఇండ్లు విధ్వంసానికి గురయ్యాయి. లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు.

1993లో హామీ ఇచ్చిన 'శాంతి' దశాబ్దాన్ని (ఇది హత్యలతోనూ, వినాశనంతోనూ, విధ్వంసంతోనూ కూడినది) నెలకొల్పే పేరిట సామ్రాజ్యవాద జియోనిస్టు (*జియోనిజం అంటే యూదు జాత్యహంకారం అని అర్థం*) కూటమి పాలస్తీయుల ద్వారానే పాలస్తీనీయులపై భీభత్సాన్ని అమలు చేయాలని కోరుకున్నదన్న విషయం తెలికగానే బోధపడింది. అమెరికా, ఇజ్రాయిల్‌లు పాలస్తీనా ప్రజలపై భీభత్సకాండను అమలు చేయడంలో అరాఫత్ తమకు పూర్తిగా సహకరించాలనీ, తిరగబడే ప్రజలను అదుపు

చేసి తమకు నిజమైన తొత్తుగా తన సమర్థతను రుజువు చేసుకోవాలనీ పదే పదే వత్తిడి చేశాయి. ఈ పనిలో సఫలమైతేనే పాలస్తీనాకు రాజ్య ప్రతిపత్తినిస్తామని అతనికి హామీ ఇచ్చాయి. కానీ అతను శక్తివంచన లేకుండా ప్రయత్నించినప్పటికీ కూడా ఒక సమర్థుడైన పోలీసుగా తన బాధ్యతను నిర్వర్తించడంలో విఫలమయ్యాడు. ఎందుకంటే ఇజ్రాయిల్ రాజ్య భీభత్సకాండకు వ్యతిరేకంగా పాలస్తీనీయుల ప్రతిఘటనా శక్తి అంత గొప్పది. ప్రజల్లో తన పలుకుబడిని కాపాడుకోవడానికి ఆయన తరచుగా ఇజ్రాయిలీ అత్యాచారాలకు వ్యతిరేకంగా పాలస్తీనీయుల పక్షం వహించాడు. ఇజ్రాయిల్ అనుసరిస్తున్న హింసాత్మక ఎత్తుగడల వల్ల తన పనిని నిర్వహించడం కష్టమవుతోందని ఆయన నిరసన తెలిపాడు. అతని అల్ ఫతహ్ గ్రూపు ఇజ్రాయిలీ సైన్య యంత్రాంగం ఊపిరి సలపనివ్వకుండా జరుపుతున్న దాడులను ఎదుర్కోవడానికి తప్పనిసరై అల్ అక్సా బ్రిగేడ్‌ను ప్రారంభించింది. ఇజ్రాయిలీల అత్యాచారాలు పాలస్తీనా ప్రజల్ని ఎంతగా రెచ్చగొట్టాయంటే, ఎంతగా మేల్కొలిపాయంటే అతడు ఈ పరిస్థితిని శాంతింపజేయలేకపోయాడు. పాలస్తీనా పోరాటకారుల్ని అదుపు చేయాలని అమెరికన్ సామ్రాజ్యవాదులు అరాఫత్‌ను పదే పదే కోరినప్పటికీ అతని వల్ల కాలేదు. వాళ్ల ఆదేశాలపై అతను చాలా మంది మిలిటెంట్లను అరెస్టు చేసి ఇజ్రాయిల్‌కు అప్పజెప్పాడు. తమ ఆంతరంగిక రక్షణ వ్యవహారాల్లోనూ, శాంతిభద్రతల నిర్వహణలోనూ సిఐఏ జోక్యానికి ఒప్పుకున్నాడు. అమెరికా ఆదేశాల ప్రకారం ప్రభుత్వపరమైన సంస్కరణలను అమలు చేశాడు. రాజ్యాంగయంత్రాన్ని పునర్వ్యవస్థీకరించాడు. ఆఖరున అమెరికా కీలుబొమ్మయిన మహ్మూద్ అబ్బాస్‌ను ప్రధానమంత్రిగా నియమించడానికి కూడా అంగీకరించాడు. ఈ చివరి డిమాండ్‌ను నెరవేర్చడం ద్వారా ఆయన తన పాడెను తానే సిద్ధం చేసుకున్నాడు. అమెరికా సామ్రాజ్యవాదుల ఆదేశాలను అమలు చేయడం కోసం శక్తివంచన లేకుండా కృషి చేసిన మనిషే వాళ్ల దృష్టిలో ఇప్పుడు తగినంత తొత్తుగా వ్యవహరించని వ్యక్తిగా మారడం విచిత్రంగా అనిపిస్తుంది. అతను తిరిగి విశ్వాసాన్ని పొందలేకపోయాడు. పైగా ఏరికోరిన ప్రధానమంత్రిగా బాధ్యత చేపట్టిన అబ్బాస్ అతన్ని పక్కకు నెట్టసాగాడు.

## దిగ్బంధంలో అరాఫత్

అరాఫత్ పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుక చందంగా తయారైంది. ఓ వైపు అతడు పాలస్తీనా ఉద్యమానికి ద్రోహం చేసి అమెరికా ఆదేశాలన్నిటికీ తలొగ్గుతూనే, మరో వైపు పాలస్తీనా ప్రజలను తన వెంట నిలబెట్టుకోవడానికి నిరాశాపూరిత ప్రయత్నాలు చేస్తున్నాడు. రెండు పరస్పర విరుద్ధమైన శిబిరాలకూ, శక్తులకూ మధ్య, అంటే పీడకులకూ, పీడితులకూ మధ్య సయోధ్య కుదర్చాలని వెర్రిగా విఫల ప్రయత్నం చేస్తున్నాడు.

ఆత్మాహుతి బాంబుదాడులకు ఇంతిఫద బాగా ఊపునిచ్చింది. పాలస్తీనీయుల ఆత్మాహుతి దాడులతో జియోనిస్టులకు వెన్ను జ్వరం పుట్టింది. అమాయక పాలస్తీనీయుల ప్రాణాలను లెక్కలేకుండా, నిరంతరాయంగా కాల్చిచంపే హంతక ఇజ్రాయిలీ బలగాలకు ఈ బాంబు దాడులు ఒక అనివార్యమైన జవాబు. పాలస్తీనా ప్రజల శత్రువులు (చాలా అరబ్ ప్రభుత్వాలు కూడా) బాంబు దాడుల్నీ, అన్ని రూపాల ప్రతిఘటననూ నిలిపివేయాల్సిందిగా అరాఫత్‌ను కోరారు. 1967 తర్వాతి భూములపై ఇజ్రాయిల్ తన ఆక్రమణను కొనసాగించినంత కాలం, పాలస్తీనా భూభాగంలోని సెటిల్‌మెంట్లను ఖాళీ చేయనంత కాలం, నిర్వాసితులైన నలభైయ్యైదు లక్షల పాలస్తీనా శరణార్థులను తమ గ్రామాలలో స్థిరపడనివ్వనంత కాలం తాను ఈ ప్రతిఘటనా ఉద్యమాన్ని ఆపడం అసాధ్యమని అరాఫత్ వాదించాడు. దీని అర్థం "పాలస్తీనా భూభాగాల"లో ఇజ్రాయిలీలు తమ జోక్యాన్ని పూర్తిగా వదులుకొని "పాలస్తీనా రాజ్యం" ఏర్పాటుకు దారి సుగమం చేయాలని. అది చాలా పరిమితమైనదే అయినప్పటికీ మొదట స్థాపన జరగడం ద్వారా తర్వాత రెండు రాజ్యాల సహజీవనం సాధ్యమవుతుందని అతని వాదన.

కానీ పాలస్తీనా అథారిటీ మొదట పోలీసు బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించాలనీ, ఆ తర్వాతనే తన అధికారాల గురించి మాట్లాడాలనీ షెరోనూ, అతనికంటే ముందువాళ్లూ అందరూ పట్టుబట్టారు. ఇజ్రాయిల్ ఐరాస తీర్మానాలన్నిటినీ ధిక్కరిస్తూ వచ్చింది. ఈ భూములను బేషరతుగా ఖాళీ చేయడానికి ఎన్నడూ ఒప్పుకోలేదు. ఐరాస మాట వినడానికి ఇరాక్ వంటి పేద, బలహీన దేశం కాదు గదా అది! అలాగే అది పశ్చిమాసియాలో అభివృద్ధినిరోధకత్వానికి బలమైన కోట కనుక అంతర్జాతీయ సంస్థ మాటనూ, ప్రపంచ సమాజపు మాటనూ వినేలా అమెరికా దాన్ని ఎందుకు వత్తిడి చేస్తుంది? యజమానే స్వయంగా బందిపోటు అయినప్పుడు అతగాడి పెంపుడు కుక్కకు అంతకంటే నీల్గుడు ఉండడం సహజమే కదా! అందువల్లే అరాఫత్ నాయకత్వంలోని పాలస్తీనా అథారిటీ సామ్రాజ్యవాదుల, జియోనిస్టుల డిమాండ్లన్నీ నెరవేర్చలేకపోయింది. అమెరికా, ఇజ్రాయిల్‌ల కోర్కెలకూ, ప్రయోజనాలకూ అనుగుణంగా పని చేయడంలో పాలస్తీనా అథారిటీ విఫలమైంది. వాళ్లు అసమర్థులైన పోలీసులుగా రుజువయ్యారు. మరోవైపు అమెరికా మాత్రం ఇజ్రాయిల్ అనుసరిస్తున్న పీడక, భీభత్స దాడులన్నిటినీ సమర్థిస్తూ అది మరింత ఉన్మాదిగా మారేందుకు గాను మరిన్ని బిలియన్ల డాలర్లు అందజేస్తున్నది.

గత మూడు సంవత్సరాలుగా గాజాపట్టీ, వెస్ట్‌బ్యాంక్‌లలోని పాలస్తీనా అథారిటీ 'పట్టు'లో ఉన్న పట్టణాలూ, నగరాలన్నిటినీ ఇజ్రాయిలీలు దిగ్బంధించారు. అధ్యక్షుడైన యాసర్ అరాఫత్‌ను తన ప్రధాన కార్యాలయంలోనే బంధీని గావించి విదేశీ ప్రముఖులతో కలవకుండా, తన నివాసం నుండి బైటకు ఎటూ వెళ్లకుండా కట్టడి చేశారు. పాలస్తీనా ప్రతిఘటనను అణచివెయ్యడం కోసం మిస్సైళ్లనూ, హెలికాప్టర్లనూ, గన్‌షిప్స్‌నూ, ట్యాంకులనూ, జెట్ ఫైటర్లనూ, బుల్‌డోజర్లనూ, ఆర్థిక దిగ్బంధాన్నీ చాలా తరచుగా ఉపయోగించారు. అరాఫత్‌ను 1982లోనే చంపనందుకు షెరోన్ బాహాటంగా విచారాన్ని వెలిబుచ్చడమే కాదు, అతనిని తన దేశం నుండి బహిష్కరిస్తానని హెచ్చరిక కూడా చేశాడు. అరాఫత్‌తో అమెరికా గానీ, ఇజ్రాయిల్ గానీ ఎలాంటి వ్యవహారాలు నడపనవసరం లేదని చెప్పి ఇజ్రాయిలీలు అతన్ని బహిష్కృతుడిగా ప్రకటించారు. తమ నాయకత్వాన్ని మార్చమని పాలస్తీనీయులకు బాహాటంగానే పిలుపునిచ్చి అరాఫత్‌కు బదులు ఇంకా బాగా లొంగుబాటును ప్రదర్శించే వ్యక్తిని ఎన్నుకోమని కోరారు. అంటే పాలస్తీనీయులకు ఇది "ప్రభుత్వ మార్పు" అన్న మాట. ఆఖరున తమ తొత్తు అబ్బాస్‌ను 'పాలస్తీనా'కు ప్రధానమంత్రిగా నియమించడంలో సఫలమయ్యారు. దీనికి పాలస్తీనా పార్లమెంటు ఆమోదం కూడా లభించింది. ఇప్పుడిక 'పాలస్తీనా' 'రాష్ట్రపతి'కి రాజ్యాధినేతగా ఆచరణలో ఎలాంటి ప్రాముఖ్యతా లేకుండా పోయింది.

ఇక్కడ గమనించాల్సిన విషయమేమిటంటే పాలస్తీనా ప్రతిఘటనను కేవలం రాళ్లు రువ్వడం వరకే పరిమితం చేయాలని అరాఫత్ కోరుకున్నాడు. ఇప్పుడు అబ్బాస్ మరో అడుగు ముందుకేసి, ప్రపంచంలోనే అత్యంత

క్రూరమైన రాజ్యాలలో ఒకటైన ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా ఇంతిఫదను వెన్నెముక లేని ఉద్యమంగా దిగజారుస్తానని వాగ్దానం చేస్తున్నాడు. పాలస్తీనా యోధుల మిలిటెంట్ గ్రూపులను నిరాయుధం చేస్తానని కూడా అతడు హామీ ఇస్తున్నాడు. ఇజ్రాయిలీ జియోనిస్టులకు వ్యతిరేకంగా జరిగే పాలస్తీనీయుల ప్రతిహింసను అంతమొందించడం తన లక్ష్యంగా చెబుతూ, ఇలాంటి గ్రూపులకు "ఆర్థిక, సైనిక సహాయాన్ని" నిలిపివేయాలని వివిధ ప్రభుత్వాలకు అబ్బాస్ విజ్ఞప్తి కూడా చేశాడు. జియోనిస్టులు గానీ, సామ్రాజ్యవాదులు గానీ కోరుకునేది ఇంతకన్నా ఏముంటుంది? అబ్బాస్ లాంటి వాళ్లు పాలస్తీనీయులను అదుపులో పెడుతూ, అణచిపెడుతూ ఉంటే ఇక షెరోన్‌కు అక్కడ పనేముంటుంది? పాలస్తీనా దళారులు తమ స్వంత ప్రజలనే అణచివేసే పాత్రను పోషించడం మొదలుపెట్టాక సామ్రాజ్యవాద, జియోనిస్టు హంతకులకు అంతకన్నా కావల్సిందేముంది?! ఇటీవల జోర్డాన్‌లో జరిగిన షెరోన్, అబ్బాస్, అబ్దుల్లాల రెండో సమావేశానికి అధ్యక్షత వహించిన జార్జ్‌బుష్ బహుశా ఈ భూమండలంలోనే ఎక్కువ సంతోషించిన నేరస్తుడయ్యుంటాడు.

ఇరాక్‌పై దురాక్రమణను ప్రకటించడానికి కొద్ది రోజుల క్రితమే అమెరికా కొత్త రోడ్డు మ్యాప్‌ను ప్రకటించింది. ఇరాక్‌ను ఆక్రమించుకున్న తర్వాత పశ్చిమాసియాకు సంబంధించి బుష్ తీసుకున్న మొట్టమొదటి నిర్ణయం పాలస్తీనా-ఇజ్రాయిల్‌ల శిఖరాగ్ర సమావేశం. అమెరికా దురాక్రమణ నుండి తప్పించుకోవాలంటే దాని కోర్కెల ముందు విధేయంగా తలవంచడం తప్ప మరే మార్గం లేదని హెచ్చరించే సంకేతమే ఇది. ఇది బహుశా మరే దురాక్రమణదారైనా చేయాలని ఆశించే క్రూరమైన రాజకీయ సంకేతం. ఇరాక్‌పై అమెరికా దురాక్రమణ ఫలితమే అరబ్ ప్రపంచానికి ఈ హెచ్చరిక అని అమెరికన్లు భావిస్తున్నారు.

## కొత్త రోడ్డు మ్యాప్

ఇరాక్‌పై అమెరికా దురాక్రమణతో పాటుగానే 'పాలస్తీనా రాజ్యాని'కి కొత్త రోడ్డు మ్యాప్ ముందుకొచ్చింది. పాలస్తీనా రాజ్యం 'స్థాపన' కోసం ఈ "కొత్త" పథకం నిజానికి కొత్తదీ కాదు, దీనితో పాలస్తీనీయులకు నిజమైన స్వతంత్ర దేశం వచ్చేదీ లేదు. ఇది 1993 ఒప్పందం బాపతు పాలస్తీనాకు రాజ్యప్రతిపత్తి అంశం వంటి పాత చింతకాయ పచ్చడే. దీని ప్రకారం పాలస్తీనీయులను స్వతంత్రం కానిదీ, సార్వభౌమాధికారం లేనిదీ అయిన ప్రభుత్వం పరిపాలిస్తుంది. ఇలాంటి ప్రభుత్వం అమెరికా సామ్రాజ్యవాదుల, జియోనిస్టుల చేతిలో పాలస్తీనా ముఖం కలిగిన పనిముట్టే అవుతుంది తప్ప వేరే ఏమీ కాదు. అది పీడకుల ఆదేశాల ప్రకారమే నడుచుకుంటుంది.

"కొత్త" రోడ్డు మ్యాప్ పాలస్తీనా ప్రజలపై మరింత క్రూరమైన హింసాదౌర్జన్యాలకు దారితీస్తుంది. గత జూన్ 4న ఏరియల్ షెరోన్‌తో జరిగే సమావేశానికి వెళ్లే ముందర, అబ్బాస్ పాలస్తీనా ప్రాంతంలో ఇజ్రాయిల్ వ్యతిరేక కార్యకలాపాలన్నిటినీ అణచివేస్తానని ప్రకటించాడు. ఒక్క మాటలో చెప్పాలంటే, సామ్రాజ్యవాదుల, జియోనిస్టుల ఆదేశాలను అమలు చేయడంలో అతడు అరాఫత్‌ను మించిన రాజభక్తిని ప్రదర్శించబోతున్నాడు. అఖాబా (జోర్డాన్)లో జరిగిన సమావేశం నుండి బైటికి వస్తూ అబ్బాస్ *"ఇజ్రాయిలీలకు వ్యతిరేకంగా ఎక్కడైనా గానీ జరిగే హింసనూ, టెర్రరిజాన్నీ మేం ఖండిస్తామని మరోసారి చెబుతున్నాను"* అని ప్రకటించాడు. ఇంతిఫదను అంతం చేస్తాననీ, దాన్నొక శాంతియుతమైన, అహింసాయుతమైన ఉద్యమంగా మార్చివేస్తాననీ హామీ ఇచ్చాడు.

కాకతాళీయంగా చమురు ఉన్న ప్రతి చోటా ముస్లింలున్నారు – చమురు కోసం యుద్ధం ముస్లిం రాజ్యాలకు వ్యతిరేకంగా యుద్ధంగా పరిణమించింది. "మత యుద్ధం" అని బుష్ అనడం అనాలోచితమేమీ కాదు. మరుసటి రోజు తన మాటల్ని వెనక్కి తీసుకోవల్సి వచ్చినప్పటికీ అతడి ఉద్దేశ్యం స్పష్టమే. మధ్యాసియాలోని ముస్లింలపై ఆకస్మిక దాడులకు అఫ్ఘనిస్తాన్ యుద్ధం వీలు కల్పించింది. ఇరాక్ యుద్ధంతో మధ్యప్రాచ్యంపై మరింత ఎక్కువ అదుపుకు అమెరికన్లు ప్రయత్నిస్తున్నారు. ఇప్పుడు అబ్బాస్ లాంటి పాలస్తీనా రెనగేడ్లు ముందుకు రావడంతో అరబ్ ప్రపంచమంతటా ప్రజల విప్లవకర ఆకాంక్షలను అణచిపెట్టడం కోసం ఇక్కడి తన వ్యూహాత్మక అభివృద్ధినిరోధక దుర్గాన్ని మరింతగా పటిష్టం చేసుకునే అవకాశం అమెరికాకు దొరుకుతుంది. పాలస్తీనా, ఇజ్రాయిల్‌ల కోసం అమెరికా తయారు చేసిన రోడ్డు మ్యాప్, ప్రపంచంపై పెత్తనం చేయాలనే దాని ప్రపంచవ్యాప్త రాజకీయ-సైనిక వ్యూహంలో ఒక ముఖ్యమైన భాగం.

**ఈ రోడ్డు మ్యాప్ పాలస్తీనా రాజ్యంగా చెప్పే దానిని ఒక నిస్సహాయమైన, దయనీయమైన ప్రాంతంగా మారుస్తుంది. దానికి స్వతంత్ర విదేశాంగ విధానం ఉండదు. సరిహద్దులను రక్షించుకునేందుకు దానికి సైన్యం ఉండదు. ప్రజలను అదుపు చేయడానికి పోలీసు శాఖ మాత్రమే ఉంటుంది. ఒక రాజ్యంగా మనగలిగేందుకు దానికి ఎలాంటి ఆర్థిక పునాదీ ఉండదు. దాన్ని చిప్ప చేతబట్టుకొని సామ్రాజ్యవాదుల సహాయాలపై ఆధారపడి బతికే స్థితికి దిగజార్చడం ద్వారా అరబ్ ప్రపంచం, ప్రత్యేకించి పాలస్తీనా సమాజం విప్లవించేందుకు మరింత గొప్ప ప్రాతిపదిక మాత్రమే ఏర్పడుతుంది.** ఇలాంటి రోడ్డు మ్యాప్ ద్వారా సామ్రాజ్యవాదులు పాలస్తీనా నుండి గానీ, అరబ్ ప్రజల నుండి గానీ ఇజ్రాయిల్‌కు ఎలాంటి ప్రతిఘటనా ఎదురవబోదని ఆశిస్తున్నారు. కానీ, అంతిమ విశ్లేషణలో దీని ఫలితం ఇందుకు పూర్తిగా వ్యతిరేకంగా ఉంటుంది.

2005 నాటికల్లా ఏర్పాటు చేస్తామని నమ్మబలుకుతున్న పాలస్తీనా రాజ్యం గతంలో 1997లోనూ, 1999లోనూ, 2001లోనూ జరిగినట్టుగా ఎండమావిగానే రుజువు కాక తప్పదు. గత సందర్భాలలో కూడా, దురాక్రమణదారులకు వ్యతిరేకంగా సాగుతున్న పాలస్తీనీయుల పోరాటాన్ని అణచలేదన్న ఒకే ఒక్క కారణంతో పాలస్తీనాకు రాజ్య ప్రతిపత్తిని వాయిదా వేశారు. పాలస్తీనా రాజ్యం రకరకాల ఆర్థిక సహాయాల వాగ్దానాలతోనో, శరణార్థి శిబిరాలపై పెద్ద ఎత్తున బాంబులు కురిపించడం ద్వారానో, జియోనిస్టులు అమలు చేసే వివిధ రకాల భీభత్సకాండలతోనో ఏర్పాటు చేయలేరు. 2005 నాటికి కూడా అమెరికన్ సామ్రాజ్యవాదులు ఆశిస్తున్నట్టుగా ఏమీ జరక్కపోవచ్చు.

**పాలస్తీనా విప్లవకారులంటే జియోనిస్టులు ఎంతగా హడలెత్తుతున్నారో తెల్సుకోవడానికి ఈ ఒక్క ఉదాహరణ చాలు – పాలస్తీనీయుల దాడులను నిరోధించడానికి మొత్తం గాజాపట్టీనంతా చుట్టుముడుతూ 12 అడుగుల మందంతో, 6 మీటర్ల ఎత్తుతో, 1,660 కిలోమీటర్ల పొడవైన గోడ నిర్మిస్తున్నారు. ఈ గోడకు ఇజ్రాయిలీ రక్షణ బలగాలు అడుగడుగునా కాపలా కాస్తాయి. చాలా దగ్గర దగ్గరగా టవర్లూ, డిఫెన్స్ పోస్టులూ నిర్మిస్తారు. గోడను ఆనుకొని నీటితో నింపిన ఒక వెడల్పాటి కందకం, పక్కనే ముళ్లకంచె కూడా ఉంటాయి.** బ్యారికేడ్లతో నిండిన ఈ శాంతి రోడ్డు మ్యాప్ నుండి పాలస్తీనా ప్రజలపై సాగనున్న

అపూర్వ హింసా పథకాల గబ్బు వెలువడుతోంది! గోడ పథకం అమలు ఇప్పటికే ప్రారంభమై చాలా వరకు పూర్తయింది కూడా! ఇది గాజాను ఈ భూమండలంపై అతి పెద్ద చీకటికూపంగానూ, అక్కడి ప్రజలను పశువులకన్నా హీనంగానూ దిగజారుస్తుంది. వాళ్లు చెప్పే శాంతి, పెద్ద ఎత్తున అమలు చేసే హింసా ఫలితంగానే ఉంటుంది. కానీ దానితో ప్రజలు మరింత క్రూరమైన దాడులకు గురై మరింత తిరగబడే, మరింత గొప్పగా విప్లవించే ఆవకాశమే ఉంది.

ఇంకా బహిరంగంగా ప్రకటించని ఈ కొత్త రోడ్డు మ్యాప్‌లోని ప్రధానమైన విషయం ఏమిటంటే ఇది ఐరాస గొడుగు నీడలో, అమెరికా-బ్రిటన్‌ల కుట్ర ఫలితంగా ఉనికిలోకి వచ్చిన ఇజ్రాయిల్ రాజ్యానికి సాధికారతను కల్పిస్తుంది. 'పాలస్తీనా రాజ్యం' ఏర్పాటు కోసం జరిగిన మునుపటి ప్రయత్నాలన్నీ ఇతర కారణాలతో పాటు ఈ కింది సమస్యలు పరిష్కారం కానందువల్ల విఫలమయ్యాయి : అ) గాజాపట్టీ, వెస్ట్‌బ్యాంక్‌లలో ఇజ్రాయిలీ సెటిల్‌మెంట్లను (నివాసప్రాంతాలు) ఎత్తివేసే సమస్య, ఆ) జెరూసలేం పాలస్తీనాకు రాజధానిగా ఉండాలన్న సమస్య, ఇ) 1967 యుద్ధం మూలంగా నిర్వాసితులైన పాలస్తీనా శరణార్థులను వెనక్కి రప్పించే సమస్య, ఈ) తూర్పున ఉన్న వెస్ట్‌బ్యాంక్‌కూ, పశ్చిమాన ఉన్న గాజాపట్టీకీ మధ్య అవిచ్ఛిన్న సంబంధాన్ని ఏర్పాటు చేసే సమస్య. ఈ సమస్యల పరిష్కారం కోసం కొత్త రోడ్డు మ్యాప్ చెబుతున్నదేమిటో వివిధ నాయకులు చేస్తున్న ప్రకటనల ద్వారా అర్థం చేసుకోవచ్చు. సెటిల్‌మెంట్లను ఖాళీ చేయడానికి షెరోన్ సుముఖత కనబర్చాడు. గాజా, వెస్ట్‌బ్యాంక్‌ల మధ్య ఒక కారిడార్ (బహుశా ఒక రోడ్డు కావచ్చు) ఏర్పాటు విషయమై సంభాషణలకు సంసిద్ధత చూపించాడు. కానీ ఏ నాయకుడూ కూడా జెరూసలేం విషయాన్ని గానీ, శరణార్థుల సమస్యను గానీ లేవనెత్తలేదు. జెరూసలేంను రెండుగా విభజించాలని అమెరికా నొక్కి చెబుతూ చేస్తున్న ప్రతిపాదనను ఇజ్రాయిలీలు ఎల్లప్పుడూ వ్యతిరేకించారు. కానీ అరాఫత్ నాయకత్వంలోని పాలస్తీనా అథారిటీ అమెరికా ప్రతిపాదనను ఒప్పుకుంది. ఈ గొప్ప పురాతన నగరాన్ని రెండుగా చీల్చే ప్రతిపాదన ఈ కొత్త రోడ్డు మ్యాప్‌లో ఉండే ఉండొచ్చు. అలాగే శరణార్థుల సమస్యపై ఇప్పటికీ ఇరు పక్షాలూ మౌనంగానే ఉన్నాయి.

ఇజ్రాయిల్ సరసన ఏర్పడే 'పాలస్తీనా రాజ్యం' కేవలం పేరుకేనన్న విషయం ఇప్పటికే స్పష్టమై పోయింది. ఎందుకంటే దానికి ఎలాంటి సైనిక, ఆర్థిక స్వాతంత్ర్యమూ ఉండదు. అయితే తప్పక గమనించాల్సిన ఒక విషయం ఏమిటంటే, ట్యాంకులతోనూ, బుల్‌డోజర్లతోనూ నిర్మిస్తున్న ఈ రోడ్డు (మ్యాప్) పాలస్తీనీయులను నిస్సహాయులైన ప్రేక్షకులుగానో లేదా చావో రేవో తేల్చుకునే యోధులుగానో మలుస్తుంది. సామ్రాజ్యవాద మద్దతు గలిగిన ఇజ్రాయిలీ హంతక యంత్రాంగం అజేయమైందిగా అంగీకరించాలని వారిపై వత్తిడి చేస్తున్నారు. ఏనాటికైనా శాంతియుతంగా(!) జీవించాలని పాలస్తీనీయులు కోరుకున్నట్టయితే ఇజ్రాయిల్ అనే భయంకర వాస్తవాన్ని ఒప్పుకోవడం మినహా మార్గం వేరే ఏదీ లేదని వాళ్లకు నూరి పోస్తున్నారు. 1993 నాటి విద్రోహాన్ని తుపాకీ మొనలతో రుద్దుతున్నారు. అమెరికా ఇజ్రాయిల్‌ల షరతు ప్రకారం సాయుధ పాలస్తీనీయులను నిరాయుధం చేస్తాననే హామీతో అబ్బాస్ ఈ కొత్త మ్యాప్‌ను అంగీకరించాడు.

## గొప్ప మోసం

ఒక నేలపై రెండు రాజ్యాలని చెప్పే సిద్ధాంతం నిజానికి బలహీనుడి సర్వనాశనానికి ఓ ముసుగు మాత్రమే. బ్రిటిష్-అమెరికన్ సామ్రాజ్యవాదులూ, వాళ్ల కీలుబొమ్మలైన జియోనిస్టులూ ప్రజలపై అమలు జరిపిన దురాగతాలన్నీ మర్చిపోవాలని ఈ సిద్ధాంతం చెబుతుంది. జియోనిస్టులు ఇజ్రాయిల్‌ను నెలకొల్పిన నేల నిజానికి పాలస్తీనీయులదే. ఈరోజు పాలస్తీనా భూభాగం, పాలస్తీనా రాజ్యం, ఇజ్రాయిలీ సెటిల్‌మెంట్స్ అంటూ ఉపయోగిస్తున్న పదజాలమంతా మోసపూరితమైందే. ఇజ్రాయిల్ మొత్తంగానే పాలస్తీనీయుల నుండి కొల్లగొట్టిన నేలపై నిర్మించిన విదేశీ వలస సెటిల్‌మెంటే. అసలు ఇజ్రాయిల్ ఒక రాజ్యంగా నిలబడేందుకు నేల లేనే లేదు. శాంతి ఒప్పందం కోసం నేల అని చెప్పేదీ, పాలస్తీనా-ఇజ్రాయిల్ శిఖరాగ్ర సమావేశాలూ, శరణార్థుల సమస్యపై తీర్మానమని చెప్పేదీ – మొదలైనవన్నీ మోసకారి మాటలే. వీటిని మీడియా విస్తృతంగా ప్రచారం చేస్తూ ప్రపంచ ప్రజానీకాన్ని ఇజ్రాయిల్‌గా నిల్చినదాన్ని వాస్తవమైందిగా నమ్మేలా ప్రయత్నిస్తున్నాయి. పాలస్తీనా స్వతంత్ర సమరయోధులను టెర్రరిస్టులుగా చిత్రిస్తూ వారిపై దాడులకు పూనుకోవడం, వాళ్ల సాయుధ పోరాటం శాంతి స్థాపనకు వ్యతిరేకమైందిగా చెప్పడం – ఇవన్నీ నందిని పందీ, పందిని నందీ చేయగల సామ్రాజ్యవాద, వలసవాద బందిపోట్ల ముఠా చేసే దుర్మార్గాలే. సామ్రాజ్యవాదుల అబద్ధాలనూ, కుతంత్రాలనూ బట్టబయలు చేసి వాస్తవాలను బైటికి తేవల్సిన అవసరం ఎంతో ఉంది. "శాంతి" అనే అందమైన పదానికి అర్థం పాలస్తీనీయులకు అశాంతీ, శాశ్వత పరాధీనతా, దుర్భర పరిస్థితీ తప్ప మరేమీ కాదు.

**ప్రాచీన పాలస్తీనా ప్రాంతంలో నిజమైన శాంతి నెలకొనాలంటే ఒకే ఒక పాలస్తీనా రాజ్యం మాత్రమే సరైన పరిష్కారం. అది అన్ని మతాల ప్రజలూ ప్రజాస్వామిక, లౌకిక పద్ధతుల్లో కల్సి జీవించేదిగా ఉండాలి. సామ్రాజ్యవాదుల నుండీ, ఇతర అభివృద్ధినిరోధక శక్తుల నుండీ చోటు చేసుకునే అన్ని రకాల జోక్యాలనూ ప్రజలు తోసిపుచ్చాలి. రెండు దేశాలు ఉండొద్దు. ఒకే దేశం ఉండాలి. అది యూదు లేదా ముస్లిం మతరాజ్యంగా ఉండగూడదు. ఏకైక సెక్యులర్ రాజ్యమే పాలస్తీనాలో శాంతికి నిజమైన రోడ్డు మ్యాప్ అవుతుంది.**

పాలస్తీనీయులకు నిజమైన రాజ్యాన్ని కేవలం సామ్రాజ్యవాదులూ, జియోనిస్టులూ మాత్రమే గాక అభివృద్ధినిరోధక అరబ్ ప్రభుత్వాలు కూడా వ్యతిరేకిస్తున్నాయి. ఎందుకంటే పాలస్తీనా జాతి విముక్తి మధ్యప్రాచ్యంలో సామ్రాజ్యవాద వ్యతిరేక విప్లవకర రాజ్యానికి దారితీయగలదని అవి భయపడుతున్నాయి. అలాంటి రాజ్యం ఏర్పాటు ఈ ప్రాంతంలోని అభివృద్ధినిరోధక షేకుల రాజ్యాలా, అన్ని రకాల సామ్రాజ్యవాద అనుకూల ప్రభుత్వాలా త్వరిత పతనానికి నాంది అవుతుంది. **కాబట్టి అభివృద్ధి నిరోధక అరబ్ ప్రభుత్వాలు పాలస్తీనా సమస్య పట్ల పైపై సానుభూతిని ప్రకటిస్తూనే పాలస్తీనీయుల పోరాటాన్ని లోపలి నుండి విచ్ఛిన్నం చేసేందుకు ఎల్లప్పుడూ ప్రయత్నించడంలో ఆశ్చర్యమేమీ లేదు.** అవి ప్రజల్ని సంతృప్తిపర్చడానికి అప్పుడప్పుడు జియోనిస్టులను విమర్శిస్తూనే అమెరికా సామ్రాజ్యవాదులతో రాజీబేరానికి దిగుతున్నాయి. నిజానికి అరబ్ పాలకులు యజమానిని ప్రేమిస్తూ వాడి ఒడిలోని కుక్కను ద్వేషించలేరు. వీరి వైఖరిలోని ద్వంద్వ నీతి ఒక పెద్ద మోసాన్ని మరుగుపరుస్తోంది. ఈ "కొత్త" రోడ్డు మ్యాప్ ఈ దేశాలను తమ ద్వంద్వ వైఖరి నుండి బైట పడేయాలని ఆశిస్తున్నది. పాలస్తీనా రాజ్యంగా చెప్పేదాన్ని ఏర్పాటు చేశాక ఇజ్రాయిల్ రాజ్యానికి గుర్తింపునివ్వాలని ఈ మ్యాప్ ఈ దేశాలను కోరుతున్నది. మరీ ముఖ్యంగా, ఇరాక్ అమెరికా

గుప్పిట్లో ఉండగా, సిరియా, ఇరాన్‌లు దాని తక్షణ లక్ష్యాల పట్టికలో ఉండగా, అరబ్ అభివృద్ధినిరోధక ప్రభుత్వాలు అమెరికా సామ్రాజ్యవాద బందిపోట్ల "వరదహస్తాన్ని" పొందడం కోసం తమ ద్వంద్వ వైఖరిని వదులుకోవడానికే త్వరపడుతున్నాయి.

ఈ కొత్త రోడ్డు మ్యాప్‌లో నిక్షిప్తమై ఉన్న అణచివేత మూలంగా దీన్ని తక్షణమే నిర్ద్వంద్వంగా వ్యతిరేకిస్తారా లేక సమీప భవిష్యత్తులోనా అన్నది వేచి చూడాల్సి ఉంది. అయితే ఇటీవలి సంవత్సరాల్లో అత్యంత సాహసికులైన పోరాటయోధులను అనేక మందిని సభ్యులుగా గలిగిన హమస్, ఇస్లామిక్ జెహాద్ సంస్థలు అమెరికా రోడ్డు మ్యాప్ సాఫీగా పర్చుకోవడానికి వీలుగా మూడు నెలల పాటు కాల్పుల విరమణ ప్రతిపాదనను ఒప్పుకున్నాయి. అమెరికా వత్తిళ్లూ, బెదిరింపులూ ఓ మేరకు పనిచేశాయి. ఇజ్రాయిల్ "పాలస్తీనా ప్రాంతాల"పై దాడుల్ని నిలిపివేస్తే, "ఎంచుకొని చేసే హత్యల" పర్వానికి స్వస్తి చెబితే తాము "ఇజ్రాయిలీ ప్రాంతాల"పై దాడులు చేయబోమని అవి ప్రకటించాయి. ఇది ఒక రకంగా ఇజ్రాయిల్ రాజ్యానికీ, కుదించిన పాలస్తీనాకూ (పాలస్తీనా ప్రాంతాలకు) గుర్తింపునివ్వడమే అవుతుంది. ఇది సరిగ్గా 1987లో అరాఫత్ దిగబడిన బురదగుంట లాంటిదే. హమస్, ఇస్లామిక్ జెహాద్‌లు దీనికి ఒప్పుకోవడంతో అల్ ఫతాహ్‌కు చెందిన అల్ అక్సా బ్రిగేడ్ కూడా రోడ్డు మ్యాప్‌ను ఒప్పుకుంది. సిరియాలో ఉన్న హమస్, ఇస్లామిక్ జెహాద్‌ల ఉన్నత నాయకులు, ఇజ్రాయిల్ జైల్లో బంధీయైన పాలస్తీనా నాయకుడు బౌర్ఘౌటీతో పాటు కాల్పుల విరమణ పత్రాలపై డెమాస్కస్‌లో సంతకాలు చేశారన్నది గమనార్హం.

ఒక్క "పాలస్తీనా విమోచనా ప్రజా వేదిక"(పాపులర్ ఫ్రంట్ ఫర్ ది లిబరేషన్ ఆఫ్ పాలస్టైన్ - పిఎఫ్ఎల్‌పి) మాత్రమే కాల్పుల విరమణను తిరస్కరించింది. దానికి సంఖ్య రీత్యా హమస్, ఇస్లామిక్ జెహాద్, అల్ అక్సాలకన్నా తక్కువ బలమే ఉన్నప్పటికీ ఇజ్రాయిల్ ఉనికికి గుర్తింపునివ్వ నిరాకరిస్తూ, అది ఇప్పటికీ లొంగడానికి సిద్ధపడడం లేదు. ఇది శత్రువుతో మిలిటెంట్ పోరాటాలలో పెద్దగా పాల్గొన్న సంస్థ కాదు. పిఎఫ్ఎల్‌పితో పాటు అసలైన, సరైన పిఎల్ఓ (పాలస్తీనా విమోచనా సంస్థ) ప్రణాళికకు కట్టుబడి ఉన్న చిన్న చిన్న గ్రూపులు మరికొన్ని ఉండొచ్చు. పిఎల్ఓ ప్రణాళిక ఇజ్రాయిల్‌కు గుర్తింపునివ్వకూడదనీ, ప్రాచీన పాలస్తీనా మొత్తంలో ఒక ప్రజాస్వామిక పాలస్తీనాను ఏర్పాటు చేయాలనీ, పాలస్తీనా ప్రజలు వివిధ విశ్వాసాలు గలవారైనప్పటికీ లౌకిక స్ఫూర్తితో జీవించాలనీ ఉద్ఘాటించింది. అయితే పిఎల్ఎఫ్‌పి లేదా ఇతర పాలస్తీనా విప్లవకారులు సరైన మార్గంలో పాలస్తీనా ఉద్యమాన్ని పునరుజ్జీవింప జేయగలరా? ప్రపంచవ్యాప్తంగా, ప్రత్యేకించి అరబ్ ప్రపంచంలో సామ్రాజ్యవాద, అభివృద్ధినిరోధక శక్తుల బహుముఖ దాడి నేపథ్యంలో ఇలాంటి విప్లవకర పునరుజ్జీవానికి పరిస్థితి చాలా అనువుగా ఉంది. **ఇందుకోసం శత్రువును ప్రతిఘటించడంలో అత్యధిక సంఖ్యలో ప్రజల భాగస్వామ్యాన్ని నొక్కిచెబుతూనే, ప్రజల్ని ఒక విప్లవకర రాజకీయ దృక్పథం చుట్టూరా, విప్లవకర మిలిటరీ ఎత్తుగడల చుట్టూరా సమీకరించడానికి అవిశ్రాంతమైన కృషి అవసరం.**

ఒకవేళ ఏవైనా సంస్థలు విద్రోహకర అమెరికా రోడ్డు మ్యాప్‌కూ, అది హామీ ఇచ్చే స్మశానశాంతికీ వ్యతిరేకంగా బాహాటంగా ముందుకొస్తే, అబ్బాస్ వాటిపై తీవ్ర అణచివేతను ప్రయోగించడానికి వెనకాడడు. దాని ఫలితం పాలస్తీనాలో అంతర్యుద్ధమే. అతడు ఇలాంటి హెచ్చరిక ముందే చేసి హమస్‌నూ, ఇతరులనూ ఒప్పుకోమని కోరాడు. కొందరు పాలస్తీనా అథారిటీ అధికార్లు కూడా ఇలాంటి పరిస్థితి తలెత్తవచ్చని అంటున్నారు. రోడ్డు మ్యాప్‌కు శక్తివంతమైన, దృఢమైన నిరసన ఒక్కటే పాలస్తీనా ప్రజల ముందు అబ్బాస్‌ను బట్టబయలు చేసి వేరు పరుస్తుంది. పాలస్తీనా అథారిటీ నియంత్రణలోని నగరాల్లోంచి విడతలవారీ ఇజ్రాయిలీ బలగాల ఉపసంహరణ, రోడ్డు మ్యాప్ షరతు ప్రకారం, అబ్బాస్ పాలన పాలస్తీనా ప్రతిఘటనను సరిగా అదుపు చేయగలిగితేనే జరుగుతుంది. అతడు ఇందులో విఫలమైతే ఈ నగరాలను జియోనిస్టులు తిరిగి చేజిక్కించుకుంటారు. బెత్లెహాం, రామల్లా, నెబ్లుస్, గాజా నగరాలలో ఇజ్రాయిలీ బలగాలు ఉండటమనేది నిజానికి ఆక్రమణలో (మొత్తంగా) అంతర్భాగంగా అక్రమణ. ఈ నగరాలలో ఇప్పటి దాకా ఇజ్రాయిలీలు ట్యాంకులతో, బుల్‌డోజర్లతో, హెలికాప్టర్ గన్‌షిప్పులతో, మిస్సైళ్లతో నిర్వహించిన 'పోలీసు పని'ని ఇప్పుడు పాలస్తీనా అథారిటీ చేయాలని చెబుతున్నారు. అబ్బాస్ నేతృత్వంలో పాలస్తీనా అథారిటీ ఇలాంటి పోలీసు పనిని మొదలు పెడితే పాలస్తీనీయుల మధ్య జరిగేది అంతర్యుద్ధమే. జియోనిస్టు పీడనకు వ్యతిరేకంగా పాలస్తీనా ప్రతిఘటన కొనసాగే పక్షంలో ఇదే జరగాలని అమెరికా, ఇజ్రాయిల్‌లు కోరుకుంటున్నాయి.

పాలస్తీనాలో విప్లవం విజయవంతమైతే ఈ ప్రాంతంలో అభివృద్ధినిరోధక అరబ్ పాలనకు చరమగీతం పాడే అవకాశాలు మెండుగా ఉన్న దృష్ట్యా సామ్రాజ్యవాదులు పాలస్తీనా ప్రతిఘటనను అణచెయ్యడమే మధ్యప్రాచ్యంలో తమ ప్రాథమిక రాజకీయ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం ఈ ప్రాంతంలో అభివృద్ధినిరోధకత్వానికి పెట్టని కోటగా ఉన్న జియోనిస్టు రాజ్యాన్ని పరిరక్షించడాన్ని తమ అత్యున్నత కర్తవ్యంగా చేపట్టారు. కాబట్టి 'పాలస్తీనా రాజ్యాన్ని' నెలకొల్పే పేరిట పాలస్తీనా ప్రతిఘటనను నాశనం చేసే ఉద్దేశ్యంతోనే ఈ కొత్త రోడ్డు మ్యాప్ రూపొందిందని అర్థం చేసుకోవడానికి పెద్దగా కష్టపడనవసరం లేదు.

ఇజ్రాయిల్ ఈ రోడ్డు మ్యాప్‌ను అంగీకరించడం ద్వారా అది తన వైపు నుండి అతి పెద్ద "త్యాగానికి" ఒడిగట్టిందని అభివర్ణిస్తూ సామ్రాజ్యవాద మీడియా ఉన్మాదం అంచుల దాకా ప్రచారం చేశాయి. తమ "కష్టాల"ను చెప్పుకోవడం కోసం ఇజ్రాయిలీలు ఈ రోడ్డు మ్యాప్‌పై వంద అభ్యంతరాలనూ, రెండు డజన్ల సవరణలనూ ప్రతిపాదించారు. ఇజ్రాయిలీల కష్టాలను కడతేరుస్తామని అమెరికా ప్రకటించింది. వాటిని అది పరిశీలించి చాలా భాగం మార్చి వేసింది. ఇరాక్‌పై "విజయం" తర్వాత అమెరికా మధ్యప్రాచ్య రోడ్డు మ్యాప్ విమర్శకుల మద్దతును కూడా పొందింది. యూరోపియన్ యూనియన్, రష్యా, ఐరాసలు అమెరికా రోడ్డు మ్యాప్‌ను వ్యతిరేకించలేకపోయాయి. అవి దాన్ని సమర్థించాయి. అరాఫత్‌కు యూరోప్, రష్యాలు మద్దతును కొనసాగించడం వంటి వైరుధ్యాలు వాటి మధ్య ఉన్నప్పటికీ, పాలస్తీనా ప్రజలకు వ్యతిరేకంగా అమెరికా దాడి విషయంలో అవన్నీ ఒకటే.

ఇరాక్‌పై ఆక్రమణ ముగిసింది. సిరియా, ఇరాన్‌లకు హెచ్చరికలు జారీ అయ్యాయి. ఇలాంటి స్థితిలో ప్రపంచంలోని అభివృద్ధినిరోధక శక్తులన్నీ పాలస్తీనా విముక్తికి వ్యతిరేకంగా దృఢంగా నిలబడ్డాయి. మధ్య ప్రాచ్యంలో రోడ్డు మ్యాప్ సామ్రాజ్యవాదుల కుతంత్రాలకు మరో భయంకరమైన ఉదాహరణ. ఇది పాలస్తీనీయులను మరింత తీవ్రమైన పరిస్థితికి నెడుతుంది. అదే సమయంలో ఇది ప్రపంచంలోని అణగారిన ప్రజలందరినీ, ప్రత్యేకించి అరబ్బులను మరింత దగ్గరికి చేస్తుంది. ★

*ఆగస్టు 30, 2003*

పాలస్తీనా సమస్య పూర్వపరాలు

# అగ్రరాజ్యాల ప్రపంచాధిపత్య కుటిల వ్యూహాల ఫలితమే రగులుతున్న పశ్చిమాసియా రావణకాష్టం!

పాలస్తీనా చరిత్రంతా నిరంతర పోరాట చరిత్రే. 2,500కు పైగా ఏళ్ల చరిత్ర కలిగిన పాలస్తీనా క్రీ.శ. 1516 నుంచి మొదటి ప్రపంచ యుద్ధం వరకు ఒట్టమన్ సామ్రాజ్యంలో ఉండేది. ఒట్టమన్ సామ్రాజ్యం ఎర్రసముద్రం, నల్లసముద్రం మధ్య మొరాకో నుంచి ఇరాన్ దాకా విస్తరించి ఉండేది. ఈ సామ్రాజ్యంలో పాలస్తీనా విస్తీర్ణం 25,600 చ.కి.మీ. పాలస్తీనీయులలో కొద్ది మంది క్రైస్తవులు, యూదులు మినహా అందరూ అరబ్ ముస్లిములే. ఇది వ్యవసాయ ప్రధాన దేశం. ఆయిల్ సంపదతో అలరారే ప్రాంతమిది. 17, 18 శతాబ్దాలలో వీరి సామ్రాజ్య పతనం ప్రారంభమయింది. మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో ఒట్టమన్‌లను గద్దె దించడానికి తమకు సహకరిస్తే పాలస్తీనాకు స్వతంత్ర ప్రతిపత్తి ఇస్తామని బ్రిటన్ వాగ్దానం చేసింది. పాలస్తీనా మిగిలిన అరబ్ దేశాలతో కలిసి బ్రిటన్‌కూ, ఫ్రాన్స్‌కూ సహకరించి ఒట్టమన్ అధికారాన్ని నాశనం చేయగలిగింది. కానీ పాలస్తీనాకు మాత్రం స్వతంత్రం లభించలేదు. యూదులు పశ్చిమాసియాలోని (*పశ్చిమాసియానే యూరోపియన్లు మధ్యప్రాచ్యం అని అంటారు*) అనేక దేశాలలో తరాల తరబడి ఉంటున్నారు. ముస్లింలకూ, క్రిస్టియన్లకూ, యూదులకూ పవిత్ర స్థలం 'జెరూసలేం'. బ్రిటన్ మద్దతుతో పాలస్తీనాకు యూదుల వలస అధికమైంది. 1930 తర్వాత జర్మనీలో నాజీ ప్రభుత్వం యూదులను బహిష్కరించింది. వారంతా పాలస్తీనాకు తరలి వెళ్లారు. బ్రిటన్ వారిద్దరికీ ప్రత్యేక పాలనల గురించిన ఆశలు పెట్టింది.

అపారమైన చమురు నిల్వలు కలిగిన పశ్చిమాసియా సామ్రాజ్యవాద ప్రపంచ మార్కెట్ ఆధిపత్య వ్యూహంలో కీలక ప్రాధాన్యతను కలిగివుంది. అందుకే పశ్చిమాసియాపై తన ప్రాబల్యాన్నీ, ఆధిపత్యాన్నీ నిలబెట్టుకోవడానికి బ్రిటన్ తీవ్రంగా ప్రయత్నించింది. ఈ ప్రాంతంలోని అరబ్బులను అదుపులో వుంచేటందుకు యూదులను వినియోగించుకోవడానికి కుట్రపన్నింది. సరిగ్గా యిక్కడే పశ్చిమాసియా సమస్యకు బీజాలు పడ్డాయి. అప్పటికే యూరప్‌లో స్థిరపడ్డ యూదులు తమకు ప్రత్యేక దేశం కావాలనే జియోనిస్టు రాజకీయ ఉద్యమం నడుపుతున్నారు. బ్రిటన్ ఈ పరిస్థితిని వినియోగించుకుంది. యూదులందరికీ స్వంత దేశం ఏర్పాటుకు హామీ ఇచ్చింది. ఆనాటి నానాజాతి సమితి కూడా దీనిని బలపర్చింది. మొదటి ప్రపంచయుద్ధంలో జర్మనీ నాయకత్వంలోని అక్షరాజ్య కూటమి ఓటమితో టర్కీ ఆధీనంలోని పాలస్తీనా భూభాగాన్ని ఆధీన ప్రాంతంగా నానాజాతి సమితి ప్రకటించి, దాని పాలనా బాధ్యతను బ్రిటన్‌కు అప్పగించింది.

నానాజాతి సమితిపై తనకున్న పట్టుతో బ్రిటన్ పాలస్తీనాకు స్వాతంత్ర్యం ప్రకటించకుండా తన ఆధీనంలోకి తెచ్చుకోగలిగింది. ఆనాటికి పాలస్తీనా జనాభాలో అరబ్బులు 7,48,000 మంది వుంటే, యూదులు కేవలం 58,000 మంది మాత్రమే. పశ్చిమాసియాపై తన దీర్ఘకాలిక వ్యూహంలో భాగంగా యూరప్‌లోని యూదులను పెద్దయెత్తున పాలస్తీనాకు తరలించింది. మరోవైపు అరబ్బు జాతీయ ఐక్యతను దెబ్బతీయడానికి 'విభజించి పాలించు' విధానాన్ని అమలుచేసింది. పాలస్తీనాలో తూర్పు ప్రాంతాలనూ, జోర్డాన్ నదికి పశ్చిమ తీరంలోని ప్రాంతాలనూ విడదీసి మొత్తం ఆ ప్రాంతాన్ని ట్రాన్స్ జోర్డాన్‌గా ప్రకటించింది. వాటి పక్కనే వున్న ఇరాన్, సౌదీ అరేబియాలలో తనకు తొత్తులైన పాలకులను నియమించింది. వీరు అరబ్బు జాతి ప్రజల ప్రయోజనాలను నీరుగార్చుతూ యూదు అనుకూల వైఖరిని చేపట్టారు. దీనితో యూదుల తరలింపుకు ఎటువంటి ఆటంకం లేకుండా పోయింది. రెండవ ప్రపంచయుద్ధం ముగిసే నాటికి పాలస్తీనాలో యూదుల సంఖ్య పెద్దయెత్తున పెరిగి యూదులు తమ భూభాగంలో స్థిరపడడంతో పాలస్తీనీయులకు కష్టాలు మొదలైనాయి. రెండవ ప్రపంచ యుద్ధ పరిణామాలు, ప్రపంచ వ్యాప్తంగా వలసవాదానికి వ్యతిరేకంగా పెల్లుబుకుతున్న ప్రజాపోరాటాలతో సామ్రాజ్యవాదం మునుపటిలా తన వలసవాదాన్ని నెరపలేని స్థితి ఏర్పడింది. బ్రిటిష్ సామ్రాజ్యం వలసల నుండి తిరుగుముఖం పట్టాల్సి వచ్చింది. ముప్పయి సంవత్సరాలుగా తన ఆధీనంలో వున్న పాలస్తీనా భూభాగం నుండి 1947లో వదిలివెళ్తున్నట్లు ఐక్యరాజ్య సమితికి తెలియజేసింది. అయితే పశ్చిమాసియాపై తన ఆధిపత్యాన్ని, ప్రయోజనాలను వదులుకోవడానికి అది సిద్ధంగా లేదు. అందుకే తన ప్రయోజనాలను తీర్చే నమ్మకమైన సాధనంగా యూదుల ప్రత్యేక దేశం ఏర్పాటు అవసరాన్ని ఐక్యరాజ్యసమితి ముందు పెట్టింది. తన ప్రాబల్యంతో తన వ్యూహాన్ని ఐక్యరాజ్యసమితి ద్వారా అమలు చేయించింది. ఇన్నేళ్ళుగా బ్రిటిష్ పాలకుల దుర్మార్గపు కుటిలనీతికి బలవుతూ వచ్చిన పాలస్తీనా ప్రజల పరిస్థితి దీనితో మరింత అధ్వాన్నంగా మారింది.

## ఐక్యరాజ్య సమితి ద్రోహం - ఇజ్రాయిల్ పుట్టుక

1947లో ఐక్యరాజ్యసమితి (ఐరాస) పాలస్తీనా సమస్య పరిష్కారానికి సూచనలు చేయడానికి ప్రత్యేక కమిటీని ఏర్పర్చింది. న్యాయంగా చూస్తే ఒక దేశ సార్వభౌమాధికారాన్ని నిర్ణయించుకునే హక్కు ఆ దేశ ప్రజలకు వుంటుంది. ఐరాస చేయాల్సిందల్లా పాలస్తీనా ప్రజల మాతృదేశంగా వారి స్వాతంత్ర్యాన్ని గుర్తించడమే. యూదుల దురాక్రమణపూరిత విధానాలను అక్రమ వలసలను అడ్డుకుని వారిని వారి ప్రాంతాలకు తరలించాలి. లేదా పాలస్తీనా ప్రజల స్వాతంత్ర్యానికి ఎటువంటి నష్టం కలుగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి. కానీ ఐక్యరాజ్యసమితి పాలస్తీనాకు తీరని ద్రోహం చేసింది. పాలస్తీనా స్వాతంత్ర్యాన్ని గుర్తించాలని అరబ్బు దేశాలూ, ప్రజలూ ఐరాసకు మొరపెట్టుకున్నా దానిని లెక్కలోకి తీసుకోలేదు. చివరకు అంతర్జాతీయ న్యాయస్థానం సలహా కోరమని విజ్ఞప్తి చేసినప్పటికీ దాన్ని పెడచెవిన పెట్టి ఐరాస పాలస్తీనా ప్రజల ప్రతిపాదననూ, విజ్ఞప్తులనూ, ఆకాంక్షలనూ తిరస్కరించింది.

ఐరాస నియమించిన ప్రత్యేక కమిటీ పాలస్తీనా భవిష్యత్తును నిర్ణయిస్తూ రెండు ప్రత్యామ్నాయాలను సాధారణసభ ముందుంచింది. ఒకటి, పాలస్తీనా భూభాగాన్ని రెండుగా విభజించి ఒకటి యూదులకు, మరొకటి అరబ్బులకు యివ్వాలని, రెండు, ఒక ఫెడరల్ వ్యవస్థను ఏర్పాటుచేసి ఉభయులూ సామరస్యంగా వుండేలా చూడాలని

ప్రతిపాదించింది. ఐరాస ఏకపక్షంగా బ్రిటన్ ఒత్తిడితో 1947లో పాలస్తీనాను రెండుగా విభజించాలని నిర్ణయించింది. ఐరాస సర్వ ప్రతినిధిసభ 181వ తీర్మానం ప్రకారం 4,99,000 మంది యూదులు 5,10,000 మంది అరబ్బులు నివసించే 14,100 చ. కి.మీ. వైశాల్యంగల ప్రాంతాన్ని ఇజ్రాయిల్ దేశంగా, 7,49,000 మంది అరబ్బులు పదివేల మంది యూదులు నివసిస్తున్న 11,000 చ. కి.మీ. ప్రాంతాన్ని పాలస్తీనా ప్రాంతంగా ఏర్పాటు చేయాలని పేర్కొంది. వీటితోపాటు జెరూసలెం, బెత్లహాం పట్టణాలకు ప్రత్యేక ప్రతిపత్తినిచ్చి విడిగా వుంచాలని 1948 అక్టోబరు నాటికి రెండు దేశాల ఏర్పాటు జరగాలని ఐరాస స్పష్టం చేసింది. తీర్మానం ముందు వరకు పాలస్తీనాలో యూదులు మూడవ వంతు కూడా లేరు. వీరి యాజమాన్యంలో ఏడు శాతం భూమి కూడా లేదు. కానీ ఈ తీర్మానం వల్ల యూదుల చేతికి 56 శాతం భూభాగం వెళ్తుంది. తమకు తీరని అన్యాయం చేస్తున్న ఐక్యరాజ్య సమితి తీర్మానాన్ని పాలస్తీనీయులు వ్యతిరేకించారు. సామ్రాజ్యవాదుల కుటిల నీతిని వంట బట్టించుకున్న ఐరాస పాలస్తీనీయుల గోడును చెవికెక్కించుకోలేదు. దీనితో పాలస్తీనా జాతి వంచనకూ, విభజనకూ గురైంది.

ఐరాసను కూడా పక్కనపెట్టి 1948లో పాలస్తీనా భూభాగంలో యూదులు ఏకపక్షంగా స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకుని ఇజ్రాయిల్ దేశాన్ని ఏర్పర్చారు. అంతర్జాతీయ నిబంధనలను కూడా ఖాతరు చేయకుండా ఏర్పడిన ఇజ్రాయిల్‌కు బ్రిటన్, అమెరికా తమ సంపూర్ణ మద్దతును ప్రకటిస్తూ దాన్ని మరింత ఎగదోశారు. వీటి ప్రోద్బలంతో ఇజ్రాయిల్ నూతనంగా పాలస్తీనాను ఏర్పర్చాలనుకున్న భూభాగంపై దాడిచేసి ఆ ప్రాంతాన్ని కూడా ఆక్రమించుకుంది. అప్పటికే నిస్సేష్టులై నిరాయుధులుగా వున్న పాలస్తీనీయులపై జాత్యహంకారాన్ని తలకెక్కించుకున్న యూదుల ఇజ్రాయిల్ సైన్యం విరుచుకుపడి సృష్టించిన విధ్వంసం, బీభత్సం, అమానుష హత్యాకాండలలో వేలాదిమంది పాలస్తీనీయుల ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. బతికున్నవారు ఆస్తులు కోల్పోయి నిలువ నీడ లేక దిక్కుతోచని స్థితిలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పారిపోయారు. పాలస్తీనాలో మూడొంతుల భూభాగాన్ని ఇజ్రాయిల్ ఆక్రమించుకుంది. జెరూసలెంపై దాడి చేసి కొంత భూభాగాన్ని ఆక్రమించుకుంది. ట్రాన్స్ జోర్డాన్‌పై దాడిచేసి వెస్ట్‌బ్యాంక్, తూర్పు జెరూసలెంలను, ఈజిప్టుకు చెందిన గాజాపట్టీని కూడా స్వాధీనం చేసుకుంది. బ్రిటన్, అమెరికాలు అందిస్తున్న సైనిక శిక్షణ, అత్యాధునిక ఆయుధాలతో ఇజ్రాయిల్ జరిపిన అమానుష చర్యలు లెక్కలేనన్ని. అరబ్బుల రక్తంతో అది పశ్చిమాసియాలో సూపర్‌పవర్‌గా అవతరించింది. తాను ఆక్రమించుకున్న ప్రాంతాల నుండి పాలస్తీనీయులను బలవంతంగా తరిమేసింది. అమానుష హంతక చర్యలతోనే దురాక్రమణ యుద్ధాలతోనే ఇజ్రాయిల్ పుట్టింది. ఆనాటి నుండి నేటి వరకు దాని స్వభావం మారనే లేదు. ఒకప్పుడు యూరపులోని పలు దేశాలలో యిదే యూదులు నాజీ హిట్లర్ హంతకమూకల చేతిలో దారుణ హింసలకు గురయ్యారు. కాన్సన్‌ట్రేషన్ క్యాంపులలో సామూహిక హత్యాకాండలకు బలయ్యారు. ఆ హత్యాకాండ చరిత్రలో ఒక మాయని మచ్చగా మిగిలిపోయింది. కానీ నేడు యూదులే అప్పటి నాజీయిజాన్ని తలకెక్కించుకుని నయా నాజీలుగా అవతారమెత్తి మరొక జాతిని తన మాతృభూమిపైనే వేటాడడాన్ని చరిత్ర క్షమించదు.★

## ఎవరీ ఎరియల్ షెరోన్?

ప్రస్తుతం ఇజ్రాయిల్ ప్రధానమంత్రిగా ఉన్న ఎరియల్ షెరోన్ రాజకీయ జీవితం అతడు తన 14వ ఏట హగనాహ్‌లో సభ్యత్వాన్ని తీసుకోవడంతో ప్రారంభమైంది. హగనాహ్ ఒక మితవాద యూదు టెర్రరిస్టు సంస్థ. పాలస్తీనా ప్రజలను హింసాత్మక దాడులకు గురి చేయడం దాని ముఖ్య కార్యకలాపం. 1953లో షెరోన్ 'యూనిట్ 101'కు నాయకత్వ బాధ్యతలు చేపట్టాడు. పాలస్తీనా గ్రామాలపై దాడి చేసి వాటిని ఖాళీ చేయించడం ఈ యూనిట్ పని. షెరోన్ నాయకత్వంలో జరిపిన దాడుల్లో వందలాది స్త్రీపురుషులను ఊచకోత కోశారు. కిబ్యా అనే గ్రామంలో జరిపిన అమానుషమైన దాడిలో 45 ఇళ్లను ధ్వంసం చేసి 65 మందిని హత్య చేశారు. 1957లో షెరోన్ పారాట్రూప్ బ్రిగేడ్ కమాండర్ హోదాలో ఈజిప్టుకు చెందిన 270 మంది యుద్ధఖైదీలను హతమార్చడంతో అతడి హింసాత్మక ప్రవృత్తి మరోసారి ప్రపంచానికి తెల్సింది.

ఒక్కో హింసాత్మక కార్యకలాపంతో షెరోన్‌లో హింసా ప్రవృత్తి పెచ్చరిల్ల సాగింది. 1971లో అతను గాజాపట్టీలో గ్రామాలను ధ్వంసం చేస్తూ వ్యక్తులను ఏరి మరీ హత్య చేసే విధానాన్ని చేపట్టాడు. 100 మందికి పైగా పాలస్తీనా స్వాతంత్ర సమరయోధులను అతడు హత్య చేయించాడు. 1982 నాటికి షెరోన్ హింసాత్మక దండయాత్ర పతాకస్థాయికి చేరుకుంది. ఆ సంవత్సరం ఇజ్రాయిల్ రక్షణ మంత్రిగా అతడు లెబనాన్‌పై దాడి జరిపి దాదాపు 30 వేల మందిని హత్య చేశాడు. వీరిలో సగానికి పైగా స్త్రీలూ, పిల్లలే. ఈ సందర్భంగానే 1982 సెప్టెంబర్ 16, 17 తేదీలలో సబ్రా, సాటిలా అనే శరణార్థి శిబిరాలపై దాడి జరిపి 2,750 మందిని హత్య చేయించాడు. ఆఖరుకు ఒక ఇజ్రాయిలీ విచారణ కమిషన్ కూడా ఈ హత్యాకాండకు ఏరియల్ షెరోనే బాధ్యుడని నిర్ధారించింది. ఈ దురాగతానికి పాల్పడ్డందుకు గాను షెరోన్‌పై బెల్జియం న్యాయస్థానంలో మానవత్వానికి వ్యతిరేకంగా చేసిన నేరంగా నమోదైన కేసు విచారణకు వచ్చింది. అయితే అమెరికా వత్తిడి మూలంగా ఆ విచారణ జరగలేదు. ప్రపంచంలోని అత్యధిక దేశాల రాజధాని నగరాలలో ఎలాంటి స్వాగతమూ పొందని ఇలాంటి ఈ హంతకుడు భారతదేశానికి వచ్చినప్పుడు నిరసన ప్రదర్శనలు జరగడంలో అసహజమైందేమీ లేదు.

ఎరియల్ షెరోన్ ఇటీవల మన దేశ పర్యటనకు రాగా అనేక మంది ప్రజలూ, పలు ప్రజా సంఘాల వాళ్లూ తీవ్ర నిరసనను తెలిపారు. కానీ మతోన్మాద బిజెపి ప్రభుత్వం మాత్రం అతడికి ఘనంగా స్వాగతం చెప్పింది. ఈ పర్యటన వెనుక ఇరు దేశాల దోపిడీ పాలకవర్గాలకూ అనేక రాజకీయ, ఆర్థిక స్వార్థ ప్రయోజనాలున్నాయి. ముఖ్యంగా సైనిక రంగంలో ఇజ్రాయిల్ భారతదేశానికి అతి పెద్ద సరఫరాదారుడుగా మారింది. మధ్యప్రాచ్యంలో ఇజ్రాయిల్ ఎలాగైతే అమెరికా తొత్తుగా, స్థానిక దుష్టశక్తిగా నిలబడిందో, సరిగ్గా భారతదేశం కూడా దక్షిణాసియాలో అమెరికాకు నమ్మినబంటుగా, ప్రాంతీయ పెత్తందారుగా ఎదగడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. ఈ రెండు దేశాల మైత్రి వెనుక అమెరికా సామ్రాజ్యవాదుల ప్రోద్బలం ఉందన్నది గమనించాలి. ఎరియల్ షెరోన్ మన దేశానికి రావడం వెనుక మరో ఉద్దేశ్యం అమెరికాకు మద్దతుగా ఇరాక్‌కు తన సైన్యాన్ని పంపించేలా భారత్‌ను ఒప్పించడం కూడా. ★

# ఇరాకీ ప్రజల ప్రతిఘటనతో బెంబేలెత్తుతున్న అమెరికన్ సామ్రాజ్యవాదం

ఇరాక్ మరో వియత్నాంగా మారుతున్నది. చరిత్ర పాఠాల్ని నేర్చుకోవడానికి సిద్ధపడని అమెరికన్ సామ్రాజ్యవాదులు ఇరాక్ గడ్డపై అందుకు తగిన మూల్యాన్ని చెల్లిస్తున్నారు. పదవీచ్యుతుడై ఇప్పుడు అమెరికా బలగాలకు పట్టుబడ్డ ఇరాకీ రాష్ట్రపతి సద్దాం హుస్సేన్ ముందే హెచ్చరించినట్టుగా బాగ్దాద్ అమెరికన్లకు స్మశానవాటికగా మారింది. ఇరాక్‌పై దురాక్రమణ తర్వాత సద్దాం ప్రతిమను కూలగొడ్తూ ప్రజలు "సంబరాలు" జరుపుకున్నట్టు అబద్ధాల్ని ప్రచారం చేసిన సామ్రాజ్యవాద ప్రసార మాధ్యమాలు ఇప్పుడు ప్రతిరోజూ అమెరికాకు చేరుతున్న సైనికుల "శవాల సంచుల" గురించి వార్తలు ప్రసారం చేయాల్సి వస్తున్నది. అమెరికా, బ్రిటన్‌లు వేలాది టన్నుల విధ్వంసక బాంబుల్నీ, వందలాది మిస్సైళ్లనూ ప్రయోగించి లెక్కలేనంత విధ్వంసాన్ని సృష్టించినప్పటికీ, వేలాది మంది అమాయక ప్రజల్ని హతమార్చినప్పటికీ ఇరాకీ ప్రజల మనోస్థైర్యం చెక్కుచెదరలేదు. దాదాపు దశాబ్ద కాలంగా ఇరాక్‌పై విధించిన అమానవీయ ఆంక్షల మూలంగా ఇరాకీ ప్రజలు అనేక కష్టాల పాలవుతూ వచ్చారు. ప్రాణ రక్షక మందులు గానీ, పిల్లలకు పాలు గానీ దొరక్క లక్షలాది ప్రజలు, ముఖ్యంగా పసిపిల్లలూ, స్త్రీలూ అకాల మరణం పాలయ్యారు. అలాంటి స్థితిలో ఈ రెండో దురాక్రమణ దాడి జరగడంతో వాళ్లకు కలిగిన బాధలు చెప్పనలవి కానివి. అయినప్పటికీ ఇరాకీ ప్రజలు అమెరికన్ అగ్రరాజ్యం ముందు తల వంచలేదు. ఈ దురాక్రమణ యుద్ధానికి జవాబుగా గెరిల్లా యుద్ధతంత్రంతో తమ విముక్తి పోరాటాన్ని ప్రారంభించారు. అది రోజురోజుకూ విస్తరిస్తూ, బలోపేతమవుతూ సామ్రాజ్యవాదుల్ని నిద్ర పోనివ్వడం లేదు. అమెరికన్ సైన్యాలపైన నిత్యం ఆత్మాహుతి దాడులు, గెరిల్లా దాడులు కొనసాగుతున్నాయి. అనన్య సామాన్యమైన త్యాగాలతో ఇరాకీ ప్రజలు చేస్తున్న ఈ దాడులు స్వయంగా సామ్రాజ్యవాదుల మాటల్లోనే చెప్పాలంటే "రోజుకు సగటున 10 దాడులు"గా మొదలై, క్రమంగా "రోజుకు సగటున 20 దాడులు"గా పెంపొంది, డిసెంబర్ 13న సద్దాం హుస్సేన్ అమెరికా బలగాల చేతిలో బంధీ అయ్యేనాటికి "రోజుకు సగటున 50 దాడులు" జరిగే స్థాయికి అభివృద్ధి చెందాయి. మొదట్లో ఈ దాడుల్ని "జైళ్లల్లోంచి విడుదలైన కొందరు నేరస్తులు చేస్తున్న అరాచక చర్యల"ని కొట్టి పారేసిన అమెరికన్ ప్రభుత్వ, సైనిక అధికార్లు "ఇప్పుడు మేం పూర్తి స్థాయి గెరిల్లా యుద్ధాన్ని ఎదుర్కొంటున్నామ"ని ఒప్పుకోవల్సి వచ్చింది. మార్చ్ 20న ఇరాక్‌పై అమెరికా తన దురాక్రమణ యుద్ధాన్ని ప్రారంభించిన తర్వాత జరుగుతున్న పరిణామాలు ప్రపంచ పీడిత ప్రజానీకానికి ఎంతో ఉత్సాహాన్నిస్తున్నాయి. గతంలో వియత్నాం వీర ప్రజానీకం అమెరికన్ దురాక్రమణ బలగాలకు వ్యతిరేకంగా సాగించిన విముక్తి యుద్ధాన్ని గుర్తుకు తెస్తున్నాయి. సామ్రాజ్యవాదం పైకి ఎంత బలమైందిగా కనిపించినప్పటికీ అది నిజానికి కాగితపు పులేనని మావో మహాశయుడు చెప్పిన సత్యాన్ని ప్రపంచ ప్రజలంతా గ్రహిస్తున్నారు.



బగ్దాద్‌లో అమెరికన్ ట్యాంకును పడగొట్టిన ఇరాకీ సైనికుణ్ని అభినందిస్తూ సంతోషాన్ని వెలిబుచ్చుతున్న ఒక ఇరాకీ మహిళ

## క్రమక్రమంగా పుంజుకున్న ప్రజా ప్రతిఘటన

అమెరికా, బ్రిటన్‌ల సైన్య బలగాలు తమకున్న అత్యాధునిక సైనిక సంపత్తితో ఇరాక్‌పై విచ్చలవిడిగా దాడులకు పూనుకున్నారు. విమానాల ద్వారా బాంబులవర్షం కురిపించారు. ఇరాక్ వద్ద మానవ వినాశక ఆయుధాలున్నాయనే సాకుతో యుద్ధానికి దిగిన సామ్రాజ్యవాదులు ఇరాక్‌లో ప్రజలు నివసించే ప్రాంతాలపైనా, ఆసుపత్రులు, నీటి ట్యాంకులు, వంతెనలు, విద్యుత్ ప్రాజెక్టులు తదితరాలపైనా అత్యంత వినాశకరమైన బాంబుల్ని కురిపించి వేలాది మంది ప్రజల మరణానికి కారకులయ్యారు.

ఒక అంచనా ప్రకారం ఈ దురాక్రమణ యుద్ధంలో దాదాపు 25 వేల మంది ఇరాకీ ప్రజలు తమ ప్రాణాల్ని కోల్పోయారు. లెక్కలేనంత ఆస్తి నష్టం జరిగింది. యుద్ధం కారణంగా దాదాపు కోటి మంది ప్రజలు ఉపాధిని కోల్పోవల్సి వచ్చింది. "ఇరాకీయులకు స్వేచ్ఛ" పేరిట ఈ దురాక్రమణకు పాల్పడ్డ ఆంగ్ల-అమెరికా సామ్రాజ్యవాదులు ఇరాకీ ప్రజలకు కనీసం తాగడానికి నీళ్లు కూడా దొరకకుండా చేశారు. సద్దాం పాలనను కూలదోసి ఇరాక్‌లో ప్రజాస్వామ్యాన్ని స్థాపిస్తామని నమ్మబలికిన ఈ బందిపోట్లు ప్రజలకు తిండీ, బట్టా, ఇంధనం, విద్యుత్తూ వంటి కనీస సదుపాయాలేవీ అందకుండా చేశారు. అనేక వేల ఏళ్లుగా విలసిల్లుతూ వచ్చిన ఒక నాగరికతనే అంతం చేసే దురుద్దేశ్యంతో సాగించిన ఈ యుద్ధాన్ని మానవత్వంపై యుద్ధం అనడం నూటికి నూరు పాళ్లు సబబుగా ఉంటుంది.

అయితే ఇరాకీ ప్రజలు వీటన్నిటినీ ధైర్యంగా ఎదుర్కొన్నారు. అమెరికన్ బలగాలను వీలైన అన్ని పద్ధతుల్లో ప్రతిఘటించడం ప్రారంభించారు. పలు గెరిల్లా గ్రూపుల్లో సంఘటితమయ్యారు. సాయుధమయ్యారు. పౌర సదుపాయాలను డిమాండ్ చేస్తూ అనేక చోట్ల మిలిటెంట్ ప్రదర్శనలకు దిగారు. బహిరంగంగా వీధుల్లోకి వచ్చి అమెరికా సైన్యాల హింసాదౌర్జన్యాలకు వ్యతిరేకంగా నినాదాలు చేయడం అక్కడ రోజూ ఓ సాధారణ దృశ్యంగా మారిపోయింది. సద్దాం ప్రభుత్వంలో మంత్రులుగా, సైన్యాధికారులుగా పనిచేసిన వాళ్లూ, కొందరు బాథ్ పార్టీ నాయకులూ ప్రజా ప్రతిఘటనను ఆర్గనైజ్ చేశారు. కొన్ని షియా గ్రూపులు కూడా విదేశీ సైన్యాలకు వ్యతిరేకంగా గెరిల్లా యుద్ధాన్ని కొనసాగిస్తున్నాయి. అల్ ఫరూఖ్ బ్రిగేడ్ అనే గెరిల్లా సంస్థ అమెరికన్ బలగాలపై అనేక మిలిటెంట్ దాడుల్ని నిర్వహించింది.

అట్లాగే వివిధ అరబ్ దేశాల నుండి వచ్చిన వలంటీర్లు కూడా ఇరాక్ ప్రజా ప్రతిఘటనలో పాలు పంచుకుంటున్నారు. తమపై ఉధృతంగా సాగుతున్న గెరిల్లా దాడుల మూలంగా అభద్రతాభావానికి లోనైన అమెరికన్ సైనికులు ఉన్మాదంతో ఇరాకీ ప్రజలపై విచ్చలవిడి దాడులకు పాల్పడుతున్నారు. ఎలాంటి కవ్వింపూ లేకుండానే కాల్పులకు పూనుకోవడం, ఎవరిని బడితే వారిని కాల్చి చంపడం, మహిళలపై అత్యాచారాలు జరపడం, సోదాలు జరపడం, ప్రదర్శనకారులపై కాల్పులు జరపడం అమెరికా సైనికుల నిత్యకృత్యాలుగా మారాయి. ఇరాకీ ప్రజల ప్రతిఘటనను అణచివెయ్యడం కోసం అమెరికా బలగాలు పాశవికమైన దాడులు జరుపుతున్నాయి. అయినా ఇరాకీ ప్రజలు చెక్కు చెదరని ఆత్మవిశ్వాసంతో, తమ మాతృదేశ విముక్తి కోసం వెలలేని త్యాగాలు చేస్తూ సామ్రాజ్యవాదులను హడలెత్తిస్తున్నారు. విదేశీ దురాక్రమణను అంతమొందించడం కోసం ఇరాకీ స్త్రీపురుషులు మానవబాంబులుగా మారి తమ ప్రాణాల్ని తృణప్రాయంగా అర్పిస్తున్నారు.

## అమెరికా వ్యూహం తలకిందులు

అమెరికా ఇరాక్‌ను ఆక్రమించుకున్న తర్వాత ఇరాకీ సైన్యం చాలా నాటకీయంగా మాయమైంది. సైనికులు తమ ఆయుధాలతో సహా ప్రజలల్లో కలగలిసిపోయారు. సాంప్రదాయిక యుద్ధం ద్వారా అమెరికాను ఎదుర్కోవడం సాధ్యం కాదని గుర్తించి అమెరికాను దీర్ఘకాల గెరిల్లా యుద్ధంలోకి ఈడ్వడానికి వాళ్లు తగిన ఏర్పాట్లు ముందే చేసుకున్నారు. తన వద్దనున్న ఆయుధ సంపత్తితో ఏ దేశాన్నైనా లొంగదీయగలనని విర్రవీగుతూ వచ్చిన అమెరికాకు ఇరాక్‌లో ఘోరమైన వైఫల్యాన్ని చవిచూడాల్సి వచ్చింది. గతంలో 1991లో ఇరాక్‌పై మొదటి దురాక్రమణ యుద్ధానికి పాల్పడ్డప్పుడూ, 1998లో యుగొస్లావియాపైనా, 2001లో అఫ్ఘనిస్తాన్ పైనా దురాక్రమణ జరిపినపుడు అది విమానాల ద్వారా బాంబులవర్షం కురిపించి ఆ దేశాలను సర్వనాశనం చేసి అదుపులోకి తెచ్చుకునే వ్యూహాన్ని అనుసరించింది. వియత్నాం చేదు అనుభవాల తర్వాత అమెరికా వీలైన మేరకు భూతలంపై యుద్ధాన్ని తప్పించుకుంటూనే వస్తున్నది. అఫ్ఘనిస్తాన్‌లో దానికి నార్తర్న్ అలియెన్స్ రూపంలో తొత్తులు తయారుగా దొరకడంతో భూతలంపై యుద్ధానికి నేరుగా దిగకుండానే తాలిబాన్ పాలనను కూల్చడంలో అది జయప్రదమైంది. ఇప్పటి ఇరాక్ యుద్ధంలో కూడా ఇలాంటి వ్యూహాన్నే అనుసరించాలనీ, వియత్నాం అనుభవం పునరావృతం కాకుండా చూసుకోవాలని అది భావించింది. విమాన దాడుల ద్వారా ఇరాక్‌పై పట్టు సాధించగానే తన తొత్తు దేశాల నుండి సైన్యాలను రప్పించి తన స్వంత సైనికుల చావుల్ని నిరోధించాలని అది అనుకుంది. కానీ ఫ్రాన్స్, జర్మనీ తదితర బలిసిన దేశాలతో సహా మనదేశం వంటి బడుగు దేశాలు కూడా ప్రజల నిరసనకు భయపడి అమెరికా కమాండు కింద తమ సైన్యాలను ఇరాక్‌కు పంపడానికి ససేమిరా అన్నాయి. దానితో అమెరికా ఆశలన్నీ అడియాసలయ్యాయి. ఏ భూతల యుద్ధాన్నైతే అది తప్పించుకోవాలనుకుందో సరిగ్గా అదే యుద్ధంలో ఘోరంగా దిగబడింది.

## సైన్య అంచనాలు తారుమారు

మొదట భద్రతా మండలిలో ఇరాక్‌పై దురాక్రమణకు ఆమోదం లభించగలదని ఆశించిన అమెరికా, బ్రిటన్‌లకు ఫ్రాన్స్, రష్యాలు వ్యతిరేకించడంతో దౌత్యపరంగా పరాభవం జరిగింది. దానితో అవి రహస్యంగా సమావేశమై చాలా కొద్ది దేశాల మద్దతుతో ఏకపక్షంగా యుద్ధానికి దిగాల్సి వచ్చింది. ఇరాక్‌లో తమ సైన్యాలు ప్రవేశించగానే సద్దాం పాలనతో విసిగిపోయిన ఇరాక్ ప్రజలు, ముఖ్యంగా సాంప్రదాయకంగా సద్దాంకు బద్ధశత్రువులైన షియాలు తమకు పూలతో స్వాగతం చెబుతారనీ, తమ సైన్యాలు నిరాటంకంగా బగ్దాద్‌లోకి ప్రవేశించగలవనీ తాము నమ్మడమే కాదు, ప్రజల్ని నమ్మించాలని కూడా అమెరికన్ సామ్రాజ్యవాదులు బాగా ప్రయత్నించారు. కానీ అలాంటి స్వాగతం గానీ, షియాల తిరుగుబాటు గానీ ఏదీ జరగలేదు. తమ తొత్తులని అనుకున్న వాళ్లు కూడా అమెరికా ఆశించిన మేరకు సహాయం చేయలేకపోయారు.

ఇరాక్ చాలా తొందరగా పడిపోతుందని సామ్రాజ్యవాదులు భ్రమపడ్డారు. మూడు, నాలుగు వారాల్లోనే ఇరాక్‌ను పూర్తిగా ఆక్రమిస్తామని బాహాటంగానే ప్రకటించారు కూడా. కానీ తొలి నుండీ అమెరికా వేసుకున్న అంచనాలన్నీ తారుమారవుతూనే వస్తున్నాయి. ఇరాక్ యుద్ధంలో "విజయం" సాధించామని ప్రకటించడానికి అమెరికాకు 50 రోజులు పట్టింది. కానీ ఈ "విజయం" తర్వాతే ఇరాక్ ప్రజల అసలు యుద్ధం – విముక్తి యుద్ధం – మొదలైంది. 30 వేల సైన్యంతో ఇరాక్‌ను అదుపు చేస్తూ మూడు నెలలలోగా కీలుబొమ్మ ప్రభుత్వాన్ని నెలకొల్పగలమని ఆశించిన అమెరికన్ సామ్రాజ్యవాదులకు భంగపాటు తప్పలేదు. ఇప్పటికీ లక్షన్నరకు పైగా అమెరికన్ సైన్యం ఇరాక్‌లో తిష్టవేసి ఉండగానే మరో 30 వేల సైన్యాన్ని తరలించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. బ్రిటన్, స్పెయిన్, జపాన్, దక్షిణ కొరియా, ఇటలీ తదితర దేశాలకు చెందిన పదుల వేల సైన్యం కూడా ఇరాక్‌లో ఉంది. ప్రతిరోజూ ఎక్కడో ఓ చోట అమెరికా సైనికులు ఇరాకీ గెరిల్లాల చేతిలో చస్తూ శవాలు రవాణా అవుతూ ఉండడంతో అమెరికా ప్రజలలో ఆందోళన, ప్రభుత్వంపై వత్తిడి పెరుగుతోంది. దీనితో తమ సైన్యాలను పంపించాల్సిందిగా అమెరికా 85 దేశాలకు విజ్ఞప్తి చేయాల్సి వచ్చింది. తన దేశ సైనికుల చావుల్ని నిరోధించడానికి అది ఆఖరుకు బంగ్లాదేశ్ వంటి బడుగు దేశాన్ని కూడా సైన్యం పంపమని కోరాల్సి వచ్చింది.

## దుష్ప్రచార దుమారాన్ని తిప్పికొట్టిన ప్రపంచ ప్రజలు

ఇరాక్‌పై దురాక్రమణకు ప్రపంచ ప్రజల ఆమోదం పొందడం కోసం అమెరికా, బ్రిటన్‌లు చేయని ప్రయత్నమంటూ లేదు. తమ మోచేతి నీళ్లు తాగే ప్రసార మాధ్యమాలను ఉపయోగించుకొని అబద్ధాలను విచ్చలవిడిగా ప్రచారం చేశాయి. ఒక అబద్ధాన్ని వందసార్లు నిజమని చెబితే అది ఏదో ఒక నాటికి నిజమే అవుతుందన్న గోబెల్స్ ఫాసిస్టు సిద్ధాంతాన్ని పూర్తిగా వంట బట్టించుకున్న ఈ సామ్రాజ్యవాదులు ఇరాక్ వద్ద మానవ వినాశక ఆయుధాలున్నాయనీ, ఇరాక్‌లో సద్దాం పాలన ఉండడం ప్రపంచానికి పెద్ద ముప్పనీ విపరీతంగా ప్రచారం చేశారు. ఈ దుష్ప్రచార దాడి ఎంత తీవ్రంగా కొనసాగిందంటే సగానికి పైగా అమెరికా ప్రజలు ఇరాక్ గురించి బుష్ చెప్పే దాంట్లో నిజముందని నమ్మసాగారు. కానీ యుద్ధం ముగిసిందని ప్రకటించి ఇప్పటికి 8 నెలలు కావస్తున్నప్పటికీ ఇరాక్‌లో సామూహిక వినాశక ఆయుధం ఒక్కటైనా బయటపడకపోవడంతో ఈ ప్రచారం అంతా అబద్ధమని ఇప్పుడు చాలా మంది గుర్తిస్తున్నారు. అమెరికా, బ్రిటన్‌లలో తప్పుడు ఇంటలిజెన్స్ నివేదికలు వెలువరించి దురాక్రమణ యుద్ధానికి ఆమోదం పొందడం కోసం ప్రజల్ని మోసం చేశారన్న ఆరోపణలు బాహాటంగానే వెలువడ్డాయి. ఆఖరుకు ప్రతిపక్ష పార్టీలు కూడా ఇరాక్‌పై దురాక్రమణ సరైంది కాదనీ, అమెరికా విదేశాంగ విధానాన్ని మళ్లీ సమీక్షించాల్సిన అవసరం ఉందనీ దుయ్యబట్టాయి. అమెరికాలోని మెజారిటీ ప్రజానీకం, ముఖ్యంగా సైనికుల కుటుంబాలూ, 'వియత్నాం వెటరన్స్'గా పిలవబడే మాజీ సైనికులూ ఇరాక్ నుండి తక్షణమే తమ దేశ సైన్యాలను వెనక్కి రప్పించాలని డిమాండ్ చేస్తున్నారు. బ్రిటన్, తదితర యూరోపియన్ దేశాలలో అత్యధిక ప్రజానీకం ప్రపంచశాంతికి విఘాతం కలిగిస్తున్నది జార్జ్ బుష్షేనని భావిస్తున్నారు. ఇరాక్‌పై దురాక్రమణకు పాల్పడింది మానవ వినాశక ఆయుధాలున్నందుకు కానే కాదనీ, ఇరాక్‌లోని చమురు నిల్వలను చేజిక్కించుకొని లాభాలు పొందడానికీ, మొత్తంగా పశ్చిమాసియాపై పట్టు బిగించడానికీ అన్న వాస్తవాలను ప్రపంచ ప్రజానీకం

మరింత స్పష్టంగా తెలుసుకున్నారు. గత నెలలో బుష్ లండన్‌కు వెళ్లగా లక్షలాది ప్రజలు అతడికి తమ తీవ్ర నిరసన తెలపడం సామ్రాజ్యవాద దేశాల ప్రజలు సైతం బుష్, బ్లేయిర్‌ల దురాక్రమణ విధానాలను వ్యతిరేకిస్తున్నారనడానికి ఒక ఉదాహరణ మాత్రమే.

## అమెరికాలో వెల్లువెత్తుతున్న నిరసన

ఇరాక్‌పై దురాక్రమణ ప్రయత్నాలు మొదలైనప్పటి నుండే అమెరికా ప్రజలు నిరసన తెల్పుతూ వచ్చారు. అయితే ఇప్పుడు "శవాల సంచులు" రావడం పెరిగాక బుష్ ప్రభుత్వ విధానాలను అమెరికా ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇరాక్‌లోంచి సైన్యాన్ని వెనక్కి రప్పించాలనే డిమాండ్‌తో అనేక సంఘాలు కూడా ఏర్పడి వివిధ రూపాల్లో నిరసనోద్యమాన్ని నడుపుతున్నాయి. అమెరికా సాగిస్తున్న దురాక్రమణ యుద్ధం అమెరికా ప్రజలను లెక్కలేనన్ని ఇబ్బందులకు గురి చేస్తుండడం వల్ల కూడా అనేక మంది ఈ నిరసనోద్యమంలో చేరుతున్నారు. అమెరికా సైన్యంలో, ప్రత్యేకించి కాల్బలంలో ఉన్న అత్యధిక శాతం మంది పేద నల్లజాతి ప్రజల, లాటిన్ అమెరికన్ ప్రజల పిల్లలే. పిడికెడు కార్పొరేట్ సంస్థల లాభాల కోసం తమ పిల్లల ప్రాణాల్ని అన్యాయంగా బలి ఇస్తున్నారని ప్రజలు బుష్ ప్రభుత్వాన్ని నిందిస్తున్నారు. ఇప్పటికే అనేక మంది అమెరికన్ సైనికులు ఇరాక్‌లో ప్రతిరోజూ జరుగుతున్న గెరిల్లా దాడులతో అభద్రతాభావానికి గురై, సెలవులు దొరక్కపోవడంతో మనోవేదనకు గురై ఆత్మహత్యలకు పాల్పడ్డారు. దీనితో సైనికుల కుటుంబాల్లో ప్రభుత్వ విధానాల పట్ల మరింత వ్యతిరేకత పెరుగుతోంది. ఈ యుద్ధం కోసం మొదట 8 వేల కోట్ల డాలర్లుగా అంచనా వేసిన ఖర్చు తడిసి మోపెడవుతుండడంతో ఈ ఆర్థిక భారాన్ని కూడా ప్రధానంగా అమెరికన్ పేద ప్రజలే మోయాల్సి వస్తున్నది. ప్రజలకు లభించే అనేక సదుపాయాలను తగ్గించి, వేతనాలలోనూ పెన్షన్లలోనూ కోత విధించి, పన్నులు పెంచి ఈ మొత్తాన్ని ప్రభుత్వం రాబడుతోంది. దీనితో అది ప్రజల్లో మరింత వ్యతిరేకతను కొని తెచ్చుకుంటోంది. హెలీబర్టన్ అనే చమురు కంపెనీ ఇరాక్‌లో పోరాడే అమెరికా సైన్యానికి ఎక్కువ ధరకు ఇంధనం సరఫరా చేసి 9 కోట్ల డాలర్లు దిగమింగిందన్న కుంభకోణం ఈ మధ్యనే బైటపడడంతో అమెరికన్లకు పుండు మీద కారం జల్లినట్టయింది. ఈ హెలీబర్టన్ కంపెనీలో అమెరికా ఉప రాష్ట్రపతి డిక్ చెనీకి వాటాలున్నాయన్నది గమనార్హం. ఈ విధంగా, ఈ యుద్ధంతో లాభపడుతున్నదెవరో, ఈ యుద్ధంలో బలవుతున్నదెవరో, ఈ యుద్ధ భారాన్ని మోస్తున్నదెవరో ఒక్క అమెరికన్ ప్రజలకే కాదు, ప్రపంచానికంతా స్పష్టంగా అర్థమవుతున్నది.

## చమురు వ్యూహానికి ఎదురుదెబ్బ

ఈ దురాక్రమణ యుద్ధానికి కారణాల్లో ముఖ్యమైంది ఇరాక్ చమురుపై అదుపు సాధించడమేనన్న విషయం అందరికీ తెల్సిందే. తీవ్ర సంక్షోభంలో చిక్కుకుపోయిన అమెరికన్ ఆర్థికవ్యవస్థను గట్టెక్కించుకోవడం కోసం సామ్రాజ్యవాదులకు ఈ యుద్ధం అనివార్యమైంది కూడా. అమెరికన్ విధాన నిర్ణేతలలో చాలా మందికి హెలీబర్టన్, బెక్టెల్, షెల్ వంటి బడా చమురు కంపెనీలతో సంబంధాలున్నాయి. అందుకే ఒకవైపు యుద్ధం ముగియగానే 'పునర్నిర్మాణం' పేరిట రంగంలోకి దిగి తమ దోపిడీ పథకాలను అమలు చేయబూనుకున్న సామ్రాజ్యవాదులకు ఇరాకీ ప్రజల ప్రతిఘటనతో బ్రేకులు పడ్డాయి. ఇరాకీ ప్రజలు చేస్తున్న వీరోచిత దాడులతో అమెరికన్ చమురు కంపెనీలు ఇప్పటికీ ఇరాక్‌లో చమురు ఉత్పత్తిని ప్రారంభించలేకపోతున్నాయి. చమురు కంపెనీల కార్యాలయాల పైనా, చమురు పైప్‌లైన్ల పైనా జరిగిన బాంబు దాడులతో ఈ బందిపోట్ల దోపిడీ పథకాలు అమలుకు నోచుకోకుండా పోతున్నాయి.

ఇరాకీయుల ప్రతిఘటనతో అమెరికా ప్రపంచాధిపత్య వ్యూహానికి తీవ్రమైన ఎదురుదెబ్బే తగిలిందని చెప్పొచ్చు. ఇరాక్‌పై దురాక్రమణ జరిపి మొత్తంగా పశ్చిమాసియాను తమ గుప్పిట్లో బంధించాలని అమెరికా సామ్రాజ్యవాదులు ఆశించారు. ఇరాక్‌లో తొత్తు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి దాన్ని ఒక స్థావరంగా వాడుకుంటూ మొత్తం అరబ్ ప్రపంచంపై తిరుగులేని పెత్తనం నెరపాలని అనుకున్నారు. ఇరాక్‌పై దురాక్రమణ విజయవంతం కాగానే సిరియా, ఇరాన్‌లపై అవసరమైతే దాడులు చేయడమో లేదా వత్తిడి తెచ్చి ప్రభుత్వాలను పడగొట్టి తమ తొత్తులను అధికారంలోకి తేవాలని అమెరికా పన్నిన పన్నాగం అందరికీ తెల్సిందే. అందుకోసమే ఒక వైపు ఇరాక్‌పై యుద్ధం చేస్తూనే మరోవైపు ఈ రెండు దేశాలకు బెదిరింపుల్ని ఎక్కువ చేసింది. విశ్లేషకుల అంచనా ప్రకారం, ఇరాక్ తన గుప్పెట్లోకి రాగానే సౌదీ అరేబియా నుండి తన బలగాలలో చాలా భాగాన్ని ఉపసంహరించుకోవాలని కూడా అమెరికా భావించింది. సౌదీ అరేబియాలో అమెరికా సైన్య బలగాలపై దాడులు నానాటికీ పెరుగుతుండడం, మొత్తంగానే ఆ దేశంలో పరిస్థితి అమెరికాకు వ్యతిరేకంగా వేగంగా మారుతుండడం దానికి పెద్ద ముప్పుగానే ఉంది. ఇప్పటి దాకా పశ్చిమాసియాలో సౌదీ అరేబియా, కువైట్, ఖతర్‌లే దానికి స్థావరాలుగా ఉపయోగపడుతున్నాయి. కానీ ఇరాక్‌లో తన పథకం పారకపోవడంతో మిగతా పథకాలన్నీ బెడిసికొట్టాయి. ఇటీవలి నెలలలో అఫ్ఘనిస్తాన్‌లో మళ్లీ సంఘటితమవుతున్న తాలిబాన్లను అణచే పేరిట అమెరికా సైనిక చర్యలను తీవ్రం చేసి రోజూ అమాయక పౌరుల ప్రాణాలను బలిగొంటున్నది. దీనితో అఫ్ఘాన్ ప్రజల్లో, మొత్తంగా ప్రపంచ ప్రజల్లో అమెరికన్ సామ్రాజ్యవాదం పట్ల తీవ్రమైన ద్వేషం పెల్లుబుకుతోంది. మరోవైపు, అత్యంత బలసంపన్నుడైన అమెరికాను కూడా గెరిల్లా యుద్ధం ద్వారా ఎదుర్కోవచ్చన్న విశ్వాసాన్ని ఇరాక్ ప్రతిఘటన ప్రపంచ ప్రజానీకానికి మరింతగా కలిగించింది. ఈ ఇనుమడించిన విశ్వాసంతో ప్రపంచ ప్రజలు అమెరికా ప్రపంచాధిపత్య వ్యూహాన్ని తప్పక ఓడిస్తారు.

## ఇరాకీయుల ప్రతిఘటనా విశేషాలు

ఇరాక్ ప్రజలు చేస్తున్న దాడులన్నీ టెర్రరిస్టు దాడులుగా చిత్రించడానికి సామ్రాజ్యవాదులు పడరాని పాట్లు పడుతున్నారు. కానీ ఈ దాడులు ప్రజల మద్దతుతో, వాళ్ల క్రియాశీల సహకారంతో, భాగస్వామ్యంతో, వాళ్ల ఆకాంక్షలకు అనుగుణ్యంగా జరుగుతున్నాయన్న విషయం వాస్తవాల్ని గమనించేవాళ్లకు కళ్లకు గట్టినట్టుగా అర్థమవుతుంది. ఈ దాడులు ఎంతో వైవిధ్యంతో సాగుతున్నాయి. అమెరికా తదితర ఆక్రమణదారు దేశాల సైన్య బలగాలపైనా, ఇరాక్‌లో అమెరికా ఏర్పాటు చేస్తున్న పోలీసు బలగాల పైనా, అమెరికాకు తొత్తులుగా పని చేస్తున్న రాజకీయ, మత నాయకులపైనా ప్రజలు తమ దాడుల్ని ఎక్కుపెట్టారు. అమెరికా రక్షణ శాఖ సహాయ మంత్రి ఉల్ఫోవిట్జ్ బస చేసిన హోటల్‌పై ఇరాకీయులు రాకెట్లతో దాడి చేయగా వాడికి చావు తప్పి కన్నులొట్టబోయినంత పనైంది. ఇరాక్‌లో అమెరికన్ సైనికుల చావు వార్తలు బుష్‌ను తీవ్రంగా కలవరపెడుతున్నాయి. 1991లో ఇరాక్‌పై మొదటి ఆక్రమణ యుద్ధానికి పాల్పడ్డ తన తండ్రికి రెండో సారి ఎన్నికల్లో పట్టిన గతే వచ్చే ఏడు జరగనున్న ఎన్నికల్లో తనకూ పట్టేలా ఉందని అతడు ఆందోళన పడుతున్నాడు. మరోవైపు తన సైనికుల మనోస్థైర్యం రోజురోజుకూ ఘోరంగా పడిపోతుండడం, కొందరు సైనికులూ అధికార్లూ ఇరాక్ నుండి సైన్యాన్ని వెనక్కి రప్పించాలని బాహాటంగానే ప్రకటనలు చేస్తుండడం తన ప్రపంచాధిపత్య వ్యూహానికి విఘాతం కల్పించేదిగా అతనికి కనిపిస్తోంది. అందుకే బుష్ దొంగలా రాత్రిపూట ఎవరికీ చెప్పకుండా అద్దాలకు నల్ల రంగు పూసిన విమానంలో బగ్దాద్‌కు వచ్చి తన సైనికుల వెన్ను తట్టి పోయాడు. అమెరికన్ ఓటర్లను ఆకట్టుకోవడానికి ఇంకా ఇలాంటి చౌకబారు ఎత్తుగడలెన్నో వేస్తున్నాడు.



"అమెరికా సైన్యాలు మా దేశం వదిలిపోవాల"ని నినదిస్తూ తమ పిల్లాపాపలతో పాటు సాయుధ ప్రదర్శనలో పాల్గొంటున్న ఇరాకీ మహిళలు

అయినప్పటికీ ఇరాకీయుల ప్రతిఘటన అప్రతిహతంగా సాగుతూనే ఉంది. ఎట్టి పరిస్థితిలోనూ తమ గడ్డపై విదేశీ సైన్యాలుండగూడదని దేశభక్తిపరులైన ఇరాకీయులు నినదిస్తున్నారు. విశ్వవిద్యాలయాల ఆవరణలో ప్రతిరోజూ కరపత్రాలు పంచడం, సామ్రాజ్యవాద వ్యతిరేక నినాదాలు చేయడం వాళ్లలో గల దేశాభిమానాన్ని చాటుతున్నాయి. ఇరాకీయులు తమ ఇండ్లనే బంకర్లుగా, శరీరాల్నే బాంబులుగా మార్చి శత్రువుతో తలపడుతున్నారు. అమెరికాకు మద్దతునిచ్చిన దేశాల దౌత్య కార్యాలయాలనూ, ఆఖరుకు పదేళ్లకు పైగా అమానవీయమైన ఆంక్షల్ని అమలు చేయించి తమ దేశాన్ని వినాశనం అంచులకు తేవడంలో అమెరికన్ సామ్రాజ్యవాదులకు పనిముట్టులా ఉపయోగపడిన ఐక్యరాజ్య సమితి కార్యాలయాన్ని కూడా వాళ్లు వదల లేదు. ఇరాక్ గెరిల్లాలు దాడి జరిపి అమెరికన్ సైనికుల్ని చంపి పడేస్తే నిమిషాల్లో అక్కడికి చేరుకున్న ప్రజలు వాళ్ల శవాలను కాళ్లతో తన్నిన ఘటనలూ, గెరిల్లాలు పేల్చేసిన వాహనాల పైకి ఎక్కి గంతులేస్తూ సంతోషాన్ని వెలిబుచ్చుతున్న ఘటనలూ వాళ్ల మనసులలో రగులుతున్న విద్వేషాగ్నికి వ్యక్తీకరణలు మాత్రమే. జోర్డాన్ రాయబార కార్యాలయంపై ఆత్మాహుతి దాడి జరిగి భవనం చాలా వరకు దెబ్బతినిపోగా వెంటనే వందలాది మంది ప్రజలు అందులోకి జొరబడి అక్కడ ధ్వంసం కాకుండా మిగిలిపోయిన జోర్డాన్ రాజు చిత్రపటాన్ని కింద పడేసి తొక్కడం వాళ్ల ఉన్నత స్థాయి రాజకీయ చైతన్యానికి ఒక ఉదాహరణ. ఇరాక్‌పై దురాక్రమణను జోర్డాన్ రాజు సమర్థించినందుకు ప్రజలు వాడిపై కసితో రగిలిపోతున్నారు.

గస్తీ తిరిగే అమెరికన్ సైనికులను స్నైపర్లు మాటు గాచి కాల్చి చంపడం అక్కడ ఒక సాధారణ పోరాట రూపంగా మారింది. స్వయంగా పనిచేయగల రాకెట్లనూ, భూమిపై నుండి ఆకాశంలోకి ప్రయోగించే మిస్సైళ్లనూ గెరిల్లాలు విరివిగా ఉపయోగిస్తున్నారు. అమెరికా సైనికులపై వాళ్లేమాత్రం ఊహించని పద్ధతుల్లో దాడులు జరుపుతున్నారు. అయితే అమెరికా బలగాలు ప్రజల తిరుగుబాటును అణిచే పేరిట లెక్కలేనన్ని అమానుష హత్యాకాండలకు పాల్పడుతున్నాయి. నిరంతరం ఇండ్లపై దాడులు జరపడం, అనుమానితులను అరెస్టు చేయడం లేదా కాల్చి చంపడం వంటివి వాటి రోజువారీ కార్యకలాపాలుగా మారాయి. వీటన్నిటినీ ఎదుర్కొంటూనే ఇరాకీయులు తమ ప్రతిఘటనను సాగిస్తున్నారు. కింద ఇచ్చిన కొన్ని వివరాలు ఇరాక్‌లో సాగుతున్న బ్రహ్మాండమైన విముక్తి యుద్ధానికి కొన్ని ఉదాహరణలు మాత్రమే.

- మే 1న యుద్ధం ముగిసిందని ప్రకటించడానికి ముందూ, ఆ తర్వాతా కలిపి, అమెరికా చెప్పే ప్రకారం, 500 మందికి పైగా అమెరికన్ సైనికులు చనిపోయారు. మరెన్నో వందల మంది గాయపడ్డారు. సంయుక్త సైన్యాల సైనికులు 70 మందికి పైగా చనిపోయారు.
- జూన్‌లో జరిగిన ఒక దాడిలో ఇరాకీ గెరిల్లాలు విమానాశ్రయ ప్రాంతంలో ఒక అమెరికా క్యాంపుపై మిస్సైళ్లతో దాడి జరిపి అనేక హెలికాప్టర్లను ధ్వంసం చేసి 20 మంది అమెరికన్ సైనికులనూ, అధికార్లనూ హతమార్చి మరో 30 మందిని గాయపర్చారు.
- అక్టోబర్ 25న తిక్రిత్ పట్టణంలో ఇరాకీయులు ఒక బ్లాక్ హాక్ హెలికాప్టర్‌ను కూల్చగా ఒక అమెరికన్ సైనికుడు గాయపడ్డాడు.
- నవంబర్ 2న బగ్దాద్‌కు పశ్చిమాన ఫలూఖాలో చినుక్ అనే అమెరికా హెలికాప్టర్‌ను కూల్చగా 16 మంది సైనికులు చచ్చారు.
- నవంబర్ 7న తిక్రిత్ పట్టణంలో బ్లాక్ హాక్ హెలికాప్టర్‌ను కూలగొట్టడంతో ఆరుగురు అమెరికన్ సైనికులు చచ్చారు.
- నవంబర్ 16న జరిగిన మరో దాడిలో 17 మంది సైనికులు చావగా మరో ఐదుగురు అమెరికన్లు గాయపడ్డారు.
- నవంబర్ 30 నాడు జరిగిన మరో దాడిలో స్పెయిన్‌కు చెందిన ఏడుగురు ఇంటలిజెన్స్ అధికారులూ, జపాన్‌కు చెందిన మరో ఇద్దరు ఇంటలిజెన్స్ అధికారులూ చచ్చారు.

## సద్దాం అరెస్టుతో ప్రజా ప్రతిఘటన ఆగదు!

డిసెంబర్ 13న సద్దాం హుస్సేన్‌ను అతని స్వంత పట్టణమైన తిక్రిత్‌కు దగ్గర్లో గల ఒక గ్రామంలో అమెరికా బలగాలు చాలా నాటకీయంగా అరెస్టు చేశాయి. ఇది తాము సాధించిన ఘన విజయంగా పేర్కొంటూ అమెరికన్ పాలకులు పండుగ చేసుకున్నారు. తనకు యుద్ధంలో సహకరించని దేశాలకు ఇరాక్ "పునర్నిర్మాణం" పనుల కాంట్రాక్టులు ఇవ్వనని అమెరికా చేసిన ఏకపక్ష నిర్ణయంతో కినుక వహించిన జర్మనీ, ఫ్రాన్స్ వంటి సామ్రాజ్యవాద దేశాలు కూడా సద్దాం అరెస్టును హర్షించాయి. అతడిని కఠినంగా శిక్షించాలంటూ అమెరికాతో గొంతు కలుపుతున్నాయి. సామ్రాజ్యవాదులు విదిల్చే ఎంగిలి మెతుకులపై బతికే మీడియా ఎప్పటిలాగే సద్దాం అరెస్టుతో ఇరాక్‌లో ప్రజలు సంబరాలు జరుపుకుంటున్నారని వార్తలు ప్రసారం చేశాయి. సద్దాం ప్రతిమను కూల్చినపుడు ఇరాకీ ప్రజలు ఆనందించారని ప్రచారం చేయడం ఎంత అబద్ధమో ఇదీ అంతే అబద్ధమని వార్తలు సూచిస్తున్నాయి. సద్దాం ఒక నియంతే అయినప్పటికీ అమెరికన్ సామ్రాజ్యవాదానికి దాదాపు దశాబ్దంన్నర కాలంగా కొరకరాని కొయ్యగా నిలిచిన నాయకుడిగా, సామ్రాజ్యవాదుల వత్తిళ్లకు లొంగకుండా నిలబడ్డ నాయకుడిగా అతడికి ఇరాకీ ప్రజలలో గుర్తింపు ఉంది. పశ్చిమాసియాలో అమెరికా బంట్లయిన ఇజ్రాయిలీ జియోనిస్టులకు వ్యతిరేకంగా నిలబడ్డ లౌకికవాదిగా అతనికి మొత్తం అరబ్ ప్రపంచంలోనే గుర్తింపు ఉంది. పరాయి దేశాల సైన్యాలు తమ దేశంపై దండెత్తి తమ దేశాధినేతను ప్రభుత్వంలోంచి పడగొట్టడాన్ని, ఇప్పుడు అతన్ని అరెస్టు చేయడాన్నీ ప్రజలు ముక్తకంఠంతో ఖండిస్తున్నారు. ఇది తమ దేశ సార్వభౌమత్వంపైన పాశవిక దాడిగా ప్రజలు భావిస్తున్నారు. సద్దాం నేరస్తుడైతే అతన్ని విచారించే హక్కు గానీ, శిక్షించే హక్కు గానీ ఒక్క ఇరాకీ ప్రజలకే ఉంది. కానీ *(తరువాయి 8వ పేజీలో .....)*



# చంద్రబాబుపై పిజిఏ దాడి – ప్రజావ్యతిరేక, నియంతృత్వ విధానాలకు ఫలితం

అక్టోబర్ 1న పిజిఏ గెరిల్లాల యాక్షన్ టీం తిరుపతి నుండి తిరుమల వెళ్లే ఘాట్‌రోడ్డుపై అలిపిరి వద్ద ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుపై మందుపాతరతో దాడి జరిపింది. హైటెక్ భద్రతా ఏర్పాట్లు ఉన్నప్పటికీ పిజిఏ గెరిల్లాలు చాలా సాహసోపేతంగా ఈ దాడి నిర్వహించారు. అయితే చంద్రబాబు ప్రయాణిస్తున్న కారు బులెట్‌ప్రూఫ్ అవడం వల్ల చావు తప్పించుకోగలిగాడు. అయితే ఇప్పటి దాకా చరిత్రలో పేరుమోసిన నియంతలందరూ ఏదో ఒకరోజున ప్రజల చేతిలో కుక్కచావు చావడమో లేదా చరిత్ర పెంటకుప్పల పైకి చేరడమో జరుగుతూ వస్తున్నది. చంద్రబాబు అలిపిరి దాడిలో బతికి బైటపడ్డప్పటికీ చరిత్ర గమనాన్ని మాత్రం మార్చలేడు.



**నరహంతకుడి ముఖంలో తొంగిచూసిన చావుకళ!**

ఆంధ్రప్రదేశ్‌లో (ముఖ్యంగా ఉత్తర తెలంగాణా ప్రాంతంలో) గత కొద్ది సంవత్సరాలుగా ఉద్యమం అనేక నష్టాల్ని ఎదుర్కోవల్సి రావడంతో పార్టీ నడుం విరిగిందనీ, ఉద్యమం సన్నగిల్లిందనీ పాలకవర్గాలు తమ ప్రచార సాధనాల ద్వారా విపరీతంగా ప్రచారం చేస్తూ వచ్చాయి. ఈ దాడితో పిజిఏ తాను తలచుకుంటే ఎక్కడైనా, ఎలాంటి భద్రతా ఏర్పాట్లు ఉన్నప్పటికీ ప్రజల సహకారంతో, ప్రజాభీష్టం మేరకు ఎంతటి బలవంతుడైన ప్రజా శత్రువు పైననైనా దాడి చేయగలనని నిరూపించుకుంది. ఈ దాడి దరిమిలా దేశవ్యాప్తంగా హింసా, ప్రతిహింసలపైన పలు రకాల చర్చలు మొదలయ్యాయి. ముఖ్యంగా ఉదారవాద మేధావులు హింస మళ్లీ హింసకే దారి తీస్తుందనీ, ఇరు పక్షాలూ హింసను మానుకోవాలనీ హితవు పలుకుతూ ఎప్పటి లాగే పీడకుల హింసా విధానాలనూ, పీడితులు అనివార్యంగా చేపట్టే ప్రతి హింసాత్మక కార్యకలాపాలనూ ఒకే గాటన కట్టే ప్రయత్నం చేశారు. చంద్రబాబుపై దాడి తర్వాత మన పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ, ఉత్తర తెలంగాణా స్పెషల్ జోనల్ కమిటీ, ఆంధ్ర-ఒరిస్సా సరిహద్దు ప్రాంత స్పెషల్ జోనల్ కమిటీలు సంయుక్తంగా ఒక ప్రకటన చేస్తూ, ఈ దాడికి కారణాలేమిటో వివరించాయి. ఆ ప్రకటన సంక్షిప్త సారాంశం ఇదీ –

"విప్లవోద్యమాన్ని అణచివేసేందుకు పాశవికంగా అణచివేసేందుకు చంద్రబాబు ప్రయత్నించాడు. రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా మారుస్తానని ఊదరగొట్టే చంద్రబాబు సారా నిషేధం ఎత్తివేత, సబ్సిడీల రద్దు వంటి ప్రజా వ్యతిరేక నిర్ణయాలను తీసుకున్నాడు. ప్రజలకు నాయకత్వాన్ని లేకుండా చేయడం కోసం మా పార్టీ పైనా, ప్రజా సంఘాల పైనా నాయుడు ప్రభుత్వం 1996లో నిషేధం విధించింది. అప్పటి నుండి ఇప్పటి దాకా 1400 మంది పార్టీ కార్యకర్తలనూ, సానుభూతి పరులనూ చంద్రబాబు ప్రభుత్వం హతమార్చింది. వీరిలో పార్టీ అత్యున్నత స్థాయి నాయకులైన శ్యాం, మహేశ్, మురళిలు కూడా ఉన్నారు. వాళ్లను చంద్రబాబు పోలీసులు డిసెంబర్ 1, 1999 నాడు బెంగుళూరులో అరెస్టు చేసి విమానంలో తీసుకొచ్చి చిత్రహింసల పాలు చేసి మరునాడు కరీంనగర్ జిల్లా కొయ్యూరు అడవుల్లో కాల్చి చంపారు. ప్రజా గాయకురాలు బెల్లి లలితను చంద్రబాబు నియమించిన హంతకులు క్రూరంగా చంపేసి 17 ముక్కలుగా నరికేశారు. పౌరహక్కుల నేతలు పురుషోత్తం, ఆజం అలీలను చంద్రబాబు ప్రభుత్వం కిరాయి హంతకులతో చంపేయించింది. జననాట్యమండలి నాయకుడు గద్దర్‌పై కాల్పులు జరిపించింది కూడా చంద్రబాబు పోలీసులే. పార్టీ ఆంధ్ర రాష్ట్ర కమిటీ సభ్యుడు కా. దేవన్న, ఉత్తర తెలంగాణా ఎస్‌జెడ్‌సి సభ్యులు కా. పద్మక్క, కా. రామకృష్ణ, కా. కొమురయ్య, ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి కా. లలిత – మరెందరో ప్రజా నాయకులు చంద్రబాబు ప్రభుత్వం జరుపుతున్న ఫాసిస్టు హత్యాకాండలో అసువులు బాశారు. ఇన్‌ఫార్మర్లనూ, కోవర్టులనూ ప్రోత్సహించి నియంతృత్వ ప్రభుత్వాల్ని కూడా మించిపోయి అణచివేత విధానాలను అనుసరించింది చంద్రబాబు ప్రభుత్వం.

ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైన చంద్రబాబు ప్రభుత్వం విద్యుత్తు, సాగునీరు వంటి సమస్యల పరిష్కారంలో ఘోరంగా విఫలమైంది. దోపిడీ వర్గాల ఆర్థిక లక్ష్యాలను నెరవేర్చడంలో చంద్రబాబు ముందు భాగాన నిలబడ్డాడు. ప్రపంచ బ్యాంకు షరతులకు అనుగుణంగా సంస్కరణలు అమలు చేస్తున్నాడు. రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచేశాడు. కరువు, అధికధరలు, నిరుద్యోగం, ఆకలిచావులతో ప్రజలు అలమటిస్తుంటే సమాచార విప్లవం, టూరిజంలను అభివృద్ధిగా చూపించాలనే ప్రయత్నాన్ని ముఖ్యమంత్రి చేస్తున్నాడు. చంద్రబాబు ప్రభుత్వంలో అవినీతి తారాస్థాయికి చేరిందని చెప్పడానికి నకిలీ స్టాంపుల కుంభకోణంలో కృష్ణ యాదవ్ పాత్రే తార్కాణం. మౌలిక సమస్యల పరిష్కారంతో పాటు శాంతిసాధన కోసం మా పార్టీతో చర్చలు జరపాలని ప్రభుత్వంపై ప్రజలు వత్తిడి తెచ్చారు. తప్పించుకోలేని చంద్రబాబు ఒకవైపు చర్చలకు సిద్ధమంటూనే మరోవైపు చర్చల వాతావరణాన్ని దెబ్బతీసేట్టు నిర్బంధాన్ని అమలు జరిపాడు. అటువంటి పరిస్థితుల్లోనూ మేం ముందస్తుగా కాల్పుల విరమణ చేసి చర్చలకు వచ్చాం. అయినా చంద్రబాబు ప్రభుత్వ వైఖరి మారలేదు. పద్మక్క వంటి నాయకులను ఎన్‌కౌంటర్లలో కిరాతంగా కాల్చి చంపారు. చంద్రబాబుకు చర్చల ప్రక్రియ ఎంత మాత్రం ఇష్టం లేదు. ప్రజల ఆకాంక్షలపై ఈ ప్రభుత్వానికి గౌరవం లేదనేది దీని ద్వారా బహిర్గతమయింది. ఈ స్థితిలో మేం మళ్లీ ప్రజాయుద్ధాన్ని తీవ్రం చేశాం. మా పార్టీని నిర్మూలించడానికి తక్కువ తీవ్రతా యుద్ధతంత్ర వ్యూహాలను అమలు చేస్తున్నాడు. ఇటీవల నల్గొండ జిల్లా కమిటీ సభ్యుడు నర్సింహను హైదరాబాద్‌లో ఎస్‌ఐబీ పోలీసులు కాల్చి చంపారు. చంద్రబాబుపై మా ఈ దాడిని ఖండిస్తున్న వారందరికీ ఓ విజ్ఞప్తి చేస్తున్నాం. ముందు మీరు ప్రజల ప్రయోజనాలకు అనుకూలమో కాదో తేల్చుకోండి. ప్రజలపై హింసను ప్రయోగిస్తున్న పాలకవర్గానికి వ్యతిరేకంగా నిలబడండి. ప్రజలపై హింస జరుగుతున్నప్పుడు నిమ్మకు నీరెత్తినట్లుండి... ప్రజల ప్రతిఘటనను నిరసించడం ద్వారా మీరు ఏ వైఖరిని తీసుకుంటున్నారో తేటతెల్లమవుతోంది. ప్రజలపై హింసాకాండను ప్రజాస్వామ్యవాదులు ఖండించాలి. దాని కోసం సంఘటితంగా ఉద్యమించాలని విజ్ఞప్తి చేస్తున్నాం." ★

శ్రద్ధాంజలి

# గీదం పోలీసు స్టేషన్‌పై పిజిఏ జరిపిన దాడిలో అమరుడైన

# కామ్రేడ్ రాందాస్‌కు విప్లవ జోహార్లు!

హంతక పోలీసు బలగాల నుండి తుపాకులు లాక్కుని ప్రజా సైన్యాన్ని పటిష్టం చేయాలనే సంకల్పంతో సెప్టెంబర్ 13న పిజిఏ గెరిల్లాలు దంతెవాడకు సమీపంలో గల గీదం పోలీసు స్టేషన్‌పై రెయిడ్ జరిపారు. ఈ రెయిడ్‌లో ముగ్గురు పోలీసులు చనిపోగా, మరో ఆరుగురు పోలీసులు గాయపడ్డారు. మరి కొందరు పోలీసులు చేతులెత్తి లొంగిపోయారు. స్టేషన్ నుండి గెరిల్లాలు మొత్తం 13 ఎస్సెల్లార్లు, 18 త్రీనాట్‌త్రీ రైఫిళ్లు, 1000 తూటాలు, కొన్ని గ్రెనేడ్లు వశపర్చుకున్నారు. రెయిడ్ జరుగుతుండగానే దంతెవాడ నుండి పెద్ద ఎత్తున అదనపు బలగాలు చేరుకోవడంతో గెరిల్లాల బృందం ఒకటి వారితో తలపడుతుండగా మిగతా వాళ్లు పోలీసు స్టేషన్ నుండి రిట్రీట్ అయ్యారు. అప్పటికి కొందరు పోలీసులు లొంగకుండా కాల్పులు జరుపుతూనే ఉన్నారు. మరి కొన్ని ఆయుధాల్నీ, మందుగుండునూ ఇంకా స్వాధీనం చేసుకోనే లేదు. అయితే గెరిల్లాలు విడి విడి బృందాలుగా రిట్రీట్ అవుతున్న క్రమంలో పోలీసు స్టేషన్లో లొంగకుండా మిగిలిపోయిన పోలీసులు ఆఖరున వస్తున్న ఇద్దరు కామ్రేడ్లపై కాల్పులు జరపడంతో కా. రాందాస్ అమరుడయ్యాడు. ఆయన వెంట ఉన్న మరో కామ్రేడ్ స్వల్పంగా గాయపడ్డప్పటికీ శత్రువును ప్రతిఘటిస్తూ తప్పుకున్నాడు. జరిగింది ఇదయితే పోలీసులు దీనికి మసిబూసి మారేడుకాయ చేస్తూ కత్తితో పొడిచి చంపామనీ, ఓ పోలీసు ఉద్యోగి కూతురే తమ తండ్రిని చంపడానికి వచ్చిన నక్సలైటును గొడ్డలితో నరికి చంపిందనీ, ఇంకా పలు రకాలుగా అబద్ధపు ప్రచారం చేశారు.



కామ్రేడ్ రాందాస్ పశ్చిమ బస్తర్ డివిజన్లో ఇంద్రావతి నది ఒడ్డున గల మజ్జిమెంద్రి అనే గ్రామంలో పుట్టాడు. తల్లిదండ్రులు ఆయనను సాయిబి అని పిలుచుకునే వారు. ఈ గ్రామం చాలా ఏళ్లుగా విప్లవోద్యమానికి అండగా నిలుస్తూ వస్తున్నది. ఈ గ్రామం నుండి అనేక మంది యువతీయువకులు పార్టీలోనూ, ప్రజా సంఘాల్లోనూ చేరారు. చిన్నతనం నుండే కామ్రేడ్ రాందాస్‌పై ఈ ప్రభావం బాగా ఉండేది. ఆయన గ్రామంలో బాలల సంగంలో చేరిపోయి తను కూడా పూర్తికాలం విప్లవకారుడిగా పని చేయాలనీ, ప్రజల విముక్తి కోసం పాటు పడాలనీ కలలు గనేవాడు. మజ్జిమెంద్రికి సమీపంలోనే వెదిరె అనే గ్రామం ఉంటుంది. ఇక్కడ చాలా ఏళ్లుగా పోలీసు స్టేషన్ ఉంది. గతంలో, 1991-92 ప్రాంతంలో ప్రజా శత్రువు మహేంద్ర కర్మ నాయకత్వంలో ఇక్కడి పెత్తందార్లు కొందరు విప్లవోద్యమంపై కత్తిగట్టి పోలీసులతో చేయి కలిపి జన జాగరణ్ పేరిట ప్రజలపై నిర్బంధ క్యాంపెయిన్‌ను కొనసాగించారు. అనేక గ్రామాల్లో ప్రజా సంఘాల కార్యకర్తలను కొట్టడం, అరెస్టు చేయడం, మహిళలపై అత్యాచారాలు జరపడం, ముఖ్యులైన ప్రజా నాయకుల్ని హతమార్చడం, దళాలకై వేటాడడం వంటి అమానుష రూపాలెన్నిటినో ఈ అభియాన్‌లో ప్రయోగించారు. ప్రారంభంలో ప్రజలు వెనక్కి తగ్గినప్పటికీ, క్రమంగా పుంజుకొని సంఘటితపడి ఈ నిర్బంధ క్యాంపెయిన్‌ను చిత్తుగా ఓడించారు. వెదిరెలో పోలీసు క్యాంపు ఉండగానే మాసాల్ అనే ప్రజా శత్రువుని ఈ ప్రాంత ప్రజానీకం హతమార్చి వాడి పీడ విరగడ చేశారు. ఈ పోరాటాల ప్రభావం కామ్రేడ్ రాందాస్‌పై చాలా సానుకూలంగా ఉండేది. కనుకనే తను ఇంటి దగ్గర ఉంటూనే అనేక విప్లవ కార్యకలాపాలలో పాల్గొనసాగాడు. స్థానిక గెరిల్లా దళం ఏ బాధ్యతనప్పగించినా ఎలాంటి సంకోచం లేకుండా నిర్వర్తించేవాడు. నిర్బంధాన్నీ, పోలీసులు కొట్టే దెబ్బలనూ వేటినీ లెక్క చేయకుండా గెరిల్లాలకు వివిధ పనుల్లో సహాయపడేవాడు. ఆ క్రమంలో ఆయన బాలల సంఘం నుండి గ్రామంలో ఉన్నత బాధ్యతలను స్వీకరించేలా ఎదిగాడు.

ప్రారంభంలో దళంలోకి వస్తానని ఆయన ప్రతిపాదన తెస్తున్నప్పటికీ చిన్నవాడనే కారణంగా మరి కొంచెం కాలం పాటు చూడాలని స్థానిక బాధ్యులు అభిప్రాయపడ్డారు. ఆయన బాగా పట్టుబట్టడంతో కొద్ది కాలం తర్వాత 1999 ఆఖరున ఆయనను దళంలోకి తీసుకున్నారు. దళ జీవితంలో ఎదురయ్యే కష్టాలను ఆయన ఓపికగా, నిబ్బరంగా అధిగమించడాన్ని చూశాక అతను చిన్నవాడనే అభిప్రాయమే కలిగేది కాదు. దళ క్రమశిక్షణను అమలు చేయడంలో ఆయన మిగతా కామ్రేడ్లకు ఆదర్శంగా నిలిచేవాడు. వివిధ సమావేశాలలో వచ్చే విమర్శలను కూడా ఆయన చైతన్యపూర్వకంగా స్వీకరించేవాడు. ఈ క్రమంలో పార్టీ ఆయనను పార్టీ సభ్యత్వాన్నిచ్చి డివిజన్‌లోని ప్రత్యేక గెరిల్లా దళంలోకి సభ్యుడిగా తీసుకుంది. ఆ తర్వాత 2002లో ఆయన ఆ దళానికి డిప్యూటీ కమాండర్‌గా ఎన్నికయ్యాడు. కొద్ది నెలల కిందటే పార్టీ ఆయనను ఒక ప్రత్యేక పని కోసం ఎంపిక చేసి ఎస్‌జిఎస్ నుండి బదిలీ చేసింది.

2002 సెప్టెంబర్‌లో వెదిరె పోలీసు స్టేషన్‌పై చేసిన రెయిడ్‌లో ఆయన రన్నర్‌గా ముఖ్యమైన పాత్ర నిర్వహించాడు. ఫైరింగ్ మధ్యనే కమాండర్ ఆదేశాలను వివిధ గ్రూపులకు చేరవేస్తూ, చురుకుగా కదులుతూ సమయస్ఫూర్తిని ప్రదర్శించాడు. ఏ దాడిలోనైనా ఆయనకు అప్పగించిన బాధ్యతను ఎలాంటి తటపటాయింపూ లేకుండా నిర్వర్తించడం ఆ కామ్రేడ్‌కున్న విశిష్ట లక్షణం.

గీదం పోలీసు స్టేషన్‌పై రెయిడ్ చేయాలని పార్టీ నిర్ణయించిన తర్వాత ఆ స్టేషన్‌ను రెక్కీ చేసే *(తరువాయి 29వ పేజీలో ➔)*

*(..... చివరి పేజీ తరువాయి)*

మందుగుండునూ స్వాధీనం చేసుకోవడంలో గెరిల్లాలు జయప్రదమయ్యారు. 1998లో బాసగూడెం సమీపాన జరిగిన ఒక బ్రహ్మాండమైన ఆంబుష్‌లో కామ్రేడ్ రాజు చాలా ముఖ్యమైన పాత్ర పోషించాడు. ఆ దాడిలో 18 మంది శత్రు బలగాలను గెరిల్లాలు మట్టుబెట్టారు. శత్రువు నుండి ఆయుధాలను స్వాధీనం చేసుకునే లక్ష్యంతో 1999లో రాజ్‌నాంద్‌గాం జిల్లాలోని ఛురియా పోలీసు స్టేషన్‌పై జరిపిన రెయిడ్‌లో కూడా కామ్రేడ్ రాజు పాల్గొన్నాడు. అయితే ఈ రెయిడ్‌లో పార్టీ నాయకుడైన కామ్రేడ్ విక్రం అమరుడు కావడంతో పాటు గెరిల్లాలకు వైఫల్యాన్ని కూడా చవిచూడాల్సి వచ్చింది. అయినా "ఓటమి విజయానికి తల్లి వంటిది" అన్న స్ఫూర్తితో కామ్రేడ్ రాజు అనేక సైనిక చర్యలలో మొక్కవోని ధైర్యంతో పాల్గొన్నాడు. పార్టీ కాంగ్రెస్ తర్వాత శత్రు బలగాలపై పిజిఏ నిర్వహించిన ఎత్తుగడల ఎదురుదాడి క్యాంపెయిన్లలో కామ్రేడ్ రాజు గెరిల్లా బలగాలకు సమర్థవంతంగా నాయకత్వం వహించాడు. మాడ్ డివిజన్లో ఆకబేడ, ముహుంది తదితర చోట్ల శత్రు బలగాలపై జరిపిన దాడుల్లో కామ్రేడ్ రాజు సమర్థవంతంగా నాయకత్వం వహించాడు.

ఇంటి దగ్గర కామ్రేడ్ రాజుకు చదువు నేర్చుకునే 'భాగ్యం' కలుగలేదు. అయితే ఆయన గెరిల్లా దళంలో చేరగానే చాలా శ్రద్ధగా చదువు నేర్చుకున్నాడు. చదువుతో పాటుగా అతను గెరిల్లా డాక్టర్‌గా కూడా శిక్షణ పొందాడు. పిజిఏ సైనికులకూ, గ్రామ ప్రజలకూ వైద్య సేవలందించేంత పరిజ్ఞానాన్ని సంపాదించాడు. అతను ఒక కమ్యూనిస్టుగా తన సైద్ధాంతిక స్థాయిని మెరుగుపర్చుకునేందు కోసం సీరియస్‌గా అధ్యయనం చేశాడు. ముఖ్యంగా విప్లవ యుద్ధ సూత్రాలనూ, వివిధ దేశాల గెరిల్లా పోరాటాల అనుభవాలనూ నేర్చుకోవడానికి అతను నిరంతరాయంగా ప్రయత్నించాడు. కామ్రేడ్ రాజు స్నేహశీలి. ఎప్పుడూ ముఖంపై చెరగని చిరునవ్వుతో అందరితో కల్సిపోయే ఆత్మీయుడు. పార్టీలోనూ, పిజిఏలోనూ అతను క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచాడు. తప్పులను విమర్శించడానికి ఆయన ఎప్పుడూ వెనుకాడేవాడు కాదు. పార్టీ ఏ బాధ్యత అప్పగించినా దాన్ని నవ్వుతూ స్వీకరించి పరిపూర్తి చేయడానికి శక్తివంచన లేకుండా ప్రయత్నించేవాడు. అతను పార్టీ, పిజిఏ శ్రేణుల ఆదరాభిమానాల్ని చూరగొన్న ఆదర్శవంతమైన నాయకుడు.

నేడు దండకారణ్య ఉద్యమం కఠినమైన సవాళ్లను ఎదుర్కుంటూ ముందుకు సాగుతోంది. నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగంగా స్థావర ప్రాంతాల నిర్మాణం దిశగా దృఢంగా పురోగమిస్తూ దేశ ప్రజలందరికీ ఒక నమూనాగా నిలుస్తోంది. ఇక్కడ ప్రజల రాజ్యాధికారం మొలకెత్తుతోంది. అయితే దోపిడీ పాలకులు దీనిని ఎలాగైనా అణచివెయ్యాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. దేశంలో భూస్వామ్య, సామ్రాజ్యవాద దోపిడీ వ్యవస్థను యథాతథంగా నిలిపి ఉంచడం కోసం బస్తర్‌లో సిఆర్‌పి బలగాలను పెద్ద ఎత్తున మొహరించి భీభత్సాన్ని అమలు చేస్తున్నారు. పైకి చూస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఎన్నో వైరుధ్యాలు కనిపించినప్పటికీ, ఇక్కడి ప్రజా ఉద్యమాన్ని అణచివెయ్యడంలో మాత్రం అన్ని దోపిడీ పార్టీలదీ ఒకటే బాణీ. ఇక్కడ మన పార్టీనీ, పిజిఏనూ, పలు ప్రజా సంగాలనూ అణచివెయ్యడానికి ప్రభుత్వాలు ఇక్కడ అనేక నిర్బంధ విధానాలను అమలు చేస్తున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే దోపిడీ ప్రభుత్వాలు విప్లవోద్యమంపై అప్రకటిత యుద్ధాన్ని కొనసాగిస్తున్నాయి. మన ఉద్యమాన్ని రక్షించుకోవాలంటే ఈ ఆక్రమణ యుద్ధాన్ని ఆత్మరక్షణ యుద్ధంతో ఎదిరించాలి. అనేక ఎత్తుగడల ఎదురుదాడి క్యాంపెయిన్లను కొనసాగించి శత్రువును నిర్మూలించాలి. ప్రజలను వేల సంఖ్యలో ప్రజాయుద్ధంలో సమీకరించాలి. ఇలాంటి నిర్ణయాత్మక మలుపులో సాహసికుడైన, సమర్థుడైన యువ కమాండర్ కామ్రేడ్ రాజు లేకపోవడం పెద్ద లోటు.

కామ్రేడ్ రాజు మరణంతో పిజిఏ ఒక యోధుడైన కమాండర్‌ను కోల్పోయింది. ప్రజలు ఒక ప్రియమైన, నిస్వార్థుడైన నాయకుణ్ని కోల్పోయారు. పార్టీ ఒక అంకితభావం గల యువ కార్యకర్తను కోల్పోయింది. ఆయన మరణంతో దండకారణ్య ఉద్యమానికి, ప్రత్యేకించి పిజిఏకు చాలా పెద్ద నష్టం జరిగింది. అయితే ప్రజాయుద్ధంలో ఇటువంటి త్యాగాలు అనివార్యంగా అవసరమవుతాయి. ప్రజాయుద్ధం ఇలాంటి నాయకుల్ని తయారు చేసుకుంటుందన్నది కూడా వాస్తవం. మహోజ్వల దండకారణ్య పోరాట చరిత్రలో నేటి దాకా అనేక మంది యోధులు తమ రక్తాన్ని ధారపోశారు. అయినప్పటికీ ఉద్యమం ఆగలేదు. అదీనాడు మార్క్సిజం-లెనినిజం-మావోయిజం అరుణ బావుటాను ఎత్తిపట్టి వేగంగానూ, దృఢంగానూ అభివృద్ధి చెందుతోంది. ఒకప్పుడు బ్రిటిష్ వలసవాదుల పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు బావుటానెత్తిన 'పడియోర్'లకు (పోరాటకారులకు) కామ్రేడ్ రాజు నిజమైన వారసుడు. కామ్రేడ్ రాజు ఒక ఉన్నత ఆదర్శం కోసం, ఒక గొప్ప లక్ష్యం కోసం తన ప్రాణాల్ని ధారపోశాడు. దోపిడీ లేనటువంటి సమసమాజాన్ని స్థాపించడం కోసం తన జీవితాన్ని అర్పించాడు. నేడీ కర్తవ్యం మన భుజాలపై ఉంది. 'దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ' కామ్రేడ్ రాజుకు వినమ్రంగా జోహార్లర్పించి ఆయన మిగిల్చిన కర్తవ్యాన్ని పరిపూర్తి చేయడానికి ప్రతిన బూనుతోంది. ఆయన తల్లిదండ్రులకూ, కుటుంబ సభ్యులకూ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తోంది. ★

*(..... 28వ పేజీ తరువాయి)*

పనులలో కామ్రేడ్ రాందాస్ చాలా చురుగ్గా పాల్గొన్నాడు. తన తోటి సభ్యులెవరితోనూ తను చేస్తున్న పని గురించి ఏ మాత్రం మాట్లాడకుండా, రహస్యాన్ని కాపాడిన ఒక క్రమశిక్షణ గల యోధుడాయన. అతి చిన్న వయస్సులోనే పార్టీలోకి వచ్చి, మంచి పోరాటయోధుడిగా ఎదుగుతున్న క్రమంలో కామ్రేడ్ రాందాస్‌ను కోల్పోవడం పార్టీకీ, పిజిఏకూ చాలా నష్టం. ప్రతి పోరాటం కొత్త త్యాగాల్ని కోరుతుంది. ఎక్కడ పోరాటం ఉంటుందో అక్కడ త్యాగం తప్పక ఉంటుంది. గీదం రెయిడ్‌ను సఫలం చేయడానికి పిజిఏ కామ్రేడ్లందరూ తమ సర్వశక్తులనొడ్డి పోరాడారు. తమ ప్రాణాల్ని ధారపోసైనా సరే ఈ రెయిడ్‌ను విజయవంతం చేయాలని సంకల్పించారు. కామ్రేడ్ రాందాస్ కూడా సరిగ్గా అదే సంకల్పంతో ఆ దాడిలో పాల్గొన్నాడు. శత్రు బలగాలను నిర్మూలించి ప్రజాయుద్ధాన్ని ముందుకు తీసుకుపోయే క్రమంలో, శత్రు ఆయుధాలను చేజిక్కించుకొని ప్రజా సైన్యాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో పోరాడుతూ కామ్రేడ్ రాందాస్ అమరుడయ్యాడు. ఆయన భౌతికంగా నేడు మన మధ్య లేనప్పటికీ ఆయన సాహసం, ఆయన పట్టుదల, ఆయన సేవానిరతి, ఆయన ఆదర్శం పిజిఏ గెరిల్లాలకూ, పార్టీ సభ్యులకూ, ప్రజలకూ ప్రేరణగా నిలుస్తాయి. కామ్రేడ్ రాందాస్‌కు 'దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ' వినమ్రంగా జోహార్లు చెబుతోంది. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తోంది. ఆయన ఆశయాన్ని సాధించడానికి వందల, వేల సంఖ్యలో పిజిఏలో చేరి ప్రజాయుద్ధాన్ని పెంపొందించాల్సిందిగా ప్రజలందరికీ పార్టీ పిలుపునిస్తోంది. ★

శ్రద్ధాంజలి

# హంతక సిఆర్‌పి బలగాలతో వీరోచితంగా పోరాడుతూ ప్రాణాలర్పించిన
# సాహసిక పిజిఏ కమాండర్ కామ్రేడ్ రాజు (ఐతు)కు లాల్‌సలాం!

అక్టోబర్ 28 నాడు నారాయణ్‌పూర్-అంతాగఢ్ రోడ్డుపై పిజిఏ ఉత్తర సబ్-జోనల్ కమాండ్ నాయకత్వంలో ఎర్రయోధులు సిఆర్‌పి బలగాలపై ఒక శక్తివంతమైన ఆంబుష్ జరిపారు. ఆ దాడిలో పిజిఏ ప్లటూన్-1 కమాండర్ కామ్రేడ్ రాజు క్రూర శత్రు బలగాలతో వీరోచితంగా తలపడుతూ వీరమరణం పొందాడు. 28 సంవత్సరాల యువ కమాండర్ రాజు తన త్యాగంతో మన పార్టీ, పిజిఏల గౌరవాన్ని పెంచాడు. ఆ రోజున హంతక సిఆర్‌పి బలగాలు ప్రయాణిస్తున్న వాహనాన్ని పిజిఏ సైనికులు మందుపాతరతో పేల్చడంతో మైన్‌ప్రూఫ్‌గా చెప్పే ఆ వాహనం తునా తునకలైంది. అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు సిఆర్‌పి జవాన్లు అక్కడికక్కడే చావగా, మరి కొందరు గాయపడ్డారు. ఆ తర్వాత శత్రువు నుండి తుపాకులు స్వాధీనం చేసుకోవడం కోసం కామ్రేడ్ రాజు నాయకత్వంలోని గెరిల్లాల గ్రూపు ఒకటి ముందుకు కదిలింది. ఆ కామ్రేడ్స్ శత్రు బలగాల నుండి రైఫిల్ మాగ్జిన్లు కొన్ని స్వాధీనం చేసుకున్నారు. అయితే గాయపడ్డ పోలీసుల నుండి వారికి ప్రతిఘటన ఎదురైంది. కామ్రేడ్ రాజు శత్రు బలగాలను పూర్తిగా నిర్మూలించే ప్రయత్నంలో ఉండగా తూటా తగలడంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. పిజిఏ సైనికులు కామ్రేడ్ రాజు శవాన్ని తమ భుజాలపై తీసుకొచ్చి ప్రజల సమక్షంలో విప్లవ సాంప్రదాయాలతో అంత్యక్రియలు జరిపించారు. కన్నీటిని తుడుచుకొని కామ్రేడ్ రాజు కన్న కలలను నిజం చేస్తామని ప్రతిన బూనారు.



దక్షిణ బస్తర్ డివిజన్, కిష్టారం రేంజ్, పాలోడ్ గ్రామంలోని ఒక పేద రైతు కుటుంబంలో కామ్రేడ్ రాజు జన్మించాడు. అందరిలోకి చిన్నవాడైన తమ బిడ్డకు కుంజాం దంపతులు ఐతు అని పేరు పెట్టుకున్నారు. బాలల సంఘం సభ్యుడిగా కామ్రేడ్ ఐతు విప్లవ జీవితం మొదలైంది. చిన్నతనం నుండే అతను పార్టీ చెప్పే నూతన ప్రజాస్వామిక విప్లవ రాజకీయాలతో ప్రభావితుడయ్యాడు. ఆ గ్రామానికి ఎప్పుడు గెరిల్లా దళం వెళ్లినా తను దళంలో పూర్తికాలం కార్యకర్తగా వస్తానని ప్రతిపాదిస్తూ ఉండేవాడు. అతను 16 ఏళ్ల వాడైన తర్వాత గెరిల్లా దళంలో పూర్తికాలం కార్యకర్తగా భర్తీ చేసుకొని పార్టీ ఆ కామ్రేడ్ కోర్కెను నెరవేర్చింది. అప్పటి నుండి అతను 'రాజు' పేరుతో ప్రజలలో పని ప్రారంభించాడు. అతనిలో వర్గ శత్రువు పట్ల తీవ్రమైన ద్వేషం నిండి ఉండేది. కనుక త్వరలోనే ఒక సైన్య యోధుడిగా ఎదగసాగాడు. అతన్ని అప్పటి ఉమ్మడి బస్తర్ డివిజన్‌లో మొట్టమొదట ఏర్పాటు చేసిన ప్రత్యేక గెరిల్లా దళంలో సభ్యుడిగా పార్టీ ఎంపిక చేసింది. ఆ క్రమంలో ఆయన పార్టీ సభ్యుడిగా కూడా ఎదిగాడు. సైనిక కార్యకలాపాలలో అతను గొప్ప సాహసాన్నీ, చొరవనూ ప్రదర్శించేవాడు. ఆ తర్వాత, 1995లో దండకారణ్యంలో ఏర్పడిన మొట్టమొదటి ప్లటూన్‌లో గడ్చిరోలి, బస్తర్ డివిజన్ల ప్రత్యేక గెరిల్లా దళాలను విలీనం చేశారు. ఆ విధంగా కామ్రేడ్ రాజు మన పార్టీ చరిత్రలో మొట్టమొదటి ప్లటూన్ సభ్యుడయ్యాడు. 1999లో కామ్రేడ్ రాజును ప్లటూన్ పార్టీ కమిటీ సభ్యుడిగానూ, సెక్షన్ కమాండర్‌గానూ ఎన్నుకున్నారు. పిజిఏ స్థాపన జరిగిన తర్వాత 2001 ఏప్రిల్‌లో కొత్తగా కొన్ని ప్లటూన్లు ఏర్పడ్డాయి. కామ్రేడ్ రాజును కొత్తగా ఏర్పాటు చేసిన ప్లటూన్-5కు కమాండర్‌గా ఎన్నుకున్నారు. 2002లో పిజిఏ ఉత్తర సబ్-జోనల్ కమాండ్ సభ్యుడిగా పార్టీ అతన్ని ప్రమోట్ చేసింది. పార్టీ అవసరాల రీత్యా ఆయనను ఈ సంవత్సరం ఏప్రిల్ నెలలో ప్లటూన్-5 నుండి తిరిగి ప్లటూన్-1లోకి కమాండర్‌గా బదిలీ చేశారు. ప్లటూన్ కమాండర్ బాధ్యతలతో పాటుగా పార్టీ మాడ్ డివిజనల్ కమిటీ సభ్యుడిగా అదనపు బాధ్యతలను కూడా కామ్రేడ్ రాజు స్వీకరించాడు.

ప్లటూన్‌లో సభ్యుడిగానూ, కమాండర్‌గానూ ఉంటూ కామ్రేడ్ రాజు దండకారణ్యమంతటా అనేక సైనిక కార్యకలాపాలలో పాల్గొన్నాడు. అనేక రెయిడ్లలోనూ, ఆంబుష్‌లలోనూ సాహసంగా పాల్గొన్నాడు. 1996లో రాజ్‌నాంద్‌గాం జిల్లాలోని మాన్‌పూర్ పోలీసుస్టేషన్‌పై జరిగిన రెయిడ్‌లో కామ్రేడ్ రాజు పాల్గొన్నాడు. ఆ రెయిడ్‌లో శత్రువు నుండి దాదాపు 30 ఆయుధాలనూ, పెద్ద ఎత్తున ***(తరువాయి 29వ పేజీలో .....)***

**నవంబర్ 1– ఛత్తీస్‌గఢ్ రాష్ట అవతరణ దినం నాడు, ప్రత్యేక బస్తర్ రాష్ట్రాన్ని డిమాండ్ చేస్తూ**

**'బస్తర్ బంద్'ను జయప్రదం చేసిన బస్తర్ ప్రజలకు మా విప్లవ జేజేలు!**